ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
16-10-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 257 పేజీలు: 10+4 వెల: 6.50

న్యాయ వ్యవస్థను బెదరించలేరు: సుప్రీం సిజె
ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు 8

సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టీకరణ
మద్రాస్ హైకోర్టు తీర్పు సమర్థన
తమిళనాడు ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత

మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు

న్యూఢిల్లీ, అక్టోబరు 15: మతం మారితే రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టుమరోసారి స్పష్టం చేసింది. హిందూ మతంలోని కొన్ని >>5

సిఎన్ఎపి సేవ తప్పనిసరి అందించాలి
టెలికం సంస్థలకు ట్రాయ్ ఆదేశాలు

స్పామ్, ఫ్రాడ్ కాల్స్‌కు చెక్
1 నుంచి కాలర్ ఐడి ప్రత్యక్షం

న్యూఢిల్లీ, అక్టోబరు 15: దేశంలో తెలియని నంబర్ల నుంచి వచ్చే స్పామ్, ఫ్రాడ్ కాల్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ 1 నుంచి అన్ని టెలికాం సంస్థలు కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ (సీఎన్ఏపీ) సేవను తప్పనిసరిగా అందించాలని టెలికమ్యూనికేషన్స్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. ఈ కొత్త >>5

చేతులెత్తి.. రైతులకు దండం పెడుతున్న
వరి వేయొద్దు
సాగుకు ఇస్తే... తాగడానికి నీళ్లుండవు

డి.సిఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ, నోడల్ ఆఫీసర్‌గా రామకృష్ణారావు
దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం
నవంబర్ మొదటి వారంలో ఢిల్లీకి
మీడియా సమావేశంలో సిఎం రేవంత్
ఎల్‌నినోపై మంత్రులతో ముఖ్యమంత్రి సమీక్ష

హైదరాబాద్,అక్టోబరు15,ప్రభాతవార్త: 'ఎల్‌నినోను ఎదుర్కోవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడాలి. దేనినైనా కొనుగోలు చేయవచ్చు. కానీ నీళ్లను కొనుక్కోలేం.అందుబాటులో ఉన్న 200 టీఎంసీల నీళ్లను పొదుపుగా వినియోగించుకోవాలి. ఈ నీటిని కేవలం తాగునీటి కోసమే వాడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను,రైతులు పెద్ద మనసు చేసుకుని యాసంగిలో పంటలు వేయడం తగ్గించుకోవాలి. తప్పుడు ప్రచారాన్ని నమ్మి వరివేస్తే నారుమడి దశలోనే ఎండిపోయే ప్రమాదం ఉంది.మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఖాళీపోయే అవకాశం, అవకాశం ఉంది.వచ్చే సీజన్‌లో వరి వేయడాన్ని వాయిదా వేసుకోవాలి' అని సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న సహచర మంత్రివర్గ సభ్యులతో ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై గురువారం సాయంత్రం సచివాలయంలో చర్చించారు. అనంతరం ఆయన స్వయంగా మీడియాతో మాట్లాడుతూ '100దేశాల్లో ఎల్‌నినోప్రభావం ఉంటుందని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.ఒకప్రకృతి విపత్తు ఎల్‌నినో,తీవ్ర >>7

హైదరాబాద్‌లో గురువారం మీడియాతో సిఎం రేవంత్

2016లోనే కోల్‌డీల్..
విచారణకు రెడీ
ఏ దర్యాప్తు కావాలో కెటిఆర్ చెప్పాలి: సిఎం రేవంత్‌రెడ్డి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు15: కాంగ్రెస్ వల్లనే కరవు వచ్చిందని బిఆర్ఎస్ అనడం వాళ్ల పైశాచిక ఆనందానికి ఇది నిదర్శనం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్తాన్ రాష్ట్రాలతో పాటు బ్రిటన్, జపాన్ లాంటి దేశాల్లో కాంగ్రెస్ పార్టీ ఉందా..? అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అబద్ధాలతోనే అధికారంలోకి రావాలని, ప్రభుత్వంపై బురదజల్లాలని చూస్తున్నారు. ఎవరు పక్క రాష్ట్రాలకు వెళ్లి శుద్రపూజలు చేశారో, చేతబడి చేశారో >>7

సంపద సృష్టికర్తలకు
చేయూత
తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి
అభివృద్ధిలో భాగస్వాములు కండి
సింగిల్ విండో ద్వారా అనుమతులు
పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండ: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

గ్లోబల్ బిజినెస్ మీట్‌లో డి.సిఎం భట్టి

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: తెలంగాణలో పెట్టుబడులుపెడితే, మీ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుం దని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్-2026లో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక వేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టికర్తలకు పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం హైదరాబాద్‌ను పెట్టుబడులకు అత్యంత అనువైన గమ్యస్థానంగా నిలుపుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో భౌగోళికంగా అనువైన ప్రాంతంలో ఉండటం, పారిశ్రామిక అవసరాలకు తగిన భూమి అందుబాటులో >>5

ఎసిబికి చిక్కిన ఎఇ రాకేష్

ఎసిబి వలలో ట్రాన్స్‌కో ఎఇ
రూ.1.20 లక్షల లంచంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత

హైదరాబాద్, (సైదాబాద్) అక్టోబర్ 15, ప్రభాతవార్త: చోరీకి గురైన కరెంటు మీటర్ల స్థానంలో కొత్త వాటిని మంజూరు చేసేందుకు ఒక భవన యజమాని నుంచి లక్షా 20 వేల రూపాయలు లంచం తీసుకుంటూ టిజిఎస్‌పిడిసిఎల్ ఏఈ ఎసిబికి పట్టుబడ్డాడు. సంతోష్‌నగర్ డివిజన్‌లో గురువారం జరిగిన ఈ ఘటన స్థానికంగాసంచలనం రేపింది. సిటీ రేంజ్2లోని టిజిఎస్‌పిడిసిఎల్ ఏఈగా పనిచేస్తున్న పండాల సందయ రాకేష్ మాదన్నాపేట్‌లోని >>5

తెలంగాణకు ఇద్దరు
ఐపిఎస్‌లు
కేంద్రం కేటాయింపు
రేపు ఐపిఎస్ ప్రొబేషనరీల దీక్షాంత్ పరేడ్ 5

డెయిరీ కేంద్రాలపై టిజి సేఫ్ దాడులు
భారీగా అక్రమాలు గుర్తింపు 3

బొగ్గు దిగుమతి ముసుగులో
3 వేలకోట్ల స్కాం!
భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముఖ్యమంత్రి చీకటి ఒప్పందం
సింగరేణికి రూ.60 వేలకోట్ల బాకీ చెల్లించకుండా సంస్థను కుప్పకూల్చే కుతంత్రం చేస్తున్నారు
సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కెటిఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్,అక్టోబరు15,ప్రభాతవార్త: రాష్ట్రంలో కావాలని బొగ్గు, విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించి, ఇప్పుడుఅదే సంక్షోభాన్ని కుంటిసాకుగా చూపి విదేశీ బొగ్గు దిగుమతి పేరుతో సుమారు రూ.3,000 కోట్ల భారీ బొగ్గు కుంభకోణానికి తెర లేపడం అత్యంత దుర్మార్గం.. ఇటు సింగరేణికి ఉత్పత్తి సామర్థంఉన్నా,, అటు దేశంలో బొగ్గు వనరులు అందుబాటులో ఉన్నా, దేశీయసరఫరాను పెంచేచర్యలు తీసుకోకుండా విదేశీ బొగ్గు వైపే మొగ్గుచూపడం అనేక అనుమానాలకు తావిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క,కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిలకు గురువారం బహిరంగ లేఖ రాశారు. >>5

చేదెక్కిన చక్కెర
నిల్వలపై కేంద్రం కొరడా
వ్యాపారులు, డీలర్లకు ఆదేశాలు
నవంబరు 30 వరకు ఆంక్షలు అమలు

న్యూఢిల్లీ, అక్టోబరు 15: రాబోయే పండుగల సీజన్‌లో చక్కెర కృత్రిమ కొరతను నివారించి, వినియోగదారులకు అందుబాటు ధరల్లో చక్కెర >>5

'పవర్'పై ఫోకస్!
యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద విడతలవారీగా ఐదుగురు ఐఎఎస్‌లు
నిర్వహణ, పనితీరు తదితర అంశాలపై నివేదిక
సిఎస్ సంజయ్ జాజు కీలక ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ప్లాంట్లో తలెత్తుతున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో అధిగమించేందుకు, వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను రంగంలోకి దించింది. కార్మికులు సాధారణ లేదా సంక్లిష్టమైన పనులను స్థిరంగా, సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి సహాయపడేలా ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్ఒపి) అమలు చేయనుంది. ఇందుకు అనుగుణంగా పవర్ ప్లాంట్ వద్దే విడతలవారీగా విధుల్లో ఉండటానికి వీలుగా వీరిని డిప్యూట్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నుంచి నవంబరు 3 వరకు దాదాపు 15 రోజుల పాటు ఈ సీనియర్ అధికారులు ప్లాంట్ వద్దే ఉండి అన్ని అంశాలను పరిశీలించనున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఐఏఎస్‌ల విధులను స్పష్టం చేసింది. హరికిరణ్ గురువారం నుండి 17వ తేదీ వరకు, వెంకటేష్ ధోత్రే 18, 19 తేదీల్లో, రాహుల్ రాజ్ 22 నుంచి 24 >>5

'యాదాద్రి' సిఇపై
వేటు
15 రోజులుగా యూనిట్ 1 షట్‌డౌన్
800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజనీర్‌పై తెలంగాణ ప్రభుత్వం వేటు వేసింది. దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ స్టేజ్ 1 చీఫ్ ఇంజినీర్ సురేశ్ నాయక్‌పై చర్యలు తీసుకుంటూ నిర్ణయం తీసుకుంది. 800 >>5

అప్రకటిత కోతలు
లోవోల్టేజ్‌తో కాలిపోతున్న మోటార్లు
సాగు నీరందక ఎండుతున్న పంటలు
జనరేటర్లు, ట్యాంకర్లతో బతికించుకునే తాపత్రయం



హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: పసిఫిక్ మహాసముద్రంలో పుట్టిన ఎల్‌నినో తెలంగాణ అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆకాశం వైపు చూస్తే వాన జాడ లేదు.. ప్రాజెక్టుల్లో చూస్తే నీటిమట్టాలు అడుగంటాయి. వర్షాలు లేక జల విద్యుత్ ఉత్పత్తి పడిపోవడం, విపరీతమైన ఎండలతో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు మొదలయ్యాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం భారీగా పడిపోగా, ఉన్న కొద్దిపాటి పంటను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సాగునీరు అందక, విద్యుత్ కోతలు, కాల్వలకు నీరు వదలకపోవడం వల్ల తెలంగాణలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి.చేతికొచ్చిన పంటకళ్లముందే ఎండిపోతుంటే దానిని బతికించుకునేందుకు రైతన్నలు ఆపసోపాలు పడుతున్నారు. సరిపడా కరెంటు ఇవ్వకపోవడంతో బోరుబావుల కింద ఉన్న పొలాలు >>5

రైతుకు ధరల పంట
మక్కలకు రికార్డు రేటు
క్వింటాలు రూ.2,600
నిజామాబాద్‌లో పసుపు క్వింటాలుకు రూ.24వేలు

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: రాష్ట్రంలో మొక్కజొన్న రైతుల పంట పండింది. ప్రతి ఏటా మద్దతు ధర కంటే తక్కువకే, నష్టాల మధ్య అమ్ముకునే రైతులు ఈసారి లాభాల బాట పట్టారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువకే అమ్ముకుంటున్నారు. ఓవైపు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం, దానికి తోడు వ్యాపారులు కూడా మద్దతు ధర >>5

మీరు వాయిదా వేసిన ఆ హెల్త్ చెకప్..

హెల్త్ చెకప్ చేయించుకోవడానికి ఇదే సరైన సమయం!

మన ప్రియమైనవారు మన దగ్గర ఉన్నప్పుడు, వారి ఆరోగ్యాన్ని కూడా కాపాడుకుందాం.

- స్మార్ట్ హెల్త్ రిపోర్ట్
- హెల్త్ స్కోర్ - పోల్చి చూడండి (84 OUT OF 100)
- ఇంటి వద్ద రక్త నమూనా సేకరణ

ఐశ్వర్యం - డైమండ్

88 పరీక్షలు

- Vitamin B12
- Diabetic Profile- Sugar(F), HbA1c
- Lipid Profile
- Electrolytes (Sodium, Chloride, Bicarbonate)
- Calcium
- Iron Deficiency Profile (Iron, TIBC, Transferrin Saturation)
- Complete Blood Count
- Vitamin D
- Liver Function Tests
- Kidney Function Tests (Urea, Creatinine, Uric Acid)
- Thyroid Function Tests
- Phosphorus
- Infection Screen - ESR
- Complete Urine Analysis

₹1999

ఐశ్వర్యం - ప్లాటినం

95 పరీక్షలు

ఐశ్వర్యం డైమండ్ ప్యాకేజీలోని అన్ని పరీక్షలు
+

Cancer Screening
- Male - Prostate - PSA -Total
- Female - Ovaries - CA - 125
- Colon, Liver, Pancreas - CEA

Metabolic Screening
- Fasting insulin
- Insulin Resistence (Homa IR)
- Apo B/A 1 Ratio
- Apolipoprotein B
- Apolipoprotein A1
- Beta Cell Function
- Insulin Sensitivity

₹2999

- 38 సంవత్సరాల నమ్మకం
- 12 రాష్ట్రాలు & 250+ శాఖలు
- NABL గుర్తింపు పొందినది Central Lab in Panjagutta MC-6360

హైదరాబాద్‌లో 12 శాఖలు

Cashless Facility for CGHS

76699 76699

ఆర్జి స్కాన్స్ & ల్యాబ్స్
Ethical & Affordable Diagnostics

హైదరాబాద్ న్యూఢిల్లీ ముంబై బెంగళూరు చెన్నై కోల్‌కతా గురుగ్రామ్ పూణే అహ్మదాబాద్ త్రివేంద్రం పాండిచ్చేరి

This promotional representation of the map of India does not purport to be the political map of India

చంచల్‌గూడ జైలులో ముగిసిన కారుమూరి సునీల్ రెండు రోజుల విచారణ

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: ఎపిలో సంచలనం రేపిన లిక్కర్ స్కాంకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు అరె స్టు చేయడంతో చంచల్‌గూడ జైల్లో వున్న వైకాపా నేత కారుమూరి సునీల్ రెడ్డిని ఆ రాష్ట్ర సిఐడి అధికారులు గురువారం కూడా విచారించారు . విజయవాడ ఎసిబి కోర్టు ఆదేశాల మేరకు సునీల్ రెడ్డి రెండు రోజుల కస్టడీ విచారణ కోసం హైదరాబాద్ వచ్చిన ఎపి సిఐడి అధికారులు బు ధవారం మొదటి రోజు ఆరు గంటల పాటు నిందితుడిని ప్రశ్నించారు. రెండవ రోజు గురువారం కూడా ఆరు గంటలకు పైగా సునీల్ రెడ్డిని వి చారించారు. ఈ విచారణలో వైకాపా హయాంలో వెలుగు చూసిన లిక్కర్ స్కాంకు సంబంధించి ఎవరి పాత్ర ఎంత...? ఇందులో ఎవరెవరు ...? ఎంతమేరకు కాజేశారు...? ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఈ స్కాం జరిగింది...? ఇందులో ఎవరెవరు ప్రధాన భూమిక వహించారు...? అనే అంశాలపై సిఐడి అధికారులు సునీల్ రెడ్డిని విచారించినట్లు తెలిసింది. విచారణ ముగిసిన తరువాత సిఐడి అధికారులు విజయవాడ వెళ్లి పోయారు. విచారణ తాలూకు అంశాలను ఒకటి రెండు రోజుల్లో విజయవాడలోని ఎసిబి కోర్టుకు అందజేయనున్నారని తెలిసింది.

నిరసన కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్

వైద్య పట్టభద్రులందరికీ సమాన వేతనాలు చెల్లించాలి

ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ డిమాండ్

హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబరు 15, ప్రభాతవార్త: విదేశాలలో మెడికల్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి కూడా భారతీయ వైద్య పట్టభద్రులతో సమానంగా వేతనాలు చెల్లించాలని ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వందలాది మంది ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ డాక్టర్ సుహాన్ మాట్లాడుతూ సెప్టెంబర్‌లో ప్రారంభమయిన ఉద్యమం మరింత ఉధృతం అయిందని, ఎఫ్‌ఎంజీ వైద్యులు డీఎంఈకి వినతిపత్రం అందచేసినప్పటికీ, అధికారులు ఎటువంటి హామీ ఇవ్వలేదని, అధికారులు తమకు న్యాయం చేసేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. డాక్టర్ మొహ్సిన్ మాట్లాడుతూ భారతీయ వైద్య పట్టభద్రులకు నెలకు 29,729 రూపాయలు స్టైఫండ్‌గా చెల్లిస్తూ, విదేశీ వైద్య పట్టభద్రులకు మాత్రం కేవలం 5000 రూపాయలు చెల్లించటం ఏం న్యాయమని ప్రశ్నించారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కేవలం ఐదు వేల రూపాయలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేమని, మెజారిటీ ఎఫ్‌ఎంజీ ఇంటర్న్‌లకు ఈ మొత్తం కూడా ఇంకా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ శిషరా మాట్లాడుతూ ప్రభుత్వం ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్‌పై వివక్ష చూపటం ఆపాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన రిట్ పిటీషన్ 793-2025 ప్రకారం ఐఎంజీ ఇంటర్న్‌లతో సమానంగా స్టైఫండ్ పొందేందుకు తమకు హక్కు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమీర్, డాక్టర్ చేతన్‌లు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి, ఎఫ్‌ఎంజీ ఇంటర్న్‌లకు సమాన స్టైఫండ్ అమలు చేసేలా జీవో జారీ చేసేవరకు తమ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలో ఎఫ్‌ఎం జీలకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ పెద్దఎత్తున హాజరయ్యారు.

డెయిరీ ఉత్పత్తుల కేంద్రాలపై టిజి సేఫ్ దాడులు

భారీగా అక్రమాలు గుర్తింపు.. కొన్నింటిని మూసివేత

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందుల వి క్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు స ర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అ థారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) అధికారులు గురువారం నాడు నగ ర శివార్లలోని డైరీ ఉత్పత్తుల కేంద్రాలపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాణ్యతను గాలికొదిలేసి నాసిరకం ఉత్పత్తులను విక్రయిస్తున్న టిజి సేఫ్ అధికారులు గుర్తించారు. మధుర, యశోధ, బాలాజీ, జగన్నాథ్ డైరీ ప్రొడక్ట్స్ కేంద్రాలపై అధికారులు సోదాలు జరిపా రు. హైదరాబాద్ చుట్టుపక్కల మొత్తం ఆరు డైరీ యూనిట్లు, ఒక ట్రాన్స్‌పోర్టు కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అపరి శుభ్ర వాతావరణంలో డైరీ ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు తేలింది. ఎలాంటి లైసెన్స్ లేకుండానే గుట్టుచప్పుడు కాకుండా ఈ యూనిట్లు నడు స్తున్నట్లు గుర్తించారు. సరైన నిలువ వసతులు లేకపోవడంతోపాటు, ఉష్ణోగ్రత నియంత్రణ పాటించ కుండా డైరీ ఉత్పత్తులు నిలువ చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజ్ వాహనాలను ఉపయోగించకుండా, ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి బస్సులు, ఇతర వాహనాల ద్వారా హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్న 3.6 టన్నుల కల్తీ కోవాను అధికారులు స్వా ధీనం చేసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన పలు డైరీ యూనిట్లను సీజ్ చేయడంతో పాటు, మరికొన్నింటికి షోకాజ్ మరియు ఇంప్రూవ్ మెంట్ నోటీసులు జారీ చేశారు.

వడ్డీరేట్లను సవరించిన ఎస్‌బిఐ

ముంబయి, అక్టోబరు 15: దిగ్గజ ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణగ్రహీతలపై వడ్డీ భారాన్ని పెంచింది. వివిధ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తూ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. సవరించిన ఈ నూతన రేట్లు గురువారంనుంచే అమల్లోకి వస్తాయని ప్రకటించింది. రిజర్వుబ్యాంకు ఇటీవల రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల మేర పెంచిన నేపథ్యంలో ఎస్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపుతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలకు సంబంధించిన నెలవారీ వాయిదాలు పెరగనున్నాయి. ఎస్‌బీఐ తాజా సవరణ ప్రకారం, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు 7.90 శాతం నుంచి 8.15 శాతానికి పెరిగింది. రెపో లింక్డ్ లెండింగ్ రేటు 7.50 శాతం నుంచి 7.75 శాతానికి చేరింది. ఈ రెండు రేట్లు పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) మేర పెరిగాయి. సాధారణంగా కొత్త గృహ, వాహన రుణాలు ఈ రేట్లకే అనుసంధానమై ఉంటాయి కాబట్టి, ఈ రుణాల ఈఎంఐలు తక్షణమే పెరగనున్నాయి. వీటితో పాటు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటును కూడా ఎస్‌బీఐ సవరించింది. మూడు నెలలు, ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల కాలపరిమితి కలిగిన ఎంసీఎల్‌ఆర్‌పై వడ్డీ రేటును 15 బేసిస్ పాయింట్ల (0.15) మేర పెంచింది. దీంతో ఏడాది కాలపరిమితి గల ఎంసీఎల్‌ఆర్ 8.70 శాతం నుంచి 8.85 శాతానికి చేరుకుంది. పాత గృహ రుణాలు, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలు ఎక్కువగా ఎంసీఎల్‌ఆర్‌తో ముడిపడి ఉంటాయి.

ఆసియా క్రీడల విజేతలను అభినందించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, అక్టోబరు 15: ఆసియా క్రీడల్లో పతకాలతో మెరిసిన భారత బృందాన్ని ప్రధాని నరేంద్ర మోడీ అభినందించారు. దేశం గర్వపడే ప్రదర్శన చేసిన క్రీడాకారులతో గురువారం భేటీ అయిన మోడీ మీరు 140 కోట్ల భారతీయులను గర్వపడేలా చేశారని అన్నారు. ఆసియాడ్‌లో ముప్పన్నెల జెండాను రెపరెపలాడించిన అథ్లెట్లు, క్రికెట్ టీమ్‌లను ప్రధాని ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో సన్మానించారు. ఈ సందర్భంగా భారత బృందం సతకాలు చేసిన జెర్సీని మోడీకి బహూకరించింది. ఐయిచీ - నగోయ వేదికగా జరిగిన 18వ ఆసియా క్రీడల్లో పతకాలు కొల్లగొట్టిన భారత బృందాన్ని గురువారం ప్రధాని నరేంద్ర మోడీ కలిశారు. గత ఎడిషన్‌లో మాదిరిగా ఈసారి సెంచరీ కొట్టకున్నా సరే దేశ ప్రజలంతా గర్వపడే ప్రదర్శన చేసినందుకు వారిని మోడీ అభినందించారు. మీరు 140 కోట్ల భారతీయులు గర్వపడేలా చేశారు. పోడియం మీద త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగరేయడం మీరు సాధించిన పెద్ద విజయం. అందుకే ఈ విజయం మీది మాత్రమే కాదు దేశంలోని కోట్లాది మందికి చెందుతుంది. దేశ ప్రజలందరి తరఫున మిమ్మల్ని అభినందిస్తున్నా అని పేర్కొన్నారు. 18వ ఆసియాడ్‌లో గెలుపొందిన 85 పతకాల్లో 38 మహిళా అథ్లెట్లు సాధించినవే. వీటిలో పదకొండు స్వర్ణాలు ఉండడం భారత్‌కు చాలా ప్రత్యేకం. అద్భుత ప్రదర్శన చేసిన మహిళా అథ్లెట్లకు నేను శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఇక్కడ హాకీ జట్లు రెండు ఉన్నాయి. హాకీలో పురుషుల, మహిళల జట్లు స్వర్ణాలు పట్టేశాయి. ముఖ్యంగా మహిళల జట్టు 41 ఏళ్ల తర్వాత ఆసియాడ్‌లో మొదటిసారి పసిడి పతకంతో చరిత్ర లి ఖించిందని ఆసియా క్రీడల బృందంతో భేటీ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడా శాఖా మంత్రి మన్సూఖ్ మాండవీయ, భారత కోచింగ్ బృందం, తదితరులు పాల్గొన్నారు. ఇటీవలే ముగిసిన ఆసియా క్రీడల్లో వందకు పదిహేను పతకాల దూరంలో ఆగిపోయిన భారత్ నాలుగో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

'ఉపాధి' లక్ష్యంగా.. ఎల్‌నినో ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ

ఏజెన్సీ ప్రాంతాల్లో కుటుంబాలకు తప్పనిసరిగా 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలి: మంత్రి సీతక్క

హైదరాబాద్,అక్టోబరు15,ప్రభాతవార్త: ఎల్‌నినో ప్రభావం తో రాబోయే రోజుల్లో తలెత్తే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత, ఉపాధి సమస్యలు, పశువులకు పశుగ్రాసం కొరత వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఆదివాసి గిరిజన కుటుంబానికి కనీసం 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు.గురువారం విబి-జీ రాంజీ ద్వారా ఎల్‌నినో కరువు నివారణ చర్యలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సుకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అదనపు డీఆర్‌డీఓలు, పీఓలు, ఎంపీడీఓలు ఈ సదస్సులో పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధే గ్రామ అభివృద్ధి అని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి జీవనోపాధి, కనీస మౌలిక సదుపాయాలు అందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.'చిట్టచివరి గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి' అని మంత్రి స్పష్టం చేశారు. మారుమూల గిరిజన గ్రామాలు కూడా ఇతర గ్రామాలతో సమానంగా అభివృద్ధి చెందేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గతంలో ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం వివిధ శాఖల సమన్వయంతో చేపట్టిన కార్యక్రమాల స్ఫూర్తితో, ప్రస్తుతం కూడా ఐటీడీఏలు, పంచాయతీరాజ్ శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 నుంచి 18 జిల్లాలు సాధారణ వర్షపాతం కంటే 20 శాతానికి పైగా లోటుతో ఉన్నాయని సదస్సులోని నివేదిక పేర్కొంది.18 జిల్లాల పరిధిలోని 320 మండలాలల్లో తీవ్ర ఎల్‌నినో ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిందని వివరించింది. ఈ సీజన్‌లో ఎల్‌నినో పరిస్థితులు మరింత బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధానంగా ఒకే పంటకు పరిమితమవుతుందని, రెండో పంట సాగు చేసే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని మంత్రి వివరించారు. దీంతో ఆదివాసి గిరిజన కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలకమని పేర్కొన్నారు.

ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి తప్పనిసరిగా 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్‌కార్డుకు నెలకు కనీసం రూ.7,500 వేతనం లభించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సదస్సులో స్పష్టం చేశారు. ఉపాధి పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఉపాధి హామీ పథకం కింద కేవలం కూలీలకు పని కల్పించడమే కాకుండా, గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే శాశ్వత ఆస్తులను సృష్టించాలని మంత్రి సీతక్క సూచించారు. ఉపాధి హామీ కింద అందుబాటులో ఉన్న 370 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని అన్నారు. ఉపాధి హామీ పనులను స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తే గ్రామాల అభివృద్ధితో పాటు కరువు ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన మార్గదర్శకాలు అందించి, గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించాలని సూచించారు.పంచాయతీరాజ్ శాఖ, ఐటీడీఎలు, పేదరిక నిర్మూలన సంస్థలు సమన్వయంతో పనిచేసి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

సాగుకు లేదు.. తాగు'నీటి'కే ప్రాధాన్యం

సమష్టిగా తాగునీటి ఎద్దడిని ఎదుర్కొందాం

ఫిబ్రవరిలోగా సమస్య మరింతం జటిలం: సిఎస్ సంజయ్‌జాజు

చౌటకూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఎలినినో ప్రభావం రాష్ట్రంపై తీవ్రంగా కనిపిస్తున్నదని. దీంతో వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుం టున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూరు ప్రాజెక్టుతో పాటు మిషన్ భగీరథ తాగునీటి పథకాలను గురువారం సందర్శించారు. అక్కడే ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రానున్న రోజుల్లో పంటలు, తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించామన్నారు. జిల్లాల వారీగా పరిస్థితులను సమీక్షి ంచి, అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించామన్నారు. ఈ పక్షం రోజులు అత్యంత కీలకమని, వరి పంట కోతకు వచ్చే దశలో ఉన్నదని, ప్రస్తుతానికి ఎన్ని అవంతరాలెదురైనా విద్యుత్ సరఫరా చేసి పంటలను పరిరక్షి స్తామని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో తరచుగా చోటు చేసుకుంటున్న అంతరాయం వల్ల కొన్ని ప్రాంతాల్లో వరి పైరు ఎండుముఖం పడుతున్నాయని ఆం దోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను రానున్న పక్షం రోజులు జాగ్రత్తగా కాపాడుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో పంటల పరిస్థితి ప్రస్తుతం పెద్దగా ఆందోళనకరంగా లేకపోయినా, భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడమే ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యుత్ సరఫరా అందుబాటులో ఉన్నప్పటికీ భూగర్భ జలాలు లేకపోతే పంటలకు నీరందించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. రైతులు సహకారంతో ప్రస్తుత పంటలను కాపాడేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూగర్భ జలాలపై ఆందోళన.. తాగునీటికే తొలి ప్రాధాన్యం రానున్న యాసంగి సీజన్లో భూగర్భ జలాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని పంటల సాగుపై ముందస్తు ప్రణాళిక రూపొందిం చాలని అధికారులకు సూచించారు. తాగునీటి అవసరాలను మొదటి ప్రాధాన్యంగా పరిగణించాలని స్పష్టం చేశారు. రాబోయే నెలల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జిల్లాలోని ఓవర్హెడ్ రిజర్వాయర్లకు అవసరమైన అనుబంధ పనులను గుర్తించి, వెం టనే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

రానున్న 1520 రోజుల్లో పంటల పరిస్థితిని సమీక్షి స్తూ, ప్రస్తుత పంటల పరిరక్షణతో పాటు భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు సంజయ్ జాజు స్పష్టం చేశారు.సుల్తాన్ పూర్ లో పత్తి పంట పరిశీలన చౌటకూర్ మండలం సుల్తాన్పూర్ గ్రామ శివారులో సాగవుతున్న పత్తి పంటను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పరిశీలించారు.

సింగూర్ ప్రాజెక్టు వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

ప్రజల మనసు గెలుచుకొని అధికారంలోకి వచ్చాం

ఎన్నికల అక్రమాలకు కాంగ్రెస్ పాల్పడలేదు

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబరు15, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయకుండా ఎన్నికల అక్రమాలకు పాల్పలడకుండా ప్రజల మనస్సు గెలుచుకొని అధికారంలోకి వచ్చామని ఓటమిపాలైతే ప్రతిపక్షంలో ఉండి ప్రజల సమస్యల పరిష్కారం కోసం వారి గొంతులై ఉద్యమించామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గురువారం గాంధీభవన్‌లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా చిగురింత పారి జాత నరసింహారెడ్డి పదవీబాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ గెలుపు ఓటములకు భయపడలేదని ఎన్నికల్లో గెలవడానికి బిజెపి సర్ పేరుతో అడ్డదారులు తొక్కుతోందని రాజ్యాంగ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం సడిలిపోయేలా చేస్తుందని ఆవేదన చెందారు. అమిత్‌షా సర్ రాకముందు కూడా కాం గ్రెస్ పార్టీ ఓడిపోయింది అంటున్నారంటే అధికా రంలో ఉన్నప్పుడు మేం ఎంత పారదర్శకంగా ఉండటం వల్ల ప్రజాభిప్రా యం కచ్చి తంగా వెలువడిందో నిదర్శనమని అన్నారు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ కచ్చితంగా గెలిచే ఐదు నియోజకవర్గాలలో 30 శాతం ఓట్లు తొలగించి బిజెపి గెలిచినట్లు ఏనాడు అధికారంలో ఉండి కాంగ్రెస్ రాజ్యంగ విరుద్ధంగా ప్రవర్తించలేదని ఆయన చరిత్రను వివరించారు. నిరుద్యోగ సమస్య నుండి లక్షలాది ఉద్యోగాలు సృష్టించే అనేక పరిశ్రమలు నవరతన్ కంపెనీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఐఐటి వంటి సాంకేతిక విద్యాసంస్థలు,నవోదయలు వంటి పాఠశాలలు ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వలు అని ఆయన తెలిపారు.

ఈరోజు ప్రపంచంలో టాప్ 100 కంపెనీలకు సిఇఒ లుగా భారతదేశం పౌరులు ఉన్నారంటే దానికి కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి నిదర్శనం అని చెప్పారు. భారత అభివృద్ధికి పునాదులు వేసి, రాజ్యాంగాన్ని కాపాడుతూ స్వయం ప్రతిపత్తిగల సంస్థలకు ఎక్కడ ఇబ్బందులు కలగకూడదని ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ ఉందనీ అన్నారు. బెంగాల్, బీహార్ ,మహారాష్ట్ర లక్షల ఓట్లు తొలగించారు అనేక ఓట్లు దొంగతనం జరుగుతుందనీ అన్నారు. రాజ్యాంగాన్ని కాలరాస్తూ ప్రజాస్వామ్యాన్ని విస్మరిస్తూ ఎన్నికల గెలుపు మాత్రమే ధ్యేయంగా మోడీ అమిత్‌షాలు నియంతృత్వ విధానాలతో పనిచేస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. నెహ్రూ నుంచి మొదలు కొని మల్లికార్జున ఖర్గేవరకు కాంగ్రెస్ నాయకత్వం, క్షేత్రస్థాయి కాంగ్రెస్ కార్యకర్తలుప్రజాస్వామ్యవాదం సిద్ధాంతం నిబద్ధతతో ఆచరిస్తామని చెప్పారు.



గురువారం గాంధీభవన్‌లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా చిగురింత పారిజాత నరసింహారెడ్డి పదవీబాధ్యతల స్వీకరణ సందర్భంగా శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి పొన్నం, ప్రభుత్వ సలహాదారు వి హెచ్

ముగిసిన లక్ష్మీభాస్కర్ మూడు రోజుల కస్టడీ

చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: అక్రమాస్తుల కేసులో అరెస్టయిన నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ నోరి లక్ష్మీ భాస్కర్ మూడు రోజుల ఎసిబి కస్టడీ గురువారంతో ముగిసింది. సాయంత్రం వైద్య పరీక్షల అనంతరం ఆయనను తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలిం చారు. గత నెల 22వ తేదీన లక్ష్మీ భాస్కర్‌ను ఎసిబి అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే. నిమ్స్‌లో 20 ఏళ్లకు పైగా వివిద హోదాలో ప నిచేస్తూ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ స్థాయికి ఎదిగిన లక్ష్మీ భాస్కర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో వంద కోట్ల రూపాయ ల అక్రమాస్తుల కేసుకు సంబంధించి ఆయనను వెంటనే చంచల్‌గూడ జైలుకు తరలించడం విదితమే. కాగా లక్ష్మీ భాస్కర్‌పై వచ్చిన అభియో గాల్లో అనేకం తీవ్రమైనవి అవడంతో ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించాలని నిర్ణయించిన ఎసిబి ఇందుకుగానూ ఎసిబి కోర్టు అనుమతి తో మూడు రోజుల కస్టడీకి తీసుకోగా గురువారం సాయంత్రంతో ఇది ముగిసింది. మూడు రోజుల కస్టడీలో లక్ష్మీ భాస్కర్‌కు బినామీలుగా వున్న నిమ్స్‌కు చెందిన ఐదుగురు ఉద్యోగుల సమక్షంలో విచారణ చేసిన ఎసిబి అధికారులు అనేక అంశాలను రట్టు చేసినట్లు తెలిసింది. బినామీల వద్ద జప్తు చేసిన ఆస్తులపైనా విచారణ చేసిన ఎసిబి అధికారులు కీలక సమాచారం రాబట్టారని తెలిసింది. కస్టడీ విచార ణ అంశాలను ఎసిబి అధికారులు కోర్టుకు అందజేయనున్నారు.

కీసరలో మరో అవినీతి చేప

లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన డిప్యూటీ తహశీల్దార్

కీసర, అక్టోబరు 15, ప్రభాతవార్త: కీసర తహశీల్దార్ కార్యాలయంలో ల్యాండ్ సక్సెషన్ కోసం డిప్యూటీ తహశీల్దార్ సందీప్‌రెడ్డి రూపాయలు 5 లక్షలు డిమాండ్ చేయగా గురువారం రూపాయలు 2.50 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీసీబీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కీసరకు చెందిన పన్నాల బుచ్చిరెడ్డి భార్య పన్నాల సుశీల ఇటీవల మృతి చెంద డంతో అతని కుమారుడు పన్నాల గిరిధర్‌రెడ్డి తన తల్లి పేరు మీద ఉన్న సర్వే నంబరు 183,184లలో 3 ఎకరాల భూమిని సక్సెషన్ కోసం సంబంధిత రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సందీప్‌రెడ్డి 5 లక్షలు డిమాండ్ చేశారన్నారు. ఇట్టి భూమి 22ఏ ఉందని ఈ సక్సెషన్ పూర్తి చేసేందుకు లంచం డిమాండ్ చేశారన్నారు. 22ఏలో నుండి తీయాలి అంటే తహశీల్దార్, ఆర్‌డిఓ కార్యాలయాల్లో సైతం డబ్బులు ఇవ్వాలని బాధితుడికి చెప్పడం జరిగిందన్నారు. ఈ నేపద్యంలో పన్నాల గిరిధర్‌రెడ్డి 2.50 లక్షలు రూపా యలు మొదటగా తహశీల్దార్ కార్య

వార్త

మంచి మాట సులువైన కర్తవ్యం వంటిది, చెడు పలుకకుండా ఉండడానికి మూల్యం లేని మౌనం చాలు.

- టిలొట్సన్

సూత్రధారులే మూలం!

చట్టాలకు సామాన్యులు లోకువైతే సమర్థులకు చట్టాలు లోకువ అంటారు. ఏ సందర్భంలో ఎవరిని ఉద్దేశించి అన్నారో కానీ మారిన కాలమాన పరిస్థితుల్లో ఇది అక్షరాల నిజమనిపిస్తున్నది. ఆర్థిక, అంగ, అధికార, రాజకీయబలం ఉన్నవారు తప్పు చేస్తే చర్యల సంగతి అటుంచి వేలెత్తి చూపడానికి కూడా జంకే దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. హత్యలు, అత్యాచారాలు చేసినవారు ఎందరో చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకొని నిర్భయంగా తిరగ గలుగుతున్నారు. మిగిలిన విషయాలు ఎలా ఉన్నా మానవ జాతిని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల నియంత్రణలో అటు పాలకులు కానీ, ఇటు అధికార యంత్రాంగం కానీ సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నదేమోనని పిస్తున్నది. దేశవ్యాప్తంగా ఎంతో పోలీసు సిబ్బంది ఉంది. నిఘా వ్యవస్థలున్నాయి. ఏకంగా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఉంది, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర విభాగాలు ఎన్నో ఉన్నాయి. నిత్యం వెయ్యికళ్లతో నిఘా పెడుతున్నామని చెబుతున్నారు. అప్పుడప్పుడు మాదకద్రవ్యాల విక్రయదారులను పట్టుకుంటున్నారు కానీ ఇది ఆగడం లేదు. యేడాది యేడాదికి విస్తరిస్తూనే ఉంది. ఇటీవల కాలంలో దేశంలో విమానాశ్రయాల్లోనూ ఇతర ప్రాంతాల్లోనూ పట్టుబడుతున్న మాదకద్రవ్యాలు వేల కోట్లల్లో ఉంటున్నాయి. ఆ మధ్య కేరళ సమీపంలో అరేబియా సముద్రంలో నౌకాదళం స్వాధీనం చేసుకొన్న మాదక ద్రవ్యాల విలువ అంతర్జాతీయ మార్కెట్లో దాదాపు నాలుగువేల ఐదు వందల కోట్ల రూపాయలకుపైగా ఉంటుందని అధికార వర్గాలే అంచనా వేశాయి. ఇది వ్యూహం ప్రకారం వలపన్ని పట్టుకున్నది కాదు. చాలా వరకు ఇలానే అధికారులు చేస్తున్న తనిఖీల్లో పట్టుబడుతున్నాయి. విమానాల్లో రహస్యంగా తీసుకువస్తున్న మత్తు పదార్థాలు తక్కువేమీ కాదు. ఆహార సరఫరా ముసుగులో మత్తు పదార్థాలు పంపిణీ చేస్తున్న బాగోతం దేశంలో పలుచోట్ల బయటపడుతూనే ఉన్నది. పంజాబ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, హర్యానా, తదితర రాష్ట్రాల్లో మత్తుపదార్థాల వినియోగం అంతంతకు పెరుగుతున్నట్లు అధికార వర్గాలు అంగీకరిస్తున్నాయి. ముంబాయి, గోవా లాంటి నగరాలు కొకైన్‌కు కేంద్రాలుగా మారి నట్టు మాదకద్రవ్యాల నియంత్రణ సంస్థ అంగీకరించక తప్పడం లేదు. ఇక గంజాయి సాగు దేశంలో అనేక రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీగానే సాగుచేస్తున్నట్లు సమాచారం. అప్పుడప్పుడు ఎక్సైజ్ పోలీసు అధికారులు దాడులు చేసి గంజాయి పంటను ధ్వంసం చేస్తున్నా మళ్లీ రెండు, మూడు నెలల్లో రెట్టింపు స్థాయిలో సాగులోకి వస్తున్నాయి. అడవుల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఈ సాగు చేసే స్మగ్లర్లు పట్టుబడగానే అదృశ్యమైపోతున్నారు. కేవలం ఆయా ప్రాంతాల్లోని అమాయక రైతులు, రైతు కూలీలు, ఈ కేసుల్లో ఇరుక్కుపోతున్నారు. కొన్ని సంద ర్భాల్లో గంజాయి సాగు చేయడం చట్టప్రకారం నేరమనే విషయం కూడా ముఖ్యంగా గిరిజన రైతులకు తెలియడం లేదు. దీనిపై అవగాహన కలిగించడంలో అధికారగణం విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. ఇక అత్యంత విలువైన మాదకద్రవ్యాల రవాణా, వ్యాపారంలో పట్టుబడుతున్నది పాత్రధారులే. వారి వెనుక ఉండే అసలైన సూత్రధారులను పట్టుకోలేకపోతున్నారు. మాదకద్రవ్యాలు అనేక మార్గాల్లో భారత్‌కు చేరుకుంటున్నాయి. ఆఫ్ఘానిస్థాన్ నుండి ఆఫ్రికా మీదుగా భారత్‌కు చేరుకొని వివిధ మార్గాల ద్వారా దేశంలోని అన్ని నగరాలకు సరఫరా చేస్తున్నారు. కొన్ని మాదకద్రవ్యాల ముఠాలు ఈశాన్య భారతంలోనూ వివిధ తీవ్రవాద బృందాలకునిధులు అందిస్తున్నట్లు సమాచారం. ఇది దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరంగా తయారైంది. ఆ మధ్య మయన్మార్ వలసదారుల నుంచి పద్దెనిమిది ఆయుధాలు, డెబ్బైనాలుగు కోట్ల విలువైన అక్రమ రవాణా వస్తువులు, దాదాపు రెండువందల కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. ఇక కేసుల విషయంలో కూడా సంబంధిత అధికార వర్గాలు అంతగా శ్రద్ధ వహించడం లేదనే విమర్శలు న్యాయస్థానాల్లో వీగిపోతున్న కేసులు సజీవ సాక్ష్యాలుగా మిగులుతున్నాయి. అందుకే మత్తు పదార్థాల రవాణాలో పట్టుబడినవారు జైలుకు వెళ్లినాతిరిగి వచ్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. వీటన్నిటికంటే మించి మత్తు ముఠాల కదలికలపై నిఘా వేసి నియంత్రించాల్సిన నార్కోటిక్ కంట్రోల్‌బ్యూరో, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తదితర శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కూడా మత్తుపదార్థాల విస్తరణకు కారణమవుతుంది. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రస్తుతం అంతకంతకు పెరిగి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల వాడకం, వినియోగం ఆందోళన కలిగిస్తున్నది. చాపకింద నీరులా ఈ స్మగ్లర్లు తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూపోతున్నారు. ఈ జాడ్యం విస్తరించడం అత్యంత ప్రమాదకరం. మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచారణలో చూపించాల్సిన తరుణమిది. అవసరమైతే చట్టానికి మరింత పదును పెట్టాలి. ముఖ్యంగా మాదకద్రవ్యాల సరఫరాలో పట్టుబడుతున్న పాత్రధారులను కాకుండా అసలైన సూత్రధారులను బయటకు తీయాలి. ఉత్పత్తి, నిల్వ, వినియోగం వ్యాపారానికి పాల్పడడం అత్యంత తీవ్రమైన నేరాలుగా కొన్ని దేశాలు పరిగణిస్తున్నాయి. కాంబోడియా, వియత్నాం, సింగపూర్, థాయిలాండ్ లాంటి దేశాలు ఈనేరాలకు ఏకంగా మరణ శిక్ష విధిస్తున్నాయి. పాలకులు అలాంటి కఠిన శిక్షల వైపు దృష్టిసారించాలి. ఒక్కసారి మాదక ద్రవ్యాల వ్యాపారంలో, రవాణాలో పట్టుబడి రుజువైతే శాశ్వత జైలు జీవితమే శరణ్యమనే భయం ఆ స్మగ్లర్లలో కలిగించాలి. అన్నింటి కంటే ముఖ్యంగా పాత్రధారులే కాదు సూత్రధారులను కూడా పట్టుకుంటే తప్ప ఇది ఆగే పరిస్థితులు కన్పించడం లేదు. ఇందులో ఏ మాత్రం జాప్యం చేసిన యువతపై తీవ్ర ప్రభావం చూపి నేర ప్రవృత్తి పెరిగి అరాచకం ప్రబలే ప్రమాదం ఉంది.

ద్రవ్యోల్బణం నియంత్రణేది?

ఆర్థిక నమూనాలు విధాన నిర్ణయాలకు దిశానిర్దేశం చేయగలవు కానీ అన్ని సమస్యలకు పరిష్కారం చూపలేవు. చిన్న వ్యాపార సంస్థలు రుణాలపై ఎక్కువగా ఆధారపడవచ్చు. పెద్ద కంపెనీలకు నిధుల లభ్యత మెరుగ్గా ఉండవచ్చు. అందువల్ల వడ్డీ రేట్ల మార్పు అందరిపై ఒకే ప్రభావం చూపదు. చిన్న సంస్థలకు రుణవ్యయం పెరిగితే కొత్త పెట్టుబడులు పెట్టడం, కార్మికులను నియమించుకోవడం కష్టమవుతుంది. మరోవైపు, ధరల పెరుగుదల వల్ల ముడిసరుకు ఖర్చులు పెరిగినా వాటిని వినియోగదారులపై పూర్తిగా మోపలేని సంస్థల లాభాలు తగ్గవచ్చు. ఈ వ్యత్యాసాలను గుర్తించేందుకు విశ్వసనీయమైన గణాంకాలు, సమస్యలపై సరైన అంచనా, విధానాల ఫలితాలపై నిరంతర సమీక్ష అవసరం. భారతదేశం ముందున్న లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని అదుపు చేస్తూ పెట్టుబడులు, ఉపాధిని పెంచడం, ప్రజల కొనుగోలు శక్తిని కాపాడటం.

డి జె మోహన రావు

రెండువేల ఇరవైఆరు ఆర్థిక శాస్త్ర నోబెల్ పురస్కారాన్ని రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌లకు ప్రకటించడం ఆర్థిక విధానాల ముందుఉన్న కీలక ప్రశ్నను గుర్తుచేస్తోంది. దీర్ఘకాలిక వృద్ధికి ఆటంకం కలగకుండా ఆర్థిక ఒడుదొడుకులను ఎలా తగ్గించాలి? ప్రజలు, వ్యాపార సంస్థలు తీసుకునే నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకోవడంలో వీరి పరిశోధనలు తోడ్పడ్డాయి. భారతదేశానికి ఇందులోని ప్రధాన సందేశం స్పష్టం. వడ్డీ రేట్లను మార్చడం, వృద్ధి గణాంకాలను పెంచడం మాత్రమే సరిపోదు. ప్రజల ఆదాయాలు, ఖర్చులు, భవిష్యత్తుపై అంచనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక విధానాలను రూపొందించాలి. జీడీపీ, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి గణాంకాలు ఆర్థిక పరిస్థితిని తెలియజేస్తాయి. కానీ వాటి వెనుకఉన్న కారణాలను పూర్తిగా వివరించలేవు. కుటుంబాలు తమ ఆదాయం, పొదుపు, రుణ సదుపాయాలను బట్టి ఖర్చులు నిర్ణయించుకుంటాయి. వ్యాపార సంస్థలు భవిష్యత్తులో గిరాకీ, రుణ వ్యయం, ఆర్థిక అనిశ్చితిని అంచనా వేసుకుని పెట్టుబడులు పెడతాయి. ఈ నిర్ణయాలుపరస్పరం ప్రభావితం చేసుకుంటూ వృద్ధికిఊతమివ్వవచ్చు లేదామందగమనాన్ని తీవ్రం చేయవచ్చు. ఉదాహరణకు, భవిష్యత్తులో ఉద్యోగాలు తగ్గుతాయనే భయం ప్రజల్లో పెరిగితే వారు ఖర్చులను తగ్గిస్తారు. గిరాకీ పడిపోతుందన్న అంచనాతో సంస్థలు పెట్టుబడులను వాయిదా వేస్తాయి. దీంతోఉత్పత్తి, ఉపాధి మరింత తగ్గే ప్రమాదం ఉంటుంది. ఈ పరస్పర సంబంధాలను అర్థం చేసుకోవడానికి హాల్, వుడ్‌ఫోర్డ్ పరిశోధనలు బలమైన పునాదిని అందించాయి. ప్రజలు ప్రస్తుత ఆదాయాన్నే కాకుండా భవిష్యత్తులో వచ్చే ఆదాయాన్ని కూడా అంచనా వేసుకుని ఖర్చులు చేస్తారని హాల్ పరిశోధనలు వివరించాయి. ఉద్యోగం, వేతనం, భవిష్యత్తు అవకాశాలపై నమ్మకం ఉంటే తాత్కాలిక ఇబ్బందుల్లోనూ కొందరు ఖర్చులను కొనసాగిస్తారు. అనిశ్చితి పెరిగితే ఖర్చులు తగ్గిస్తారు. అయితే, పొదుపు తక్కువగా ఉండి, రుణ సదుపాయాలు పరిమితంగా ఉన్న కుటుంబాలకు ఆదాయం తగ్గిన వెంటనే ఖర్చులు తగ్గించడం తప్ప మరో మార్గం ఉండకపోవచ్చు. అందువల్ల ఒకే స్థాయిలో ఆదాయం తగ్గినప్పటికీ అన్ని కుటుంబాలపై దాని ప్రభావం ఒకేలా ఉండదు. ఈ వ్యత్యాసాలను గుర్తించడం ఆర్థిక విధానాలను సమర్థంగా రూపొందించేందుకు అవసరం. ఈ ప్రవర్తనకు ద్రవ్య విధానాన్ని అనుసంధానించడంలో వుడ్‌ఫోర్డ్ పరిశోధనలు కీలకమయ్యాయి. కేంద్ర బ్యాంకు ప్రస్తుత వడ్డీరేటును నిర్ణయించడమే కాకుండా, భవిష్యత్తులో తన విధానం ఎలా ఉండబోతోందన్న విషయంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. అలా కల్పించే నమ్మకం రుణాలు తీసుకోవడం, ఖర్చులు చేయడం, ధరలు నిర్ణయించుకోవడం వంటి నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. వడ్డీ రేట్లు భవిష్యత్తులో పెరుగుతాయనే అంచనా ఉంటే కొన్ని కుటుంబాలు, సంస్థలు ముందుగానే తమ ఆర్థిక నిర్ణయాలను మార్చుకోవచ్చు. అదే విధానాలపై నమ్మకం ఉంటే అనిశ్చితి తగ్గి దీర్ఘకాలిక ప్రణాళికలకు అవకాశం ఏర్పడుతుంది. ముఖ్యంగా ధరలు నిరంతరం పెరుగుతాయన్న అంచనాలు బలపడుతున్నప్పుడు లేదా ఆర్థిక కార్యకలాపాలు బలహీనపడినప్పుడు కేంద్ర బ్యాంకు విశ్వసనీయతకు ప్రాధాన్యం పెరుగుతుంది. భారతదేశంలో వృద్ధిని కొనసాగిస్తూనే ప్రజల కొనుగోలు శక్తిని కాపాడుకోవడం ప్రధాన సవాలు. అధికారిక అంచనాల ప్రకారం, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వాస్తవ జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. అయితే, ఈ గణాంకం ఒక్కటే ప్రజల ఆదాయాలు, ఉపాధి అవకాశాలు, జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని నిరూపించదు. వృద్ధి ఫలితాలు ఉత్పాదక పెట్టుబడులు, స్థిరమైన ఉపాధి, కుటుంబాల కొనుగోలు శక్తిగా ఎంతవరకు మారుతున్నాయో కూడా పరిశీలించాలి. ఆర్థిక వృద్ధి వేగంగా ఉన్నప్పటికీ ఉద్యోగాల కల్పన బలహీనంగా ఉంటే, ఆదాయాలు కొద్దిమంది వర్గాలకే ఎక్కువగా పరిమితమైతే దేశీయ గిరాకీకి అవసరమైన విస్తృత పునాది ఏర్పడదు. అందువల్ల వృద్ధి రేటుతోపాటు దాని నాణ్యత, ప్రయోజనాల విస్తరణను కూడా అంచనా వేయాలి. ఆహార ధరలు పెరిగినప్పుడు తక్కువ ఆదాయ కుటుంబాలు తమ సంపాదనలో అధిక భాగాన్ని నిత్యావసరాలకే ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇతర వస్తువులు, సేవలపై వ్యయం తగ్గడంతో వాటికి గిరాకీపడిపోవచ్చు. దాని ప్రభావం ఉత్పత్తి, ఉపాధిపై కూడా పడుతుంది. అంటే, సరఫరాలో ఏర్పడిన సమస్యతో మొదలైన ధరలపెరుగుదల క్రమంగా మొత్తం ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయవచ్చు. అంతేకాక, నిత్యావసరాల ధరలు పెరిగినప్పుడు కుటుంబాలు విద్య, ఆరోగ్యం, ఇతర ముఖ్యమైన అవసరాలపై ఖర్చులను కూడా తగ్గించుకునే పరిస్థితి రావచ్చు. దీనిప్రభావం తక్షణ వినియోగానికే పరిమితం కాకుండా ప్రజల జీవన ప్రమాణాలపైనా పడుతుంది. అందువల్ల కొనుగోలు శక్తిని కాపాడటం సామాజిక సంక్షేమానికే కాకుండా దేశీయ గిరాకీ నిలకడకు కూడా అవసరం. ఈనేపథ్యంలో భారతీయ రిజర్వుబ్యాంకు ధరలు పెరగడానికి గల కారణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి. గిరాకీ అధికమవడంవల్ల ధరలు పెరుగుతున్నప్పుడు వడ్డీరేట్ల పెంపు రుణాలు, ఖర్చులను తగ్గించి ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయవచ్చు. కానీ ఆహార కొరత, రవాణా సమస్యలు లేదా అంతర్జాతీయ ఇంధన ధరల పెరుగుదలను వడ్డీ రేట్లతో పరిష్కరించలేం. ఇలాంటి సందర్భాల్లో ఉత్పత్తిని పెంచడం, నిల్వ సదుపాయాలను మెరుగుపరచడం, రవాణా సమస్యలను తొలగించడం అవసరం. అదే సమయంలో ధరల పెరుగుదల దీర్ఘకాలం కొనసాగితే ప్రజలు, వ్యాపార సంస్థలు భవిష్యత్తులోనూ ధరలు పెరుగుతాయని భావించి తమ నిర్ణయాలను మార్చుకోవచ్చు. అందువల్ల ద్రవ్యోల్బణం మూల కారణాన్ని గుర్తించడంతోపాటు అది ఇతర రంగాలకువ్యాపించే ప్రమాదాన్ని కూడా విధాన నిర్ణేతలు అంచనా వేయాలి. ప్రభుత్వ ఆర్థిక విధానం కూడా ఇదే సమతుల్యతను పాటించాలి. రహదారులు, రైల్వేలు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు ఉపాధిని పెంచడంతోపాటు దీర్ఘకాలిక ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి. రైతులకు మెరుగైన నిల్వ, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంటే పంట నష్టాలు తగ్గి సరఫరా వ్యవస్థ బలపడుతుంది. ధరల పెరుగుదలతో ఇబ్బందిపడే వర్గాలకు లక్షిత సాయం అందించాలి. అదే సమయంలో ప్రణాళికలేని రాయితీలు, అధికప్రభుత్వ వ్యయాలు ఆర్థిక భారాన్ని పెంచకుండా జాగ్రత్తపడాలి. అవసరమైనవారికి అండగా నిలుస్తూనే పెట్టుబడులు, ఉత్పాదకత, ఉపాధికి ఆటంకం కలగకుండా చూడాలి. ద్రవ్యోల్బణం, బలహీనమైన గిరాకీ, అంతర్జాతీయ అనిశ్చితి ఒకేసారి ఎదురైనప్పుడు ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు సమన్వయంతో వ్యవహరించాలి. ఆర్థిక నమూనాలు విధాన నిర్ణయాలకు దిశానిర్దేశం చేయగలవు కానీ అన్నిసమస్యలకు పరిష్కారం చూపలేవు. చిన్న వ్యాపార సంస్థలు రుణాలపై ఎక్కువగా ఆధారపడవచ్చు. పెద్దకంపెనీలకు నిధుల లభ్యత మెరుగ్గా ఉండవచ్చు. అందువల్ల వడ్డీరేట్ల మార్పు అందరిపై ఒకే ప్రభావం చూపదు. చిన్న సంస్థలకు రుణవ్యయం పెరిగితే కొత్త పెట్టుబడులు పెట్టడం, కార్మికులను నియమించుకోవడం కష్టమవుతుంది. మరోవైపు, ధరల పెరుగుదల వల్ల ముడిసరుకు ఖర్చులు పెరిగినా వాటిని వినియోగదారులపై పూర్తిగా మోపలేని సంస్థల లాభాలు తగ్గవచ్చు. ఈ వ్యత్యాసాలను గుర్తించేందుకు విశ్వసనీయమైన గణాంకాలు, సమస్యలపై సరైన అంచనా, విధానాల ఫలితాలపై నిరంతర సమీక్ష అవసరం. భారతదేశం ముందున్న లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని అదుపు చేస్తూ పెట్టుబడులు, ఉపాధిని పెంచడం, ప్రజల కొనుగోలు శక్తిని కాపాడటం. ఇందుకోసం వడ్డీ రేట్ల మార్పులతోపాటు ప్రభుత్వ పెట్టుబడులు, ఉత్పత్తి పెంపు, సరఫరా వ్యవస్థల మెరుగుదల వంటి చర్యలను అవసరానికి అనుగుణంగా అమలు చేయాలి. ఆర్థిక విధానాల లక్ష్యం కేవలం గణాంకాల్లో మెరుగుదల చూపడం కాకుండా, ప్రజల జీవితాల్లో స్థిరత్వాన్ని పెంచడం కూడా కావాలి. దాని ప్రయోజనాలు విస్తృత వర్గాలకు చేరినప్పుడే ఆర్థిక వృద్ధి నిజమైన అభివృద్ధిగా మారుతుంది. ●

ఎల్‌నినో నేర్పెను... నీటి విలువ!

కొలను వెంకటేశ్వర రెడ్డి

ప్రతి నీటి చుక్క విలువైనదే, డేటా సెంటర్ల నీటి అవసరాలపైనా ముందుచూపు అవసరమే కేప్‌టౌన్‌లో తలెత్తిన తీవ్రమైన నీటి సంక్షోభం, మహారాష్ట్రలోని లాతూర్‌కు రైళ్ల ద్వారా నీటిని తరలించిన పరిస్థితులు మనకు ఇచ్చిన హెచ్చరిక ఒక్కటే, నీరులేని అభివృద్ధికి అర్థంలేదు. హైదరాబాద్ జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గుతున్నాయన్న వార్తలు, భూగర్భ జలాలు అడుగంటుతున్న వాస్తవాలు మనల్ని అప్రమత్తం చేయాలి. వర్షాలు తగ్గినప్పుడు, అవసరానికి సరిపడా నీరుఅందుబాటులో లేనప్పుడు, నిన్నటి నిర్లక్ష్యమే రేపటి సంక్షోభంగా మారుతుంది. చెరువులను పూడ్చి భవనాలు నిర్మించడం, అడవులను నరికివేయడం, వర్షపు నీరుభూమిలోకి ఇంకే మార్గాలను మూసివేయడం, నీటిని విచ్చలవిడిగా వాడటం, ఇవన్నీ జలసంక్షోభానికి కారణాలే. కుళాయి తిప్పితే నీరు వస్తుందనే నమ్మకంతో వాహనాలను పైపులతో కడగడం, ర్యాంపులు, సెల్లార్లు, రోడ్లపై నీటిని పారించడం సాధారణమైపోయింది. కానీ ఆ నీరు ఎక్కడి నుంచి వస్తోంది? తిరిగి మన భూగర్భ జలాలను నింపేందుకు మనం ఏం చేస్తున్నాం? ఈ ప్రశ్నలు ప్రతి ఒక్కరినీ వెంటాడాలి. వ్యక్తిగత పొదుపుతో పాటు పారిశ్రామిక బాధ్యత కూడా ముఖ్యమే. ఇక్కడ మరో కీలకమైన అంశాన్ని విస్మరించకూడదు. తెలంగాణను దేశంలోనే ప్రధాన డేటా సెంటర్ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం పెట్టుబడులు, ఉద్యోగాలు, సాంకేతిక అభివృద్ధికి అవకాశాలను కల్పించవచ్చు. అయితే, కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్ సేవలకు అవసరమైన డేటాసెంటర్లలోకంప్యూటర్లను చల్లబరచడానికి గణనీయమైన నీరు, విద్యుత్తు అవసరమవుతాయి. దేశంలోని డేటా సెంటర్లలో సగానికి పైగా నీటి ఒత్తిడి ఉన్న ప్రాంతాల్లోనే ఉన్నాయని వరల్డ్‌రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ఇండియా అధ్యయనం హెచ్చరిస్తోంది. తెలంగాణ కూడా ఈసవాలును ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లోఒకటి. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో భారీ డేటా సెంటర్లకు అనుమతులు ఇచ్చేటప్పుడు వాటి నీటి అవసరాలను సమగ్రంగా అంచనా వేయడం తప్పనిసరి. అభివృద్ధిని వ్యతిరేకించడం పరిష్కారం కాదు. కానీ ప్రజల తాగునీటి అవసరాల కంటే పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా సరైన విధానం కాదు. డేటా సెంటర్లకు సాధ్యమైనంత వరకుశుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించడం, నీటి పునర్వినియోగ వ్యవస్థలను తప్పనిసరి చేయడం, తక్కువ నీరు అవసరమయ్యే శీతలీకరణ సాంకేతికతలను ప్రోత్సహించడం అవసరం. ప్రతి ప్రాజెక్టుకు రోజువారీ నీటి అవసరం, నీటి వనరు, భూగర్భజలాలపై ప్రభావం, అత్యవసర పరిస్థితుల్లో నీటి వినియోగ ప్రణాళికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. పరిశ్రమలు తెచ్చేపెట్టుబడుల లెక్కలతోపాటుఅవి వినియోగించే నీటి లెక్కలూ ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలి. కారుతున్న కుళాయిలను వెంటనే బాగుచేయాలి. వాహనాలను పైపులతో కాకుండా బకెట్‌తో కడగాలి. రోజు వారీ శుభ్రతకు నీటినిపారబోయకుండా చీపురుతోఊడ్చాలి. కూరగాయలు కడిగిన నీటిని మొక్కలకు ఉపయోగించాలి. ప్రతి భవనంలో వర్షపు నీటిసంరక్షణ, నీటి పునర్వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి. సమాజంలో యువత ముందు కొచ్చి ఇంటింటికీవెళ్లి నీటిపొదుపు ప్రాధాన్యాన్ని వివరించాలి. ప్రతి కుటుంబం రోజూ కొంతనీటిని ఆదా చేస్తే సమాజానికి గణనీయమైన ప్రయోజనం కలుగుతుంది. నీటి సంక్షోభం కేవలం ప్రభుత్వ సమస్యకాదు, అది అందరి బాధ్యత. ●

మరువలేని చారిత్రక శోధకుడు డా.ముదిగొండ

ఎ.వి.వి ప్రసాద్

కొందరు చరిత్రను సృష్టిస్తారు. మరికొందరు ఆ చరిత్రను రచిస్తారు. అయితే చరిత్ర రచనలో చరిత్రను సృష్టించేవారు అరుదుగా కనిపిస్తారు. వారిలో అగ్రగణ్యులు డా. ముదిగొండ శివప్రసాద్. చరిత్రలోని ఎన్నో అంశాలను తీసుకొని ప్రామాణికత తగ్గకుండా రచనలు చేసినవారిసంఖ్య ఆధునికుల్లో వేళ్లమీద లెక్కించవచ్చు. చారిత్రక అంశాలతో నవలారచన చేసి 'చారిత్రక నవలా చక్రవర్తి' బిరుదు అందుకొన్నది కూడా ఆయనే. 'ఎ జనరేషన్ విచ్ ఇగ్నోర్స్ హిస్టరీ హేజ్ నో పాస్ట్ నో ఫ్యూచర్' అన్నాడు ప్రముఖ ఆంగ్ల రచయిత రాబర్ట్ ఎ హెన్లైన్. అంటే చరిత్రను విస్మరించే వారికి గతమూ ఉండదు, భవిష్యత్తూ ఉండదన్నమాట, దానిని బాగా ఆకళింపు చేసుకొన్నందునో ఏమో! తాతలనాటి కథలన్నీ తవ్వితీసి, వాటిలోని వాస్తవాలను వడబోసి, దానికి తన వర్ణనాశక్తిని జోడించి తెలుగు వారిగత వైభవచరిత్రను టన్నుల కొద్దీ పేర్చారు డా. ముదిగొండ. దేశభక్తి, జాతీయ సమైక్యతా దృష్టి ఉన్న రచయిత నుంచే వాస్తవికతను ప్రతిబింబించే రచనలు జాలువారుతాయి. ఆ రెండు లక్షణాలు పుష్కలంగా ఉన్నందునే నాగానిక, శ్రీలేఖ, శ్రీపదార్చన, తంజావూరు వైభవం వంటి గొప్ప రచనలు చేయగలిగారనిపిస్తుంది. ఆయన రచించిన 150 పైగా గ్రంథాలలో చరిత్రకు దర్పణం పట్టేవి రెండు డజన్లుపైనే ఉన్నాయి. ఒక విశ్వనాథ, ఒకనోరి నరసింహశాస్త్రి తరహాలో ఒక ముదిగొండ అనిపించుకొన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన ఒక చారిత్రక రచనల కొండ. ఆంధ్రుల చరిత్ర గురించి గతంలో అనేక మంది పండిత కవులు పలు గ్రంథాలు రచించినా వాటిలో కల్పితాలు ఎక్కువ. అందుకే అవి కావ్యాలుగా వన్నెకెక్కాయి. ఆ మార్గాన్ని ప్రక్షాళనం చేసి చరిత్రను వాస్తవిక దృక్పథంతో అందించే ప్రయత్నం చేశారు ముదిగొండ. శాతవాహనులు, కాకతీయులు, విజయనగర, తంజావూరు నాయకరాజులు, ముసునూరు రాజవంశాల చరిత్రలు తీసుకొని ఎన్నో నవలలుగా అందించారు. కేవలం శాతవాహనుల ఇతివృత్తాలతోనే ఆరు నవలలు రాశారు. కాకతీయులు కాలం నాటి చరిత్రను అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. 'తంజావూరు విజయం' చారిత్రక రచనల్లోనే ఆణిముత్యం అనిచెప్పవచ్చు. ఆ ఒక్క పుస్తకం 3లక్షల ప్రతులు పైగా అమ్ముడయిందంటే ఆయన రచనలకు గల పాఠకాదరణ ఎంతటితో ఊహించుకోవచ్చు. హైందవజాతి వైభవోజ్వల చరిత్రను మథించి, తాను ఏర్పరచుకున్న బాటలోదానిని పదిమందికి పరిచయం చేయడానికి శ్రీలేఖ, శ్రావణి, నాగపూర్ణిమ, అమృతోదయం వంటి మేలిమి రచనలుచేశారు. చరిత్ర అంటే రాజులు, యుద్ధాలు, తేదీలు, వాటి సమాహారంగా గాక ఆయా పాత్రలతో ఒక సజీవమైన కథగా రూపొందించి, ఒక గొప్ప చరిత్రను తెలుసుకొన్నామనే అనుభూతి పాఠకునిలో కలిగిస్తే రచయిత ప్రతిభకు అంతకు మించిన కొలమానం ఏముంటుంది! ప్రాచీన భారతీయ, గ్రీకు సాహిత్యం, నాటకాలు, తత్వశాస్త్రాన్ని బాగా ఆకళింపు చేసుకొని, ఆసారాన్ని తెలుగు పాఠకులకు తగినట్లుగా అందించారు ముదిగొండ. వంశధార, బసవగీత, గంగ నుంచి గంగవరకు, పుష్యమిత్ర వంటి రచనలు పరిశీలిస్తే ఇదే విషయం అర్థమవుతుంది. అందుకే ఆయన చారిత్రక రచనలు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంథాలుగాగౌరవాన్ని అందుకొన్నాయి. ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని ఆకులల్లూరులో 1940లో జన్మించిన శివప్రసాద్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణకుముందు కొన్ని పత్రికలకు సంపాదకత్వం కూడావహించారు. డా.సి.నారాయణ రెడ్డి మార్గదర్శకత్వంలో 'ఆధునికాంధ్ర కవిత్వంపై ఉద్యమాల ప్రభావం' అనే అంశంపై పరిశోధనతో డాక్టరేట్ పొందారు. ప్రాచీన ఆంధ్రుల రాజకీయ వైభవం, ధాన్యకటక ప్రాంత చరిత్ర, బౌద్ధసంస్కృతి, అప్పటి సామాజిక జీవన విధానాలు తెలియాలంటే శ్రీలేఖ, శ్రావణి, వసంతగౌతమి వంటి రచనలు చదవాల్సిందే. ఆచార్య నాగార్జునుని కాలం నాటి చారిత్రక పరిస్థితులపై అవగాహన కలగాలంటే 'నాగపూర్ణిమ' చదవాలి. కాకతీయుల చరిత్రపై కూడా ఎన్నో ప్రామాణిక రచనలు ఆయన చేశారు. వేయిస్తంభాల గుడిని నేపథ్యంగా తీసుకొని రాసిన 'ఆవాహన' నవల కాకతీయుల కాలం నాటి చారిత్రక పరిణామాతో 'మాలిక్ కాఫర్' నవల, సమ్మక్కసారలమ్మల చరిత్ర, తెలంగాణ ప్రాంత జానపద సంప్రదాయాల నేపథ్యంలో 'చంద్రకళ' వంటి రచనలు చేశారు. కాకతీయ సామ్రాజ్యపతనం తరువాత ఆంధ్రదేశ చరిత్రలో కీలకపాత్ర పోషించిన ముసునూరు నాయకుల చరిత్రను 'అమృతోదయం' ద్వారా ఆ పాఠకులకు అందించారు. ఆయన పరిశోధనా వైదుష్యానికి ప్రతీకగా నిలిచిన గ్రంథం 'కాకతీయ కళాదర్శనం'. ఆ కాలంలోని రాజ్యపాలన, సామాజిక వ్యవస్థ, సాహిత్య వికాసం, శిల

గురువారం చెన్నైలో తమిళ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్లేకర్

మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు

>> సామాజిక వర్గాల నుంచి ఇస్లాంలోకి మారిన వారికి వెనుకబడిన తరగతుల ముస్లిం రిజర్వేషన్ ప్రయోజనాలను విస్తరించకూడదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తాజాగా సమర్థించింది. ఒక మతంలో ఉన్న సామాజిక వెనకబాటుతనాన్ని మరో మతంలోకి మారిన తర్వాత కూడా అదే విధంగా పరిగణించలేమని పేర్కొంది. ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఆ అంశంపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ చంద్రశేఖర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఆ తీర్పు వెలువరించింది. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి మరో మతంలోకి మారిన వ్యక్తి, గతంలో తన సామాజిక వర్గానికి ఉన్న వెనకబాటుతనాన్ని చూపించి రిజర్వేషన్ పొందలేరని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. హిందూ కుల వ్యవస్థతో ముడిపడి ఉన్న సామాజిక వెనుకబాటుతనం అనేది మతం మారిన తర్వాత ఇతర మతాల్లోకి లేదా సామాజిక వ్యవస్థల్లోకి దానంతట అదే రాదని కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగ సూత్రాల ఆధారంగానే హైకోర్టు ఈ తీర్పు ఇచ్చిందని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.

ఫ్రాడ్ కాల్స్‌కు చెక్

>> విధానంతో వినియోగదారులకు ఫోన్ చేసే వారి పేరు, నంబర్‌తో సహా కనిపిస్తుంది. ఈ కొత్త నిబంధన అమల్లోకి వచ్చాక, 4జి లేదా 5జి నెట్‌వర్క్‌లలో మీకు ఇన్‌కమింగ్ కాల్ వచ్చినప్పుడు, కాల్ చేసే వారి నంబర్‌తో పాటు వారి పేరు కూడా ఫోన్ స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతుంది. ఒకవేళ ఆ నంబర్ మీ కాంటాక్ట్స్‌లో సేవ్ చేసి ఉంటే, మీరు సేవ్ చేసుకున్న పేరే కనిపిస్తుంది. సేవ్ చేయని దేశీయ నంబర్ల విషయంలో సిమ్ కార్డు తీసుకునేటప్పుడు సదరు వినియోగదారుడు నమోదు చేసుకున్న పేరును టెలికాం ఆపరేటర్ డేటాబేస్ నుంచి సేకరించి చూపిస్తుంది. ఇక అంతర్జాతీయ కాల్స్ వస్తే ఇంటర్నేషనల్ కాల్ అని ప్రత్యేకంగా సూచిస్తుంది. ప్రస్తుతానికి ఈ సేవ 4జి, 5జి నెట్‌వర్క్‌ల వినియోగదారులకు ఆటోమేటిక్‌గా ప్రారంభమవుతుంది. 2జి, 3జి, ల్యాండ్‌లైన్ నెట్‌వర్క్‌లలో దీని అమలుపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుంది. గోప్యత కోరుకునే వారి కోసం కూడా ఒక వెసులుబాటు ఉంది. కాలింగ్ లైన్ ఐడెంటిఫికేషన్ రిస్ట్రిక్షన్ (సీఎల్ఐఆర్) సేవను యాక్టివేట్ చేసుకున్న వారి పేర్లు మాత్రం ఇతరులకు కనిపించవు. వ్యాపార, బల్క్ కనెక్షన్ల విషయంలో ధ్రువీకరణ తర్వాత వారి రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్ లేదా జీఎస్టీ ట్రేడ్ నేమ్ వంటి పేరును ఉపయోగించుకునేందుకు టెలికాం ఆపరేటర్లు అనుమతించవచ్చు. కాల్ ముగిసిన తర్వాత కాలర్ పేరును ఫోన్‌లో నిల్వ చేయలేని విధంగా తగిన భద్రతా చర్యలు పాటించాలని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (టీఆర్ఏఐ) సిఫారసులకు అనుగుణంగా, వినియోగదారులకు సురక్షితమైన కాలింగ్ అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఎసిబి వలలో ట్రాన్స్‌కో ఎఇ

>> ట్రాన్స్‌కో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో గల భవన యజమాని ఇంట్లోని ఆరు కరెంటు మీటర్లు చోరీకి గురవగా వాటి స్థానంలో కొత్తవాటి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. వీటిని మంజూరు చేసేందుకు ఏఈ రాకేష్ లక్షా 50 వేల రూపాయలు లంచం డిమాండ్ చేయగా చివరకు లక్షా 20 వేల రూపాయలు తీసుకునేందుకు అంగీకరించాడు. దీనిపై బాధితుడు ఎసిబికి ఫిర్యా దు చేశాడు. అనంతరం ఎసిబి అధికారుల సూచనల మేరకు బాధితుడు గురువారం మధ్యాహ్నం వేళ ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏఈ రాకేష్‌కు లక్షా 20 వేల రూపాయలు ఇచ్చాడు. ఈ డబ్బులను అతను తీసుకుని లెక్క పెడుతుండగా ఎసిబి అధికారులు ఒక్కసారిగా దాడిచేసి పట్టుకున్నా రు. దీని తరువాత ఏఈ రాకేష్‌ను అరెస్టు చేసి లంచం డబ్బులను జప్తు చేశారు. అనంతరం ఏఈ కార్యాలయంలో సోదాలు చేసి కొన్ని పత్రాల ను స్వాధీనం చేసుకున్నారు. దీని తరువాత నిందితుడిని నాంపల్లి ఎసిబి కోర్టులో హాజరు పరిచి న్యాయ మూర్తి ఆదేశాల మేరకు రిమాండుకు తరలించారు. కాగా సర్కారీ విభాగాల్లో లంచావతారుల గురించి 1064కు ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి చారు సిన్హా కోరారు.

చేదెక్కిన చక్కెర

>> లభించేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పంపిణీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఈ కొత్త నిబంధనలు గురువారంనుంచి అమల్లోకి వచ్చి నవంబర్ 30 వరకు కొనసాగుతాయి. కొత్త ఉత్తర్వుల ప్రకారం చక్కెర వ్యాపారులు, డీలర్లు గరిష్టంగా 1,000 క్వింటాళ్ల నిల్వలను మాత్రమే కలిగి ఉండాలి. తాము కొనుగోలు చేసిన సరుకును 15 రోజుల వ్యవధిలోనే మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంటుంది. అంతకుముందు ఆగస్టులో ఈ పరిమితి 4,000 క్వింటాళ్లు, 30 రోజులు కాగా, సెప్టెంబర్‌లో 2,000 క్వింటాళ్లకు తగ్గించారు. అక్టోబరులో మరింత కఠినతరం చేస్తూ 1,000 క్వింటాళ్లకు కుదించారు.

భౌగోళిక రవాణా ఇబ్బందులు, సుదూర ప్రాంతాల సరఫరా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోల్‌కతా, దాని పరిసర మెట్రో ప్రాంతాలతో పాటు అసోం రవాణా మార్గాలకు ఈ నిబంధనలో ప్రత్యేక మినహాయింపునిచ్చారు. అక్కడ వ్యాపారులు గరిష్టంగా 2,000 క్వింటాళ్ల వరకు సరుకును నిల్వ చేసుకునేందుకు కేంద్రం అనుమతించింది. వ్యాపారులు భారీగా చక్కెరను నిల్వ చేసి సరుకు కొరత సృష్టించకుండా నిరోధించడం, మిల్లుల నుంచి మార్కెట్‌కు చక్కెర సరఫరా వేగవంతం చేయడం ఈ చర్య ప్రధాన ఉద్దేశం. దసరా, దీపావళి పండుగల వేళ తీపి పదార్థాల తయారీకి చక్కెర వినియోగం విపరీతంగా పెరుగుతుంది. ఇటీవల ఎక్స్‌మిల్ ధరకు తోడు రిటైల్ మార్కెట్‌లో ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్న తరుణంలో, వ్యాపారులు ఈ ప్రయోజనాన్ని నేరుగా వినియోగదారులకు అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. తద్వారా పండుగల వేళ ప్రజలపై అదనపు భారం పడకుండా చూడాలని కేంద్రం భావిస్తోంది.

తెలంగాణకు ఇద్దరు ఐపిఎస్‌లు

కేంద్రం కేటాయింపు

ఎపికి 8 మంది అధికారులు

రేపు ఐపిఎస్ ప్రొబేషనరీల దీక్షాంత్ పరేడ్

హైదరాబాద్, అక్టోబర్ 15, ప్రభాత వార్త: యువ ప్రొబేషనరీ ఐపిఎస్ అధికారుల దీక్షాంత్ పరేడ్ శనివారం జరగనుంది. శివార్లలోని శివ రాంపల్లిలోని సర్దార్ వల్లభ భాయి పటేల్ జాతీయ పోలీసు అకాడ మిలో జరగనున్న ఈ దీక్షాంత్ పరే డ్‌కు కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. 78వ బ్యాచ్ ఐపిఎస్ అధికారులు పాల్గొననున్న ఈ దీక్షాంత్ పరేడ్ కోసం ఇప్పటికే పోలీసు అ కాడమి ముస్తాబయ్యింది. మొత్తం 151 మంది అధికారులు పాల్గొంటున్న ఈ పరేడ్‌లో 16 మంది విదేశీ అధికారులు న్నారు. ఈ బ్యాచ్‌లో 37 మంది మహిళా అధికారులున్నారు. కాగా దీక్షాంత్ పరేడ్‌కు సంబంధించి అకాడమి డైరక్టర్ సుజిత్ పాండే గురువారం మీడియా సమావేశం నిర్వహించి శిక్షణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. యువ ఐపిఎస్ అధికారులకు 45 వారాల పాటు కఠిన శిక్షణ ఇచ్చినట్లు ఆయన తె లిపారు. శిక్షణలో భాగంగా బేసిక్ కోర్సుతో పాటు అవుట్ డోర్, ఇండోర్ విభాగాలలో, సైబర్ భద్రత, అంతర్గత భద్రతపై నిపుణులచేత అభ్య ర్థులకు శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరాల నివారణకు చేబట్టాల్సిన చర్యలు, సైబర్ భద్రత, డ్రగ్స్ ట్రాఫికింగ్‌కు సంబంధించి యువ అధికారులకు భిన్న కోణాల్లో నిపుణుల చేత శిక్షణ ఇప్పించా మని పాండే వెల్లడించారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన గణేష్ వేడుకలతో పాటు మొహరం బందోబస్తులో యువ అధికారులు పాల్గొన్నారని ఆయన తెలిపారు. దీంతో పాటు హైదరాబాద్ పోలీసు విభాగంలో కొనసాగుతున్న పలు ఉప విభాగాల ను వీరు సందర్శించి అనుభవం గడించారని ఆయన వెల్లడించారు. ఈ ఏడాదికిగానూ తెలంగాణకు ఇద్దరు ఎపికి ఎనిమిది మంది అధికారులను కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మహిళ సంఖ్య కొంత పెరిగిందని ఆయన అన్నారు. ఈసా రి జరిగే దీక్షాంత్ పరేడ్‌లో ఐపిఎస్‌కు ఎంపికైన వారిలో తెలంగాణ నుంచి ఐదుగురు ఎపి నుంచి నలుగరు వున్నారని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో అకాడమి జాయింట్ డైరక్టర్ అజిత్ ప్రతాప్ సింగ్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఐదుగురు యువ ఐపిఎస్‌లు తమ అనుభవాలను పంచుకున్నారు.

వారం - వర్జ్యం

16-10-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,
షష్ఠి తె.5.54 న.జ్యేష్ఠ ఉ.6.47 వ. లేదు
దు.1.ఉ.8.20-ఉ.9.07
దు.2. మ.12.16-మ.1.03
రాహు ఉ.10.30-మ.12.00
శుభ లేదు.

వార్తాఫలం

మేషం : గోప్యంగా వ్యవహరిస్తారు. ముఖ్య శుభకార్యాలు సానుకూల పరచుకోవడానికి మీ కృషి మంచి ఫలితాలని స్తుంది.

వృషభం : దూరప్రాంత విద్యా విషయాలు కలిసి వస్తాయి. ముఖ్యమైన చర్చలు వాయిదా పడతాయి.

మిథునం : ఆర్థిక పరమైన అంశాలు లాభిస్తాయి. గృహం లేక భూమి కొనుగోలు సానుకూల పడుతుంది.

కర్కాటకం : వాహన సంబంధమైన విషయాలు వాయిదా వేయడం మంచిది. ఆకస్మిక నిర్ణయాలు తీసుకుంటారు.

సింహం : కొంత ధనం చేతికందుతుంది. ప్రభుత్వపరమైన పనులను సానుకూల పరచుకోగలుగుతారు. ఉత్సాహంగా ఉంటారు.

కన్య : మీ స్థాయి పెరుగుతుంది. మనస్సులోని భావాలను పరోక్షంగా బంధువర్గానికి తెలియజేస్తారు.

తుల : ఇప్పుడు చేస్తున్న వ్యాపారం గాక ఇతరత్రా వ్యాపారాలలో కూడా విస్తరించాలనే ఆలోచన మీలో కలుగుతాయి.

వృశ్చికం : నిర్దయగా వ్యవహరిస్తున్న వారిపట్ల నిరసనను వ్యక్తం చేస్తారు. స్వల్ప ధనలాభ సూచన.

ధనుస్సు : గౌరవ ప్రదమైన పురస్కారాలను అందుకుంటారు. క్రమశిక్షణాయుతంగా మెలుగుతారు.

మకరం : వృత్తి, ఉద్యోగాల పరంగా అనుకూలమైన బదిలీ లేక ప్రమోషన్ సాధించడానికి గాను ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు.

కుంభం : అదృష్టానికి కన్నా కృషిని నమ్ముకుంటారు. వస్తు భద్రతపట్ల జాగ్రత్తలు అవసరం.

మీనం : ఆర్థికంగా మరింత పురోగతిని సాధించడానికి గాను కొత్త నిర్ణయాలను తీసుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

అప్రకటిత కోతలు

>> నీరందక వాడిపోతున్నాయి. బోర్లలో నీరున్నా కరెంట్ కోతలు లేదా లోవోల్టేజీ సమస్యల వల్ల మోటర్లు నడవని పరిస్థితి ఏర్పడుతోంది. విద్యుత్ వినియోగం పెరగడంతో పలు మండలాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగడంలేదు. ముఖ్యంగా వరి, పత్తి, వేరుశెనగ, మొక్కజొన్న తదితర పంటలకు క్రమం తప్పకుండా తడులు ఇవ్వాల్సి ఉండగా లోడ్ రిలీఫ్, మరమ్మతులు, బ్రేక్‌డౌన్ పేరుతో అనధికారిక విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. మరోవైపు నిత్యం తడులు అవసరమైన వేరుశెనగ, మిర్చి పంటలను సైతం నీటి సమస్య వేధిస్తోంది. బోరుబావులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పెరిగి లో వోల్టేజ్ సమస్యలు, సాంకేతిక అంతరాయాలు తప్పడం లేదు. ఫలితంగా బోర్లు ఉన్నప్పటికీ పంటలకు అవసరమైన సమయంలో నీరందక చేలు ఎండిపోతున్నాయని కన్నీటి పర్యాంతమవుతున్నారు. విద్యుత్ లో వోల్టేజీ సమస్యతో మోటార్ల నుంచి వచ్చే నీటి ధారకూడా తగ్గిపోయింది. సాధారణంగా 350 నుంచి 400వోల్టులు రావాల్సిన విద్యుత్ 200 నుంచి 250కి పడిపోవడంతో మోటార్లు కాలిపోతున్నాయి. దీంతో పాడైన మోటార్లను బయటకు తీయడం వాటి స్థానంలో కొత్తవి లేదా మరమ్మతులు చేసిన వాటిని ఉంచడం తలకు మించిన భారంగా మారుతోంది. ఇప్పుడు పంట చివరి దశలో నీటి తడులు అందించడానికి చేస్తున్న డీజిల్ ఖర్చులు రైతులకు తలకుమించిన భారంగా మారాయి. అద్దెకు జనరేటర్లు తెచ్చి, వాటి ద్వారా బోరు మోటార్లు నడిపిస్తున్నారు. జనరేటర్ అద్దెతో పాటు లీటర్ల కొద్దీ డీజిల్ వాడాల్సి రావడంతో రోజుకు ఎకరాకు దాదాపు రూ. 3,000 వరకు అదనపు ఖర్చు అవుతోంది. రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేసిన పంటను కళ్లముందే ఎండనివ్వలేక అప్పులు చేసి మరీ డీజిల్ కొనుగోలు చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు రోజుకు వేల రూపాయలు అదనంగా ఖర్చు చేసి, జనరేటర్లను అద్దెకు తెచ్చి మోటర్లు నడిపిస్తున్నారు. ఇది వారిపై ఎకరాకు రూ. 20,000 నుండి రూ. 25,000 వరకు అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి పంటభూములను తడుపుతున్నారు. పొలంలో నీరు లేక వరి పంట ఎండిపోతుండటంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పంటకు అందిస్తున్నారు. రోజుకు రూ.1,000 అద్దె చెల్లిస్తూ వరి తదితర పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న రైతుల పరిస్థితి అన్నదాతల కష్టాలకు అద్దం పడుతోంది. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిన చోట, తోటలను మరియు పండ్ల చెట్లను (మామిడి, దానిమ్మ, ద్రాక్ష వంటివి) కనీసం బతికించుకోవడానికైనా ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను కొనుగోలు చేసి నీరు పోస్తున్నారు.

రైతుకు ధరల పంట

>> కంటే ఎక్కువే ఇచ్చి కొంటామని కల్లాల వద్దకే రావడం అన్నదాతలకు వరంగా మారింది. ప్రతి సీజన్‌లోనూ నష్టాలు చవిచూస్తున్న అన్నదాతలు ఇప్పుడు లాభాలు పొందుతున్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.2,410 ఉండగా, బహిరంగ మార్కెట్లో రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. ప్రైవేటు వ్యాపారులు నాణ్యమైన మొక్కజొన్నకు క్వింటాకు రూ.2,500 నుంచి రూ. 2,600 ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కేంద్రాలు తెరిచినా కొనుగోళ్లలో జాప్యం, ధర తక్కువ అని, అదే వ్యాపారులు అయితే ఎక్కువ ధరతో పాటు వెంటనే నగదు చెల్లిస్తున్నారని రైతులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ సీజనులో 5,93,221 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. అత్యధికంగా కొత్తగూడెం జిల్లాలో 66,408 ఎకరాల్లో, రంగారెడ్డిలో 60 వేల ఎకరాలు, మహబూబాబాద్‌లో 58,655 ఎకరాలు, నిజామాబాద్‌లో 54,235 ఎకరాలు, కామారెడ్డిలో 47,235 ఎకరాలు, సిద్దిపేట్‌లో 47 వేల ఎకరాలు, వికారాబాద్‌లో 42,175 ఎకరాలు, జగిత్యాలలో 38,910 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో 27,900 ఎకరాలు, ఆదిలాబాద్ జిల్లాలో 27,845 ఎకరాల్లో మొక్కజొన్న పంటను అత్యధికంగా సాగు చేశారు.

ప్రారంభంలో మక్కల ధరలపై ఆందోళన చెందినా, ఇప్పుడు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతుధర కంటే ఎక్కువ ధరకే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, దళారులు వచ్చి వెంట వెంటనే తీసుకుంటున్నట్లు రైతులు అంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని, తీరా అక్కడకు వెళ్లిన తర్వాత ఎదో ఒక వంక పెట్టి మద్దతు ధరలకు కూడా కొనడంలేదని పలువురు రైతులు చెబుతున్నారు. మళ్లీ డబ్బులు కూడా ప్రభుత్వం నుంచి ఆలస్యంగా పడుతున్నాయి. అందుకే తమ పంటను ప్రైవేట్ దళారులకు అప్పగిస్తున్నామని, కానీ దళారులు వెంటనే మాకు ఇస్తున్నారని రైతులు స్పష్టం చేస్తున్నారు. కాగా నిజామాబాద్ మార్కెట్‌లో సోయాబీన్‌కు క్వింటాలుకు రూ.6,690 నుండి రూ.7,290, పసుపు రూ.14 వేల నుండి రూ.24 వేల వరకూ, అల్లం రూ.14,867, మక్కలు రూ.1,957 నుండి రూ.2,519 చొప్పున ధరల పలికింది.

గురువారం న్యూఢిల్లీలో మీడియాతో సిజెపి చీఫ్ దీపేంద్ర. చిత్రంలో నేహా బోరా, ప్రకాశ్‌రాజ్ తదితరులు

బొగ్గు దిగుమతి ముసుగులో

3 వేల కోట్ల స్కాం!

>> విద్యుత్ సంక్షోభాన్ని ముందస్తు ప్రణాళికతో ఎదుర్కోవాల్సిన ప్రభుత్వం, ఇప్పుడు కరెంట్ కోతలపై ప్రజలు, రైతుల ఆందోళనను బూచిగా చూపించి దిగుమతులకు అనుకూలంగా మలుచుకోవడం వెనక భారీ స్కాం దాగి ఉన్నట్టు అర్థమవుతోందని, ఈ వ్యవహారంలో భోత్రా లాజిస్టిక్స్ అనే కంపెనీ పాత్ర అత్యంత అనుమానాస్పదంగా కనిపిస్తోందని ఈ కంపెనీకి సింగరేణిలో కాంట్రాక్టులు అప్పగించడంలో అనుసరించిన ప్రమాణాలేమిటి? ఏ అర్హతల ఆధారంగా ఈ సంస్థను ఎంపిక చేశారు? టెండర్ల ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగింది? ఈ ప్రశ్నలకు సిఎం రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు, టెండర్ల వివరాలు, చెల్లింపులన్నింటినీ బహిర్గతం చేయాలి. ఈ కంపెనీ ఎంపిక వెనుక ఉన్న కారణాలు, దానికి ఇప్పటివరకు అప్పగించిన కాంట్రాక్టులు, చెల్లించిన నిధులపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. విదేశీ బొగ్గు దిగుమతుల వ్యవహారంలో ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారో ముఖ్యమంత్రి ప్రజలకు స్పష్టం చేయాలి. ఈ వ్యవహారంలో బొత్రా లాజిస్టిక్స్ పాత్ర ఏమిటి? టన్నుకు రూ.1,500 కమిషన్ చొప్పున ఏకంగా రూ.3,000 కోట్ల దోపిడీకి మీరు చీకటి ఒప్పందాలు చేసుకున్నట్టు అర్థమైపోయింది. అందుకే ఇన్నాళ్లు కనీసం సమీక్షలు సమావేశాలు నిర్వహించకుండా హడావిడిగా విదేశీబొగ్గు స్కాం కు తెరలేపారని ఆరోపించారు.

విద్యుత్ డిమాండ్ వేసవిలో పెరుగుతుందని, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతర బొగ్గు సరఫరా అవసరమని ప్రభుత్వానికి ముందే తెలుసు. గనుల అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాలు, బొగ్గు నిల్వలు, రవాణా, దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ ఈ ఏర్పాట్లను ఏమాత్రం సక్రమంగా నిర్వహించకుండా, సంక్షోభం తీవ్రమయ్యాక అధికారులతో సమావేశాలు నిర్వహించి వారిపై నెపం నెట్టడం ద్వారా బాధ్యత నుంచి తప్పించుకోలేరని సిఎం రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు కొనుగోలు, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా ఒప్పందాలపై నిర్ణయాలు తీసుకోవాల్సింది ప్రభుత్వమే. వైఫల్యం జరిగితే బాధ్యత వహించాల్సింది కూడా ప్రభుత్వమే.

సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గిపోవడం ఈ సంక్షోభంలో కీలకమైన అంశం అని చెప్పారు. 2023-24లో సుమారు 70.02 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదుకాగా, 2025-26లో ఉత్పత్తి సుమారు 58 మిలియన్ టన్నులకు పడిపోయింది. ఈ తగ్గుదలకు కారణాలేమిటి? గనుల అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు, యంత్రాలు, అనుమతులు, రవాణా సదుపాయాలను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసింది? సింగరేణి కార్మికులకు బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థం ఉన్నప్పుడు ఆ సామర్థ్యాన్ని ఎందుకు పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదు? ఉత్పత్తిని పెంచే చర్యలు తీసుకోకుండా దేశీయ బొగ్గు కొరత ఏర్పడే పరిస్థితిని ఎందుకు నివారించలేకపోయారు? అని ప్రశ్నించారు. ప్రజాధనం వృధాచేసి భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితిని ఎందుకు సృష్టించారు ? దీనిపై సమగ్ర విచారణ జరగాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

సింగరేణికి రావాల్సిన బకాయిల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. సుమారు రూ.60,000 కోట్ల బకాయిలున్నాయన్న లెక్కలపై సంస్థల వారీగా పూర్తి వివరాలు వెల్లడించాలి. ఎంత మొత్తం రావాలి? ఎంత వసూలైంది? ఎంత పెండింగ్‌లో ఉంది? బకాయిలు పేరుకుపోతుంటే సంస్థ ఆర్థిక పరిస్థితి ఎలా మెరుగుపడుతుంది? అని ప్రశ్నించారు.

గనుల అభివృద్ధికి, ఉత్పత్తి పెంపునకు అవసరమైన నిధులు అందించకుండా సింగరేణి సామర్థ్యాన్ని దెబ్బతీసి, ఆ తర్వాత దేశీయ బొగ్గు సరిపోవడం లేదని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి కాదా? సింగరేణికి రావాల్సిన బకాయిలను చెల్లించి, ఉత్పత్తిని పెంచి, దేశీయ సరఫరాను బలోపేతం చేయాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. దేశీయ బొగ్గు వనరులను వినియోగించుకోవడంలోనూ మీ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఒడిశాలోని నైని బ్లాక్‌లో సింగరేణి బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన నేపథ్యంలో అక్కడి నుంచి సరఫరాను పెంచేందుకు ఏ చర్యలు తీసుకున్నారు? మహానది ప్రాంతం నుంచి బొగ్గు సరఫరా చేసుకునే అవకాశాలు ఉన్నా ఎందుకు చేయలేకపోయారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

'యాదాద్రి' సిఇపై వేటు

>> మెగావాట్ల యూనిట్1ను గత 15 రోజులుగా షట్‌డౌన్‌లో ఉంచినందుకు గాను ఆయనను సస్పెండ్ చేసింది. సిబ్బంది నిర్వహణ, సాంకేతిక సమస్యల పరిష్కారంలో నిరక్ష్యం, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంతో జనరేషన్ లాస్‌కు కారణమయ్యారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీంతో విద్యుత్ శాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో సిఎండి చీఫ్ ఇంజినీర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. రాష్ట్రంలో ఇటీవల ఎదురవుతున్న విద్యుత్ అంతరాయాలు, యాదాద్రి ప్లాంట్‌లో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి వైఫల్యాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మరుసటి రోజే యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం స్టేజ్1 చీఫ్ ఇంజినీర్‌పై వేటు పడటం గమనార్హం. కాగా నైనీ, మహానది కోల్ బ్లాకుల నుండి బొగ్గు సరఫరా లింకేజీ ఉన్నప్పటికీ, యాదాద్రి పవర్ ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి జరగకపోవడంపై ఉన్నత స్థాయి సమీక్షలో అధికారులను సీఎం నిలదీశారు. విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో పూర్తి సామర్థం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు. అవసరమైతే విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్, జెన్కో సిఎండి సంబంధిత విభాగపు ఐఏఎస్‌లను సస్పెండ్ చేస్తానని మండిపడ్డారు. ఈ సమావేశం జరిగిన మర్నాడే యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజినీర్‌పై వేటు వేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

'పవర్'పై ఫోకస్!

>> తేదీల్లో క్యాంప్ చేస్తారు. ఇక జెండేజ్ హనుమంత్ కొండిబా 25 నుంచి 27 వరకు, కిల్లు శివకుమార్ నాయుడు 28 నుంచి 30 వరకు యాదాద్రి పవన్ ప్లాంట్ వద్ద పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మరోపక్క ప్లాంట్‌కు వెళ్లే అధికారులు నిర్దిష్టమైన అంశాలపై పూర్తి స్థాయి అధ్యయనం చేసి నివేదికను అందజేయాలని సిఎస్ ఆదేశించారు. ప్లాంట్లోని 4 బొగ్గు స్ట్రీములు సరిగ్గా పనిచేస్తున్నాయా, ఏవైనా అంతరాయాలు ఉంటే కారణాలేంటి, ప్లాంటుకు చేరుతున్న బొగ్గు గ్రేడ్ ఎంత, ఆ గ్రేడ్‌కు తగినట్లుగానే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందా లేక ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా, అన్ని యూనిట్లలో బంకర్లకు బొగ్గు సరఫరా నిరంతరాయంగా సాగుతుందా, మధ్యలో ఏవైనా ఆటంకాలు ఎదురవుతున్నాయా, ప్లాంట్ నిర్మాణ బాధ్యతలు చూస్తున్న బిహెచ్ఇఎల్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనుల పరిస్థితి ఏంటి, బొగ్గు వ్యాగన్ల అన్లోడింగ్ సమయం, టర్న్ అరౌండ్ టైమ్ ఏ విధంగా ఉంది, దానిని మరింత వేగవంతం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ప్లాంట్లోని అన్ని 4 యూనిట్లు పూర్తి సామర్థంతో పని చేస్తున్నాయా, ఒకవేళ ఉత్పత్

గురువారం కాంగ్రెస్ లెజిస్లేచర్ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

సింగరేణిని ప్రైవేటీకరించం

బొగ్గు గనుల ప్రైవేటీకరణ చట్టానికి బిఆర్ఎస్ మద్దతు

ఐటి, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు భాగస్వాములై రాష్ట్రం రావడంలో కీలక పాత్ర పోషించారని రాష్ట్రానికి ఆ సంస్థ గుండెకాయ వంటిదని దానిని ప్రైవేటికరించబోమని ఐటి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటన చేశారు. కాంగ్రెస్ లెజిస్లేచర్ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్, కోరం కనకయ్య కలిసి మంత్రి శ్రీదర్‌బాబు మాట్లాడారు. సింగరేణి ప్రైవేటీకరణ గురించి ప్రస్తావన తెరపైకి తెచ్చిందే కెసిఆర్ అని, తాటిచెర్ల మైన్‌ను ప్రైవేట్ సంస్థకు అప్పగించింది బిఆర్ఎస్ ప్రభుత్వమని ఆయన ఆరోపించారు. బిజెపి బొగ్గుగనుల ప్రైవేటీకరణకు చట్టం తీసుకొని రాగా దానికి సహకరించింది ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. కెటిఆర్, హరీశ్‌రావు సింగరేణి ప్రతిష్టను దిగజార్చే కుట్రలు చేస్తున్నారని, బిఆర్ఎస్ హయాంలో టెండర్లు, కమీషన్ల సంస్కృతిని మొదలుపెడితే ఇప్పుడు అడ్డుకున్నామని వివరించారు. బిఆర్ఎస్ హయాంలో విద్యుత్ సంస్థలకు పెట్టిన బకాయిలను కప్పిపుచ్చడానికి మాపై బురదజల్లుతున్నారని ఆవేదన చెందారు. పదేళ్ళు సింగరేణికి బకాయిలు ఎందుకు ఎగ్గొట్టారు? అప్పుల ఊబిలోకి ఎందుకు నెట్టారు?విద్యుత్ సంస్థల పేరిట సింగరేణికి వేల కోట్ల బకాయిలు పెట్టిన విషయాన్ని మరిచిపోయారా? బిఆర్ఎస్ హయాంలో కల్వకుంట్ల కుటుంబంలోని సభ్యుల్లో ఒకరు సింగరేణిని తమ జేబుగా చేసుకొని ఇప్పుడు కుంభకోణాలంటూ వారే మాట్లాడుతున్నారనీ ఎద్దేవా చేశారు.

ఓట్ల చోరీతో అధికారంలోకి రావడానికి బిజెపి కుట్ర : విహెచ్

హైదరాబాద్, అక్టోబరు15,ప్రభాతవార్త: ఓట్ల చోరీతో రాజ్యాధికారంలోకి రావడానికి బిజెపి కుట్రలు చేస్తోందని రాష్ట్రప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఆరోపించారు. గుజరాత్ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి గెలిచిందనీ, కాంగ్రెస్ కు అన్ని ఓటములే అని అమిత్ షా అంటున్నారుకానీ వాళ్ళు ప్రజాభిమానంతో కాకుండా ఎన్నికల ప్రక్రియను రిగ్గింగ్ చేస్తూ అధికారంలోకి వస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని తప్పులు చేస్తుందనీ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ను పక్కకు జరిపి కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ప్రధాన కమీషనర్ నియామకం చేసుకోవడానికి కుట్ర చేస్తున్నారనీ దుయ్యబట్టారు. నాలుగోసారి మోడీ ప్రధానమంత్రి కావాలనేది బీజేపీ కుట్ర, అందుకే సర్ పేరుతో అర్హుల ఓట్లు తొలగించారని ప్రజాచైతన్యంతో అర్హులకు తిరిగి ఓటు కల్పించేవరకు ఉద్యమాలు జరుగుతాయని నాలుగోసారి మోడీ షా అధికారంలోకి రావడమనేది ఎట్టి పరిస్థితుల్లో జరగదని అన్నారు.

మంజుభార్గవి చేతుల మీదుగా జాపికను అందుకుంటున్న చావా దేవిక

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చింతల్ బాలిక చావా దేవిక

13 యేళ్లకే అద్భుత ప్రతిభ

రెండు గంటలపాటు నిరంతర శాస్త్రీయ నృత్యప్రదర్శన.. శివార్పణంతో అరుదైన ఘనత

హైదరాబాద్ (జీడిమెట్ల), అక్టోబరు 15, ప్రభాతవార్త: చిన్న వయసులోనే శాస్త్రీయ నృత్యంలో అసాధారణ ప్రతిభను చాటుకున్న చింతల్‌కు చెందిన బాలిక (13) చావా దేవిక తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి అరుదైన ఘనత సాధించింది. పరమశివునికి అంకితంగా శివార్పణం పేరుతో రెండు గంటలపాటు నిరంతరంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసి కళానైపుణ్యాన్ని చాటుకుంది. ఫ్యూచర్ టీచర్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాసంగమం-2026 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న సాయంత్రం సికిందరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఈ ప్రత్యేక నృత్యప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నృత్య కళాకారిణి, సినీనటి మంజుభార్గవి ముఖ్యఅతిథిగా హాజరై దేవిక ప్రదర్శనను అభినందించారు. అనంతరం ఆమె చేతుల మీదుగా తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును దేవిక అందుకుంది. నృత్యగురువు డా. రేవతి ప్రసాద్ మార్గదర్శకత్వంలో దేవిక ఈ ప్రదర్శనను విజయవంతంగా పూర్తి చేసింది. 13 యేళ్ల వయస్సులోనే రెండు గంటలపాటు అలుపెరగకుండా శాస్త్రీయ నృత్యప్రదర్శన చేయడం ఆమె సాధన, ఏకాగ్రత, నృత్యంపై ఉన్న ఆసక్తికి నిదర్శనంగా నిలిచింది.

భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయానికి భక్తిభావాన్ని జోడిస్తూ పరమశివునికి ప్రదర్శనను అంకితం చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్న వయస్సులోనే నృత్యరంగంలో ఈ స్థాయి గుర్తింపు పొందిన దేవికపై చింతల్‌ప్రాంత ప్రజలు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరంతర సాధనతో ప్రతిభను మెరుగుపరుచుకుంటూ తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. దేవిక భవిష్యత్తులో నృత్య రంగంలో మరిన్ని విజయాలు సాధించి, తన ప్రతిభతో రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

కేంద్రహోంమంత్రిని క్షమించే ప్రసక్తిలేదు.. రాజీనామా చేయాల్సిందే

మంత్రి పొన్నం ప్రభాకర్ ట్వీట్

హైదరాబాద్,అక్టోబరు15,ప్రభాతవార్త: సుప్రీంలో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేస్తూ హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సుప్రీంకోర్టులో బేషరతు క్షమాపణలు చెప్పినా దీన్ని దేశ ప్రజలు కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షాను క్షమించే ప్రసక్తే లేదనీ తక్షణం ఆయన పదవికి రాజీనామా చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికపై ఆయన ట్వీట్‌చేస్తూ ఇటీవల ఢిల్లీలో జరిగిన ఘటనలపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని చెప్పారు. ఏకంగా సుప్రీంకోర్టును కూడా కేంద్రం తప్పుదారి పట్టిస్తోందనీ ఆగ్రహం వ్యక్తంచేశారు దేశంలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు అంటే కూడా కేంద్రానికి కనీస గౌరవం లేదు.. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పాటించకుండా ధిక్కరిస్తోంది.. ఈ మొత్తానికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నా అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు.

అన్ని జిల్లాల్లో ఎఐపిసి విస్తరణ

పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తున్నా

ఎఐపిసి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మధుయాష్కీగౌడ్

విడియో కాల్ ద్వారా సందేశం అందించిన సామ్ పిట్రోడా

హైదరాబాద్,అక్టోబరు15,ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా 50 వేల సభ్యత్వంతో అభివృద్ధి చెందిన 100 అర్బన్ జిల్లాల్లో ఎఐపిసి కమిటీ విస్తరించడానికి కార్యాచరణ ప్రణాళికతో సంస్థాగత నిర్మాణం చేస్తానని దీనిని చైర్మన్ ఒక పదవిగా చూడటం లేదని తన బాధ్యతగా భావించి పనిచేస్తానని ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్‌గా మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ప్రకటించారు. ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్‌పర్సన్‌గా మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం గురువారం ఢిల్లీలోని ఎఐపిసి భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎఐపిసి మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి గారి నుంచి మధుయాష్కి బాధ్యతలు స్వీకరించారు. దీపాదాస్ మున్షిగా, రాజ్ పాల్ గౌతమ్, సిడబ్ల్యూసిమెంబర్స్ గురుదీప్ సింగ్ సప్పాల్, రాజ్యసభ ఎంపి దీపేందర్ హుడా, మాజీ ఎంపి ఉదిత్ రాజ్ తదితరులు హాజరయ్యారు. మధుయాష్కీ మాట్లాడు తూ అంబేద్కర్ సూచిం చిన బోధించు, సమీక రించు, పోరాడు అనే సూత్రంతో ఎఐపిసి రాజకీయ చైతన్య కార్యక్రమాలు ఉంటాయనీ తెలిపారు.

దేశంలో ప్రస్తుతం మోడీ ప్రభు త్వం రాజ్యాంగ హక్కు లను కాలరాస్తున్న తీరు, ప్రజాస్వామ్యం విలువలు మంట కలుపుతున్న తీరుకు వ్యతిరేకంగా ప్రొఫెషనల్స్ ను భాగస్వా మ్యం పెంచేలా పనిచేస్తా మన్నారు. రాహుల్‌గాంధీ విజన్‌కు అనుగుణంగా డెమొక్రటిక్ వాల్యూస్ ను దేశంలో పెంపొందించేందుకు ఎఐపిసి తగిన పాత్ర పోషించేలా కృషి చేస్తామ న్నారు. రాహుల్ గాంధీ కోరుకుంటున్నట్లుగా భిన్నత్వంలో ఏకత్వంగా కొనసాగుతూ.. దేశంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, గౌరవప్రదమైన జీవనం సాగించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యమని, ఆ దిశగా పౌర సమాజం, ఎఐపిసి కలిసి పని చేయాల్సిన అవసరం ఉం దని వివరించారు. మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి దేశంలో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో నందన్ నిలేకని తో కలిసి పనిచేశారని గుర్తు చేశారు. మొదటి చైర్మన్ శశిథరూర్. ఆ తర్వాత ప్రవీణ్ చక్రవర్తి బాటలో మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.

ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రొఫెషనల్స్ రాజకీయ రంగంలోకి రాకుండా దూరంగా ఉంటే దేశం ఉన్నతమైన విలువలతో అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు.

ప్రొఫెషనల్ అనుభవం, ఆలోచనలు దేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్స్ కు తగిన గుర్తింపు, గౌరవం ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లుగా మరే రాజకీయ పార్టీలోనూ లేదన్నారు. అర్బన్ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నప్పుడే జాతీయ స్థాయిలో అధికారంలోకి వచ్చిందని.. అర్బన్ ప్రాంతాలలోనే నివసించే ప్రొఫెషనల్స్ ను ఒక వేదికపై తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మధుయాష్కి తనకు పాత మిత్రుడని.. అతను సమర్థవంతంగా పనిచేసి బలోపేతం చేస్తాడన్న నమ్మకం ఉందని వివరించారు.

గురువారం ఢిల్లీలోని ఎఐపిసి భవన్‌లో ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్

సంక్షేమ గురుకులాల్లో సరకుల అంతరాయాలకు చెక్

సరఫరా వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ

సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకులాలు, కళాశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన నిత్యావసర సరుకుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సాంఘిక సంక్షేమ మంత్రి ఎ లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో సరుకుల సరఫరా, నిల్వలు, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షి ంచాలని స్పష్టం చేశారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సరుకులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో బఫర్ స్టాక్ నిర్వహించాలన్నారు. సరుకుల సరఫరా, నిల్వల పరిస్థితి, క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన అంశాలు, సరుకుల నాణ్యతకు సంబంధించి సమగ్ర నెలవారీ నివేదికను సమర్పించాలని తెలిపారు. అలాగే విద్యార్థులకు అందజేసే కిట్ల కొనుగోలు, సరఫరా, పంపిణీ ప్రక్రియను కూడా ప్రత్యేకంగా పర్యవేక్షి ంచాలని సూచించారు. సరుకుల సరఫరాకు సంబంధించి తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలన్నారు. సరుకుల సరఫరా, నిల్వలు, నాణ్యత, పంపిణీ తదితర అంశాల్లో ప్రభుత్వ స్థాయిలో జోక్యం చేసుకునేలా తీవ్రమైన సమస్యలు ఏవైనా తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు అవసరమైన సరుకులు నిరంతరాయంగా, నాణ్యతతో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

కవాడిగూడ, ముషీరాబాద్ యుపిహెచ్‌సిల్లో ఆధునిక వైద్య పరికరాలు అందచేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ (ముషీరాబాద్), అక్టోబరు 15, ప్రభాతవార్త: నిరుపేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించటమే ప్రధాన లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలో కవాడిగూడ, ముషీరాబాద్ యూపీహెచ్‌సీలలో ఆయన ఆధునిక వైద్య పరికరాలను అంద చే శారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ యూపీహెచ్‌సీ కేంద్రాలలో మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక వైద్య పరికరాల కల్పనపై ప్రత్యే క దృష్టి సారించా మని, అందులో భాగంగా యూపీహెచ్‌సీ కేంద్రాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలి పారు. ఉచిత మందుల లభ్యత, రోగులకు లభిస్తున్న వైద్యవసతులపై సిబ్బందితో చర్చించారు. రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు ఈసీజీ మెషిన్‌తో కూడిన రెక్లైనర్ బెడ్, బ్లైండ్ శాంపిల్స్ సేకరణకు ఫ్లెబోటమీ కుర్చీలు, రోగుల సమాచారం కోసం ఎల్ఈడీ డిస్ప్లే బోర్డులు, గోప్యత కొరకు స్క్రీన్‌లు, శ్వాసకోశ సమస్యలతో బాధపడే పిల్లలు మరియు పెద్దల కోసం ప్రత్యేక నెబ్యులైజర్ యంత్రాలు, రక్తపోటును సరిచూసే బీపీ డిజిటల్ పరికరాలు(10), రక్తంలో చక్కెర స్థాయిలను తక్షణమే పరీక్షించే గ్లూకోమీటర్లు(10), సూదులను సరక్షితంగా విస్ఫోటనం చేసే నీడిల్‌హబ్ కట్టర్లు(10) అందచేసినట్లు తెలిపారు. రోగుల బరువులు కొలిచేందుకు డిజిటల్ యంత్రాలు, స్టీల్ వెయిటింగ్ కుర్చీలు, మంచినీటి డిస్పెన్సర్లు అందుబాటులోకి తీసుకువచ్చి, స్థానిక ప్రజలకు ప్రాథమిక స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బండ కార్తికారెడ్డి, రమేష్‌రాం, భరత్‌గౌడ్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముషీరాబాద్ యుపిహెచ్‌సిలో ఆధునిక వైద్యపరికరాలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ప్రక్షాళన

2018 నుంచి క్లెయిమ్‌లపై సమగ్ర విజిలెన్స్ విచారణ

అక్రమాలకు పాల్పడిన వారెవరైనా ఉపేక్షించం: మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, అక్టోబరు 15,ప్రభాతవార్త: కార్మికుల సంక్షేమ నిధులను పరిరక్షించడంతో పాటు పరిపాలనలో పారదర్శకతే లక్ష్యంగా కార్మిక శాఖలో సమూల ప్రక్షాళన చేపట్టనున్నట్లు శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను ప్రక్షాళన చేయడంతో పాటు, ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన అధికారులను త్వరలోనే బదిలీ చేస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి రూపాయి సక్రమంగా వినియోగమయ్యేలా పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామన్నారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కార్మిక శాఖలో క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌లో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ప్రాథమిక ఆధారాల మేరకు ఇద్దరు అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశామని, వ్యవహారంపై సమగ్ర విజిలెన్స్ విచారణకు ఆదేశించామని వెల్లడించారు. విచారణలో ఎవరిపాత్ర బయటపడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బోగస్ పత్రాలు, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా అక్రమంగా క్లెయిమ్‌లు పొందినట్లు ఆరోపణలు రావడంతో 2018 నుంచి ఇప్పటివరకు నమోదైన అన్ని రకాల క్లెయిమ్‌లను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించినట్లు చెప్పారు. జాయింట్ లేబర్ కమిషనర్ స్థాయిలో ప్రాథమిక విచారణ జరిపి ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నామని వివరించారు. దాని ఆధారంగా విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. తప్పు చేసిన అధికారులు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, వివిధ సంస్థలు, నిర్మాణదారుల నుంచి వసూలు కావాల్సిన వందల కోట్ల రూపాయల లేబర్ సెస్సును నిబంధనల ప్రకారం పెనాల్టీలతో సహా వసూలు చేస్తామని వెల్లడించారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య లక్ష నుంచి 38 వేలకు పడిపోయిందని, దాదాపు 62 వేల ఉద్యోగాలు తగ్గిపోయాయని అన్నారు. ఆ పదేళ్లలో ఒక్క కొత్త బొగ్గు గని కూడా సంస్థకు రాలేదని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబిలోకి నెట్టిందని మంత్రి అన్నారు.

కమీషన్ల దందాకు అడ్డాగా సిఎంఒ

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి కార్యాలయాన్ని కమీషన్లకు అడ్డగా మార్చేశారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ పనికి 15 శాతం కమీషన్ కావాలంటూ నేరుగా సీఎంఒ నుంచే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె మండిపడ్డారు. ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయమంటూ గురువారం ఎక్స్ లో ట్వీట్ చేశారు. తమ అనుచరులకు, ఆప్తులకు ప్రయోజనం చేకూర్చేందుకు చట్టాన్ని, నిబంధనలను ఏమాత్రం లెక్కచేయటం లేదన్నారు. ఏలాంటి అర్హతలు లేని వారికి కేవలం కమీషన్ల కోసం పనులు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. ఇది ప్రజాపాలన కాదు. పచ్చి దోపిడీ, లూటీ పాలన అని తెలంగాణ సమాజం ఎట్టి పరిస్థితుల్లో ఈ అరాచకాలను సహించదని హెచ్చరించారు. ప్రజలకు, వ్యాపారులకు రక్షణగా ఉండాల్సిన ముఖ్యమంత్రి, ఆయన ఆఫీస్ నుంచే ఇలాంటి ఆగడాలు జరగటమేంటనీ ఆమె ప్రశ్నించారు. ప్రజలను దోచుకుంటూ కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడుతున్న వాళ్లను ఎట్టి పరిస్థితుల్లో వదిలేదని లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ లూటీకి పాల్పడిన వాళ్లందరిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మహారాష్ట్ర తరహా మహిళా రైతుల సాధికారత చట్టం తేవాలిమహిళా రైతుల కోసం మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధంగా "మహిళా రైతుల సాధికారిత" చట్టాన్ని..తెలంగాణలోనూ తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. గురువారం మహిళా రైతుల దినోత్సవం సందర్భంగా తెలంగాణలో మహిళా రైతుల దయనీయ పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమె ఎక్స్‌లో ట్వీట్ చేశారు. కుటుంబాన్ని చూసుకుంటూనే ఉదయం నుంచి రాత్రి వరకు పొలం, పాడి పనులతో తీరిక లేకుండా శ్రమిస్తున్న వారికి కనీస గుర్తింపు దక్కటం లేదన్నారు. గ్రామీణ ఆర్థిక ప్రగతి చక్రానికి ఇరుసుగా ఉన్న మా ఆడబిడ్డల కష్టాలు, త్యాగాలకు తగిన గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మహిళా రైతుల సాధికారత చట్టం 2026 ను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ ప్రభుత్వం కూడా చట్టం చేయాలన్నారు. మహిళా రైతులకు, రైతు కూలీలకు చట్టపరమైన గుర్తింపును ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రత ప్రయోజనాలు పొందే అవకాశం కల్పించాలన్నారు. మహిళా రైతుల దినోత్సవం సందర్భంగా సాగులో, వ్యవసాయ అనుబంధ రంగాల్లో 80 శాతం భాగస్వాములుగా ఉన్న మహిళల శ్రమను గుర్తిస్తూ..వారిని గౌరవించుకుందామని పేర్కొన్నారు.

తెలంగాణ బ్రాహ్మణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఏర్పాటు

హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 15, ప్రభాతవార్త: గ్లోబల్ బ్రాహ్మిణ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (జిబిడబ్ల్యూఎ) ఆధ్వర్యంలో తెలంగాణ బ్రాహ్మణ గ్రాడ్యు యేట్స్ విభాగాన్ని ఏర్పాటు చేశామని అసోసియేషన్ కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ, కో-కన్వీనర్ విజయ్‌కుమార్, కార్యదర్శి వేదాంతి పాండే తెలిపారు. తెలంగాణలో బ్రాహ్మణ పట్టభద్రులనున ఒకే వేదికపైకి తీసుకువచ్చి విదా , ఉద్యోగం అకాశాలు, స్వయం ఉపాధి, సామాజిక సంక్షేమం, నాయకత్వం, ప్రజాస్వామ్య ప్రక్రియలపై అవగాహన కల్పించడం ఈ విభాగం ప్రధాన లక్ష్యమన్నారు.

గురువారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అభ్యర్థిత్వంపై రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అధికారిక ప్రకటన వెలువడిన తరువాత ఎన్నికల పరిణామాలను పరిశీలిస్తామన్నారు. పట్టభద్రుల నియోజకవర్గాల్లో అర్హులైన ఓటర్లు నమోదు, ఓటరు జాబితా పరిశీలన, ఓటు హక్కు వినియోగం, అభ్యర్థుల ప్రజాసేవా అనుభవం, విద్యావంతుల సమస్యలపై వారి వైఖరి తదితర అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 25వ తేదీన బర్కత్‌పురలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశంలో పట్టభద్రుల విభాగం విస్తరణ, సభ్యత్వ నమోదు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించడం జరుతుందని వారు వివరించారు. అర్హులైన బ్రాహ్మణ పట్టభద్రులు ఉచితంగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని వివరాలకు 9701609689లో సంప్రదించాలని వారు కోరారు.

చిన్న సినిమాలను అణగదొక్కుతున్నారు

నిర్మాత, హీరో షిరాజ్ మెహదీ

తెలంగాణ విభాగం ఏర్పాటుకు సిఎం రేవంత్‌రెడ్డికి వినతి

హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 15, ప్రభాతవార్త : సినిమా తీయడం ఒకెత్తయితే దాన్ని థియేటర్లతో విడుదల చేయడం మరోయెత్తని, చిన్న సినిమా నిర్మాతలకు అసలు పరీక్ష సినిమా నిర్మాణంతరం మొదలవుతుందని, అప్పులుచేసి పెట్టుబడులు పెట్టి సినిమా తీస్తున్న నిర్మాతలకు థియేటర్లు దొరక్కపోవడం, ఓటీటీ, శాటిలైట్ హక్కులు విక్రయించుకునే అవకాశాలు లేకపోవడం, చిన్నసినిమాల విషయంలో తెలుగుచిత్ర పరిశ్రమలో వివక్ష కొనసాగడం వెనుకుండి అగణదొక్కుతున్న వారెవరు? అంటూ ఓ అందాల రాక్షసీ హీరో, నిర్మాత షిరాజ్ మెహదీ చేసిన సంచలన ఆరోపణలు పెద్ద చర్చనీయాంశంగా మారాయి. చిన్నసినిమాలకు థియేటర్లు ఇవ్వకుండా, వాటి వ్యాపార అవకాశాలను దెబ్బతీస్తున్నారని, ఆయా నిర్మాతలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నారంటూ పరిశ్రమలోని కొందరు ప్రముఖులు, సంస్థల తీరుపై ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చిన్నసినిమాల నిర్మాతల కష్టాలను పట్టించుకునే నాధుడేలేడని తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. చిన్నసినిమాల వ్యాపార సమస్యలపై ఫిల్మ్‌ఛాంబర్ బాధ్యత తీసుకోకపోగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని, లీగల్ నోటీసులు పంపినా స్పందన లేదన్నారు. తక్షణమే తెలుగు ఫిలిం ఛాంబర్ స్థానంలో తెలంగాణ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిందేనని ఆయన ప్రభుత్వానికి సూచిస్తూ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి చిన్న సినిమాలను ఆదుకొని యువతను ప్రోత్సహించాలని షిరాజ్‌మెహదీ విజ్ఞప్తి చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న షిరాజ్ మెహదీ

ఘట్‌కేసర్‌లో రోడ్డు ప్రమాదం

రసూల్‌పురా వాసి మృతి

ఘట్‌కేసర్, అక్టోబరు 15, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు మృతి చెందాడు. హైదరాబాద్‌లోని రసూల్

బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వైభవం, సంప్రదాయాలకు ప్రతీక

గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా

లోక్‌భవన్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు

పాల్గొన్న గవర్నర్ దంపతులు.. గౌరమ్మకు ప్రత్యేక పూజలు

తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ప్రార్థన

హైదరాబాద్,అక్టోబరు15,ప్రభాతవార్త:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, స్త్రీశక్తికి, సౌభాగ్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల్లో ప్రకృతి పట్ల ఆరాధనాభావాన్ని, సాంస్కృతిక వారసత్వం పట్ల గౌరవాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. పుష్పాలనే దైవ స్వరూపంగా భావించి పూజించే ప్రకృతి ఉత్సవం బతుకమ్మ పండుగ అని గవర్నర్ పేర్కొన్నారు. గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన తన సతీమణి జానకి శుక్లాతో కలిసి పాల్గొని, గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం, సమృద్ధి కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.

ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ ... పూలతో అలంకరించిన బతుకమ్మ ప్రకృతి సౌందర్యానికి, జీవన వైభవానికి, మానవాళికి ప్రకృతితో ఉన్న విడదీయరాని అనుబంధానికి ప్రతిబింబమని అన్నారు. ప్రకృతిని పరిరక్షి ంచడం, సహజ వనరులను గౌరవించడం, పర్యావరణం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి విలువలను ఈ పండుగ చాటిచెబుతుందని తెలిపారు.

గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో తన సతీమణి జానకిశుక్లాతో కలిసి గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్లా పాల్గొని గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

బతుకమ్మ మహిళల సృజనాత్మకతకు, ఆత్మగౌరవానికి, సామాజిక భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. జానపద గీతాలు, కళలు, సంప్రదాయ ఆచారాల ద్వారా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని సజీవంగా నిలుపుతున్న మహిళల పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ అమూల్యమైన వారసత్వాన్ని పరిరక్షి ంచి, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

ప్రకృతి పరిరక్షణ, మహిళా సాధికారత, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, సామాజిక సామరస్యానికి ప్రాధాన్యమిస్తూ తెలంగాణ పురోగతి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షి ంచారు. వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు..లోక్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో సుమారు 400 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు , లోక్‌భవన్ మహిళా ఉద్యోగులు , వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. గౌరీదేవి ప్రతి రూపాల చుట్టూ మహిళలంతా చేరి, చప్పట్లు కొడుతూ, లయబద్ధంగా ఉయ్యాల పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. కోలాటాల కోలాహలంతో అమ్మవారికి నీరాజనాలు పట్టారు. కుటుంబ క్షేమాన్ని కాంక్షి స్తూ, తమ సౌభాగ్యాన్ని నిండు నూరేళ్లు కాపాడమంటూ ఆ తల్లిని మనసారా వేడుకున్నారు. అనంతరం బతుకమ్మలను గవర్నర్ సతీమణి జానకి శుక్లా, మహిళా ఉద్యోగినులు లోక్ భవన్ లోని కొలనులో నిమజ్జనం చేశారు. కోలాట బృందాల సందడి, బతుకమ్మ పాటల మధురిమతో లోక్ భవన్ ప్రాంగణం పండుగ కళను సంతరించుకోనుంది.

రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో.. లోక్ భవన్ బతుకమ్మ పండుగ వేళ లోక్‌భవన్ రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో జిగేల్‌మంటూ వెలిగిపోయింది. పూల పండుగైన బతుకమ్మకు ఈ విద్యుత్ కాంతులు అదనపు శోభను ఇచ్చాయి.

వేడుకల్లో గవర్నర్ సంయుక్త కార్యదర్శి శ్రీ శశికిరణ్ కోమండూర్, ఉప కార్యదర్శి పల్లవి, ప్రెస్ సెక్రెటరీ మామిండ్ల దశరథం, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుల డిజిటలైజేషన్

సోలార్ వ్యవస్థల ఏర్పాటు

మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త : రాష్ట్రంలోని మార్కెట్ యార్డులను ఆధునికీకరించి, డిజిటల్ విధానంలో పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయం, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమా వేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులను సమగ్రంగా అనుసంధానించి, వాటి నిర్వహణను డిజిటల్ విధానంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే జరిగేలా వ్యవస్థను రూపొందించాలని చెప్పారు. ఈ విధానం ద్వారా మార్కెట్ల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకత పెరగడంతో పాటు అక్రమాలకు ఆస్కారం లేకుండా చూడవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి మార్కెట్ యార్డులో దశలవారీగా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే తక్కువ స్థలంలో ఎక్కువ పరిమాణంలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేలా సైలోస్ విధానంలో గోదాములను డిజైన్ చేసి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. గోదాముల నిల్వ సామర్థ్యాన్ని 2 లక్షల టన్నులకు పెంచే లక్ష ్యంతో చేపట్టాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు సరిపడా సదుపాయాలు కల్పించడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు, మార్కెటింగ్ శాఖలో అవసరమైన ఇంజనీరింగ్ అధికారుల నియామకాలను వేగవంతం చేయాలని తెలియచేశారు. నియామకాలు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుని, శాఖలో సాంకేతిక సిబ్బంది కొరతను అధిగమించాలన్నారు. అజీజ్‌నగర్‌లో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కొత్త మార్కెట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వెల్లడించారు. తూప్రాన్, గజ్వేల్, సూర్యాపేటతో పాటు ఇతర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న సమీకృత మార్కెట్లను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కోహెడ్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలన్నారు. మార్కెట్ అభివృద్ధికి సంబంధించిన పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలోని మార్కెట్ యార్డులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఇందులో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు.

చేతులెత్తి రైతులకు దండం పెడుతున్న.. వరి వేయొద్దు

>> ఎండలు, తాగునీటి కొరత ఏర్పడబోతుందని శాస్త్రవేత్తలు 2026 సంవత్సరం ప్రారంభంలోనే ప్రకటించారు అని గుర్తు చేశారు.ప్రపంచాన్ని వణికిస్తున్న అతిపెద్ద విపత్తు ఎల్‌నినో,కోవిడ్ వల్ల గతంలో ప్రపంచమే స్తంభించిపోయింది.అలాంటి సంక్షోభమే ఎల్‌నినో,భూమిపై ఉన్న ప్రతి జీవరాశిపై ఎల్‌నినో ప్రభావం ఉండబోతుంది.1950 తర్వాత చాలా సందర్భాల్లో ఎల్‌నినో వచ్చింది. కరువుగా దాన్ని పరిగణించాం.ఈసారి వచ్చిన కరువు పెద్ద విపత్తు. సూపర్ ఎల్‌నినోగా పరిగణిస్తున్నారు' అని వివరించారు. అందుబాటులో ఉన్న మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో చర్చించి ఒక కార్యాచరణను రూపొందించాం.ప్రకృతి విపత్తును ఎదుర్కోబోతున్నాం, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి అని చెప్పారు. సాగు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ కొరత కూడా ఏర్పడుతోంది. వానాకాలంలోనే ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశాం. తెలంగాణలో వరి పండించే రైతులు ఎక్కువగా ఉన్నారు.

13 లక్షల ఎకరాల్లో వరి కాకుండా ఇతర పంటలు వేశారు. 56 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు అని చెప్పారు. అక్టోబర్ నెలలో 15 వేల మెగావాట్లు ఉండాల్సిన విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగింది.అదనంగా 5 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది.రాష్ట్రంలోని 30 లక్షల పంప్‌సెట్లు ఆన్ అయ్యాయి.మార్చిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత అక్టోబర్‌లో ఉంది అని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి, విద్యుత్ శాఖ అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

20 వేల మూడు మెగావాట్ల విద్యుత్ వినియోగం ఈ రోజు జరిగింది.మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడం ద్వారా విద్యుత్ శాఖ మంత్రి, అధికారులు చిత్తశుద్ధిని చూపించారు అని చెప్పారు. ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఈ రెండేళ్లలో ఆరు, ఏడు వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది. విద్యుత్ శాఖ సమర్థవంతంగా పనిచేసి రైతులకు, ఇతర అవసరాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది అని చెప్పారు.మరో 20 రోజుల్లో వానాకాలం పంటలు కోతకు వస్తాయి.చేతికొచ్చిన పంట ఎండిపోకూడదన్న లక్ష ్యంతో మార్కెట్‌లో ఏ ధరకు విద్యుత్ దొరికినా కొనుగోలు చేసి రైతులకు అందిస్తున్నాం అని చెప్పారు.కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు కూడా విద్యుత్ కొరతతో ఉన్నాయి.రైతులు మనోధైర్యం కోల్పోకుండా మా ప్రభుత్వం విద్యుత్‌ను సరఫరా చేస్తోందని పేర్కొన్నారు. గృహ అవసరాలకు తగినట్లుగా విద్యుత్‌ను అందిస్తున్నాం.కృష్ణా బేసిన్‌లో 72 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి,గోదావరి బేసిన్‌లో 40 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి.ఈసారి 23 శాతం లోటు వర్షపాతం ఉంది.అన్ని రిజర్వాయర్లు వట్టిపోయే దశలో ఉన్నాయన్నారు.24 వేల గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాల్సి ఉంది.తాగునీటికే ఈ రోజు క్లిష్టమైన పరిస్థితి ఉంది.చలికాలం ఎండాకాలంలా ఉంది.వచ్చే 8 నుంచి 10 నెలల్లో తలెత్తే పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం అని చెప్పారు.కేంద్రం నుంచి ఎలాంటి సహకారం తీసుకోవాలనే దానిపై మంత్రుల సమావేశంలో చర్చించాం.10 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయే పరిస్థితి ఉందని నివేదికలు వచ్చాయి.

ఎట్టి పరిస్థితుల్లోనూ పంటను ఎండిపోనివ్వొద్దని అధికారులను ఆదేశించాం అని చెప్పారు.

ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడాలి.సాగుకు నీటిని పొదుపుగా వినియోగించాలి.460 టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో ఇప్పుడు కేవలం 209 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.ఈ నీటిని పంటలకు ఇస్తే కేవలం నారుమళ్లకే సరిపోతాయని పేర్కొన్నారు. 1947లో కరువు వచ్చినప్పుడు దేశమంతా రైతుల ముందు మోకరిల్లింది.దేశంలో ఎప్పుడు సమస్య వచ్చినా రైతులు ముందు నిలబడ్డారు.రైతాంగం ఎప్పుడూ రాజులాగానే వ్యవహరించింది.పేదలైనా రైతులు రాజులా వ్యవహరించారు. అందుకే దేశం ముందుకు పోయిందన్నారు. 'ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలి. దుబారా చేయొద్దు,బండ్లు,కార్లు కడుక్కోవడానికి నీటిని వాడొద్దు.చుక్క చుక్కను ఆదా చేసుకోవాలి' అని చెప్పారు. ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టడానికి కార్యాచరణను రూపొందిస్తున్నాం,గత ఏడాది ఈ సమయంలో 25 వేల మంది ఉపాధి హామీ పనులు చేస్తే, ప్రస్తుతం రెండున్నర లక్షల మంది పనుల్లో పాల్గొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో చెరువులు, కుంటలను ప్రాధాన్యతగా తీసుకుని మరమ్మతులు చేయాలని చెప్పారు. 'వానా కాలంలో నష్టపోయిన పంటతో పాటు వచ్చే సీజన్‌లో పంట వేయకుండా నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలి.కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఇచ్చే పథకాల ద్వారా రైతులను ఆదుకోవాలి కేంద్ర ప్రభుత్వం నుంచి ఉదారంగా సాయం తీసుకునే అంశంపై అధికారులు నివేదికలు తయారు చేయాలి అని చెప్పారు. ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతోంది. ప్రస్తుతం 20 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. విద్యుత్ ఉత్పత్తి చేయగలిగిన రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను తీసుకుని, మిగిలిన రాష్ట్రాలకు తక్కువ ధరకు కేంద్రం అందించాలి అని కోరారు..కోవిడ్ సమయంలో ప్రధాని మోదీ ఏం చేయమన్నా చేశాం. ఆ రోజు విధానాలు, జెండాలు మేం చూడలేదు,ఒకే విధానంలో ముందుకు వెళ్లాలన్న ప్రధాని అప్పీల్‌కు అనుగుణంగా ముందుకు వచ్చాం,ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అదే స్ఫూర్తితో వ్యవహరించాలి.

అన్ని పార్టీలు, ప్రతి పౌరుడు ప్రభుత్వానికి సహకరించాలి.ప్రభుత్వ సూచనలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి.ప్రకృతి విపత్తును కలిసికట్టుగా నిలబడి ఎదుర్కోవాలి. అందరి సహకారం ప్రభుత్వానికి కావాలి.అని కోరారు.

గురువారం సచివాలయంలో మంత్రివర్గ సహచరులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మీడియా సహకారం ప్రభుత్వానికి వందకు వంద శాతం అవసరం

ప్రభుత్వం నుంచి మీడియా కోసం ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తాం. టోల్ ఫ్రీ నంబర్ ఇస్తాం. వార్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు.. అందరితో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తాం అని చెప్పారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం అత్యంత ముఖ్యం. లేకుంటే పిట్టల్లా రాలిపోయే ప్రమాదం ఉంది.

వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశాం అని చెప్పారు. పేదలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే ఆదుకోవాలన్న కార్యాచరణను రూపొందించాం. ఎల్‌నినోను ఎదుర్కోవడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి.రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి. ఈ సమస్యను ఎదుర్కో వడంపై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది.ప్రభుత్వం నిత్యం దీనిపై అప్రమత్తంగా ఉంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాయకత్వంలో దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని వివరిస్తాం, నవంబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి నాయకత్వంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర హోంశాఖ మంత్రిని, ఇతర మంత్రులను కలుస్తాం అని చెప్పారు.ప్రజలను చైతన్యపరచడానికి కళాజాతాలను ఏర్పాటు చేస్తాం. సీనియర్ జర్నలిస్టులు, నిపుణులు పత్రికల్లో వ్యాసాలు రాయాలి.సినీ నటుడు విజయ్ దేవరకొండ ఎల్‌నినోపై ఒక విజ్ఞప్తి చేశారు.మిగిలిన సినీ నటులు, క్రీడాకారులు, కళాకారుల సహకారం తీసుకుని వారితో ప్రజలకు ఒక విజ్ఞప్తి చేయించి అప్రమత్తం చేస్తాం. అందరి సమస్య.. అందరం కలిసి విజయవంతంగా ఎదుర్కోవాలి అని చెప్పారు.

2016లోనే కోల్‌డీల్.. విచారణకు రెడీ

>> తెలంగాణ ప్రజలకు తెలుసు.. ప్రజలు అమాయకులు కాదు అని వ్యాఖ్యానించారు. గురువారం సాయంత్రం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.2015లో కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 515 టీఎంసీలు చాలని ఎవరు సంతకం పెట్టారు? సంతకం పెట్టినవాడు మనిషేనా? శాశ్వతంగా తెలంగాణకు కృష్ణా జలాల్లో మరణశాసనం రాసింది ఎవరు? కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను శాశ్వతంగా ధారాదత్తం చేసింది మీరు కాదా? అని బిఆర్ఎస్ నేతలను తప్పుపట్టారు.చంద్రబాబు ముందు మోకరిల్లి సంతకం పెట్టింది మీరు,రోజమ్మ రాగి సంకటి పెడితే రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పింది మీరు అని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరుకు నీళ్లు ఇవ్వాలని ఒక్కరోజైనా మాట్లాడారా? పాలమూరు రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఎస్ఎల్‌బీసీ, డిండి, సీతారామసాగర్‌ను ఎందుకు పూర్తి చేయలేదు అని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులపైన రూ.ఒక లక్షా 80 వేల కోట్లు ఖర్చు చేశారు. రూ.40 వేల కోట్లు బకాయిలు పెట్టిపోయారు..పాలమూరు-రంగారెడ్డి పంపులు తాము ఆన్ చేస్తే దానిపైన కూడా కడుపుమంట, కుళ్లు, కృష్ణా నీటిని శాశ్వతంగా చంద్రబాబుకు, జగన్‌కు తాకట్టు పెట్టారు అని ధ్వజమెత్తారు.కృష్ణా జాలాల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో కూడా అంత నష్టం జరగలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిందని చెప్పారు.అసెంబ్లీలో చర్చ పెడితే రావడం లేదు.కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు సిద్ధమా?మేడిగడ్డను కూలగొట్టి మళ్లీ కట్టాలని నిపుణులు చెబుతున్నారు. గోదావరిపై ప్రాజెక్టులు కట్టలేదు. ఏదో రకంగా ప్రభుత్వాన్ని బద్నాం చేయాలన్నదే ఉద్దేశం,వాళ్ల అవినీతి, దొంగతనాలపై చర్చ జరగొద్దు అన్నదే వాళ్ల ప్రయత్నం అని పేర్కొన్నారు. ఇంగితజ్ఞానం ఉపయోగించి మాట్లాడే ముందు ఆలోచించుకోవాలి, ఏపీ, మహారాష్ట్ర, బ్రిటన్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందా? అక్కడ ఎందుకు ఎల్‌నినో ప్రభావం ఉంది? అని ప్రశ్నించారు. ఎప్పుడైనా అసెంబ్లీలో గోదావరి, కృష్ణా జలాలపై మేం చర్చకు సిద్ధం,నీటి హక్కులను ఏ విధంగా హరించారో చర్చించడానికి మేం సిద్ధం..అబద్ధాలు చెప్పడం ఆపనంతకాలం మేం నిజాలు చెబుతూనే ఉంటాం అని చెప్పారు. మేం నిజాలు చెబితే మీరు తలకాయ ఎక్కడ పెట్టుకోవాలో తెలియదు..కొండపోచమ్మ నుంచి పంచపాండవుల చెరువుకు ఒక కాలువ తవ్వారు, పంచపాండవుల చెరువు నుంచి నేరుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోని 400 ఎకరాలకు నీళ్లు అందిస్తున్నారు,కేసీఆర్‌కు ఎందుకు ఈ ప్రత్యేకమైన సౌకర్యం ఉంది?దీనిపై నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేద్దామా?అని ప్రశ్నించారు.కేసీఆర్‌కు నీళ్లు ఇవ్వాల్సిన అవసరం ఏముంది?పంపుల కనెక్షన్‌ను తొలగించడానికి కేసీఆర్ ముందుకు వస్తారా?పంచపాండవుల చెరువు నుంచి నీళ్లు ఎవరి పొలాలకు వెళ్తున్నాయో చూసి తెలంగాణ ఎవరి పాలైందో చెప్పాలి మీడియా వారిని కోరారు.విద్యుత్ సంక్షోభం రాబోతుందని 1,040 మెగావాట్ల భద్రాద్రి పవర్ ప్లాంట్, 4,000 మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కేసీఆర్ హడావుడి చేశాడు, నామినేషన్ బేసిస్‌పై ప్లాంట్లు ఇస్తున్నట్లు కేసీఆర్ స్వయంగా అసెంబ్లీలో ప్రకటించారు, ఇందులో అవినీతి ఉందని మేం వ్యతిరేకించాం. ఛత్తీస్‌గఢ్ నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుపై విద్యుత్ రంగ నిపుణుడు రఘుతో పాటు అందరం వ్యతిరేకించాం అని గుర్తు చేశారు.యాదాద్రి సూపర్ క్రిటికల్ పవర్ ప్రాజెక్టు కట్టడానికి రూ.17,950 కోట్లతో ఒప్పందం చేసుకున్నారు,మూడేళ్లలో కడతామని బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం చేసుకున్నారు, యాదాద్రి పవర్ ప్లాంట్ కోసం రూ.37,781 కోట్ల వ్యయం పెరిగింది. 110 శాతం అంచనాలు పెరిగాయి అని చెప్పారు.

తొమ్మిదిన్నర కోట్ల రూపాయలు ఒక యూనిట్‌కు ఖర్చవుతోంది,అదే సమయంలో భద్రాద్రిలో ఎన్టీపీసీ కేవలం రూ.7.50 కోట్లతో యూనిట్‌ను పూర్తి చేసింది,ప్రతి మెగావాట్‌కు రెండు కోట్ల రూపాయల అంచనా పెరిగింది. దీనికి బాధ్యులు ఎవరు?అని ప్రశ్నించారు.8 వేల కోట్ల రూపాయలను అక్రమంగా ఎవరు తిన్నారు?50 శాతం ఇంపోర్టెడ్ బొగ్గు, సింగరేణిలో జీ9 బొగ్గుతో యాదాద్రిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తామని కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారు..విదేశీ బొగ్గు గురించి మేం మాట్లాడలేదు.కేసీఆర్ హయాంలో ఎంఎస్‌పీసీతో 2016లో ఒప్పందం చేసుకున్నారు, యాదాద్రికి కావాల్సిన 14 మిలియన్ టన్నుల బొగ్గులో 7 మిలియన్ టన్నుల దిగుమతి బొగ్గు కోసం డిసెంబర్ 9, 2016న ఒప్పందం చేసుకున్నారు.గ్రేడ్ 9 బొగ్గును దిగుమతి చేసుకుంటామని ఒప్పందంలో పేర్కొన్నారు అని చెప్పారు.బొగ్గు ఉత్పత్తి చేసే దగ్గరే పవర్ ప్రాజెక్టులు నిర్మిస్తారు,బొగ్గు, నీళ్లు అందుబాటులో ఉండే ప్రాంతంలోనే పవర్ ప్రాజెక్టులు కడతారు..సింగరేణి ప్రాంతంలో కాకుండా దామరచర్లలో యాదాద్రిని నిర్మించారు. గ్రేడ్ 9 వద్దు, ఏదైనా నడుస్తుందని ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు అంటున్నారని పేర్కొన్నారు.గ్రేడ్ 9 నుంచి గ్రేడ్ 18 వరకు వివిధ రకాల బొగ్గు ఉంటుంది.. గ్రేడ్ 9 కాకుండా మిగిలిన రకం బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి వాడితే బూడిద ఎక్కువగా వస్తుంది.7 మిలియన్ టన్నుల దిగుమతి బొగ్గు తెస్తున్నామని 2016లో రైల్వేకు ఒక లేఖ రాశారు, దిగుమతి బొగ్గుపై విచారణ కావాలని కేటీఆర్ లేఖ రాశారు, దిగుమతి బొగ్గుపై ఏ విచారణకైనా ఆదేశించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఏ విచారణ కావాలో కేటీఆర్ అడగాలి.

తెలుగు సాహిత్య ఉత్తమ గ్రంథాలకు

తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారాలు

హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 15, ప్రభాతవార్త : తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2025 సంవత్సరానికిగాను సాహితీ పురస్కారాలను ప్రకటించింది. పద్యకవితా ప్రక్రియల్లో దోరవేటి-దోస్తానా; వచన కవితలో బాణాల శ్రీనివాసరావు-రిత్రి సింఫణి; బాలసాహిత్యంలో పుల్లా రామాంజనేయులు-స్వర్ణగిరి కథలు; కథానికలో డా. సూర్యాధనుంజయ-ఝిళి; నవలలో చింతకింది శ్రీనివాసరావు-మున్నీటి గీతలు; సాహిత్య విమర్శలో ఏల్చూరి మురళీధరరావు-వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాస ఘట్టాలు; నాటకంలో కెకెఎల్.స్వామి-కొత్త పరిమళం; అనువాదంలో కోడిహళ్లి మురళీమోహన్-పోరాటపథం; వచన రచనలో డా. వి.వి.వెంకటరమణ-వావిళ్ల సాహితీ వికాసం; రచయిత్రి ఉత్తమ గ్రంథంలో ధూళిపాళ అరుణ-జ్ఞాపకాల సంతకం సాహితీ పురస్కారానికి ఎంపికయ్యాయని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. త్వరలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఎంపికైన వారికి పురస్కారాలు ప్రదానం చేస్తామని, పురస్కారం కింద ఒక్కొక్కరికి 20,116 రూపాయల నగదు అందజేసి అతిథుల చేతులమీదుగా ఘనంగా సత్కరిస్తామని రిజిస్ట్రార్ వెల్లడించారు.

విద్యుత్ రంగంలో ఏఐ ఆధారిత సేవలు

జాతీయ సదస్సుకు 9 మంది ఎస్‌పిడిసిఎల్ ఇంజినీర్లు

హైదరాబాద్, అక్టోబరు 15,ప్రభాతవార్త: విద్యుత్ పంపిణీ వ్యవస్థలో సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించడం, ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, వినియోగదారులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడం లక్ష్యంగా టిజిఎస్‌పిడిసిఎల్ కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా, భారత విద్యుత్ రంగాన్ని కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారితంగా తీర్చిదిద్దే అంశంపై న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి మేధోమథన సదస్సుకు సంస్థ నుంచి తొమ్మిది మంది ఇంజినీర్లను నామినేట్ చేసింది. అందులో పి.ఏ. జ్యోతిర్మయి - (డిఈ -ఐటీ) మాధవి పొతుల -(ఏడిఈ -ఐటీ) ప్రవీణ్ - (ఏడిఈ- టెక్నికల్) ప్రవీణ్ కుమార్ లింగంపల్లి (ఏడిఈ- స్టోర్స్ హైదరాబాద్) శ్రేయాన్ కొంపెల్ల -(ఏఈ -ఓఅండ్ఎం) ఐటీకి చెందిన ఏఈలు కల్యాణ్ - ఎం. రాకేష్ కుమార్, ఈ. ప్రవీణ్ కుమార్ గౌడ్, ఎం. శివశంకర్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా సిఎండీ జితేష్ పాటిల్ మాట్లాడుతూ దార్శని కతకు అనుగుణంగా ఇంజినీర్లలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఆధునిక డిజిటల్ పరిష్కారాలను విద్యుత్ పంపిణీ కార్యకలాపాల్లో వినియోగించడం వంటి అంశాలకు సంస్థ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా సీనియర్, యువ ఇంజినీర్లు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు.

సిఇసిని తొలగించాలన్న డిమాండ్‌పై
ఇండియా కూటమి నిరసనలో టివికె!

చెన్నై, అక్టోబరు 15: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం గురువారం చెన్నైలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి నిర్వహించిన నిరసనలో పాల్గొంది. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా ఈ ఆందోళన చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనలో టీవీకే పాల్గొనడం ఇదే తొలిసారి. దేశ రాజధాని ఢిల్లీలో ఓటర్ల జాబితాల్లో అక్రమాల ఆరోపణలపై నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో, చెన్నైలో కాంగ్రెస్ ఎంపీ బి. మాణికం ఠాగూర్, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి" అనే నినాదంతో ఈ ఆందోళన నిర్వహించారు. ఇండియా కూటమిలోని ఏడు భాగస్వామ్య పార్టీల నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఈనెల 3న ఇండియా కూటమిలో చేరిన తర్వాత, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని కోరుతూ చేపట్టిన ప్రచారంలో టీవీకే పాల్గొనడం ఇదే మొదటిసారి. ఈ నిరసనలో టీవీకే నాయకుడు, పాఠశాల విద్యాశాఖ మంత్రి ఎ. రాజ్‌మోహన్, విద్యుత్ చిరుతైగళ్ కచ్చి అధ్యక్షుడు, ఎంపీ తొల్ తిరుమావళవన్, మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి వైకో తదితరులు పాల్గొన్నారు. నిరసన సందర్భంగా మాట్లాడిన వీసీకే నాయకుడు ఎస్.ఎస్. బాలాజీ మాట్లాడుతూ, న్యాయం చివరికి గెలుస్తుందని, ప్రజాస్వామ్యమే విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. ఇండియా కూటమిలో పలు జాతీయ పార్టీలు ఉన్నాయని, తమిళనాడులో మాత్రం భాగస్వామ్య పార్టీల సంఖ్య పరిమితంగా ఉందని తెలిపారు. టీవీకే తమిళనాడు ఇండియా కూటమిలో చేరేందుకు ఆసక్తి వ్యక్తం చేసిందని చెప్పారు. జాతీయస్థాయిలో ఇండియా కూటమి సమావేశమై నప్పుడు టీవీకే అధికారిక చేరికకు ఆమో దం లభిస్తుందని, టీవీకే ఇప్పటికే కూ టమిలో చేరిందని ఆయన వ్యాఖ్యా నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపీ విజయ్‌వసంత్ డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ బీజేపీ తరఫున పనిచేస్తోందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య విరుద్ధమని, బీజేపీ ప్రభుత్వం ప్రజల గొంతును వినడం లేదని విమర్శించారు. ఈ నిరసనకు మరింత బలం చేకూర్చేందుకు టీవీకే కూడా పాల్గొంటోందని తెలిపారు. ఈ ఆందోళనలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అధినేత కె.ఎం. ఖాదర్ మొహిద్దీన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పాల అసైత్తంబి కూడా పాల్గొన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తమిళనాడు ఇన్‌ఛార్జ్ నివేదిత్ అల్వాతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు నిరసనకు హాజరయ్యారు. చెన్నైలో జరిగిన ఈ నిరసనకు రాజకీయంగా మరో ప్రాధాన్యం కూడా ఉంది.

కాంగ్రెస్, ద్రవిడ మున్నేట్ర కళగం మధ్య విభేదాలు పెరుగుతున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఆందోళనలకు డీఎంకే దూరంగా ఉంటూ, గతంలో తన మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్‌పై నమ్మకద్రోహం చేసిందంటూ విమర్శలు గుప్పించింది. ఈ నేపథ్యంలో టీవీకే ఇండియా కూటమి నిరసనలో పాల్గొనడం తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

ఇంటర్నెట్ నిలిపివేతపై సుప్రీంకు క్షమాపణలు చెప్పిన కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 15: దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల సందర్భంగా ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు సంబంధించి దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ వ్యవహారంపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఈనెల 10న ఢిల్లీలో భారీ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 9వ తేదీ రాత్రి 10 గంటల నుంచి 10వ తేదీ రాత్రి 10 గంటల వరకు, అంటే 24 గంటల పాటు రైసీనా హిల్స్ పరిసరాల్లోని 4 కిలోమీటర్ల వ్యాసార్థంలో సెల్యులర్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అయితే, వైఫై, బ్రాడ్‌బ్యాండ్ వంటి సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించలేదని హోం సెక్రటరీ తన అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ఢిల్లీ పోలీసులు చేసిన అభ్యర్థన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. నిరసనల సందర్భంగా మెట్రో, రైళ్లు సహా ఇతర అత్యవసర సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం ఈ ఆదేశాలను ఉల్లంఘించడమేనంటూ కోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, కేంద్ర హోం కార్యదర్శి, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సహా ఇతర ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులోనే హోం సెక్రటరీ తాజాగా క్షమాపణలు చెబుతూ అఫిడవిట్ సమర్పించారు. మరోవైపు, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సైతం తన అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. జులై 20న జరిగిన నిరసనల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం, నిరసనకారులను నియంత్రించడం కష్టతరంగా మారడం, సామాన్య ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడం వంటి కారణాలతో 10న తలపెట్టిన ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్లు ఆయన తెలిపారు. ఈ అఫిడవిట్‌లను పరిశీలించిన అనంతరం సుప్రీంకోర్టు తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.

యుపిలో 19.2 లక్షల దొంగ ఓట్లు చేర్పించారు!
ఇసిపై ఎంపి అఖిలేష్ ధ్వజం

లక్నో, అక్టోబరు 15: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ), బీజేపీపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈసీఐ చేపట్టిన సర్ ప్రక్రియ ద్వారా 19.2 లక్షల దొంగ ఓటర్లను జాబితాలో చేర్చారని అఖిలేష్ ఆరోపించారు. 2027లో జరగనున్న యూపీ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈసీఐ, బీజేపీ కలిసి ఈ మోసానికి తెరతీశారన్నారు. ఈ మేరకు గురువారం యూపీ రాజధాని లక్నోలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈసీఐ, సర్ ప్రక్రియ, బీజేపీపై విమర్శలు చేశారు. యూపీలో 19,20,732 దొంగ ఓట్లను సమాజ్‌వాదీ పార్టీ గుర్తించింది. ఇందులో ఎలక్షన్ కమిషన్ ప్రచురించని 16.18 లక్షల ఓట్లు ఉన్నాయి. మరో మూడు లక్షల అనుమానిత ఓట్లు ఉన్నాయి. ఈ జాబితా కోసం బూత్ లెవెల్ ఆఫీసర్లపై, ప్రభుత్వ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక 29 మంది సిబ్బంది కూడా మరణించారు. యూపీలో అక్టోబర్ 2025 నుంచి ఏప్రిల్ 2026 మధ్య సర్ ప్రక్రియ జరిగింది. అనంతరం ఓటర్ లిస్ట్ వెల్లడైంది. ఇందులో 87.56 లక్షల ఫాం 6 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొత్త ఓటర్లు కూడా ఉన్నారు. చివరి జాబితాలో 84.3 లక్షల కొత్త ఓటర్లు చేరారు. మొత్తం 87.56 లక్షల ఫాంలు రాగా వాటిలో 71.38 లక్షల దరఖాస్తుల వివరాల్ని మాత్రమే ఈసీ బహిరంగంగా ప్రచురించింది.

నవంబర్‌లో భారత్‌కు రానున్న నేపాల్ ప్రధాని

ఖాట్మండు, అక్టోబరు 15: నేపాల్ ప్రధాని బాలెన్ షా ఆనవాయితీకి చెక్ పెట్టారు. జెన్‌జి ప్రతినిధిగా ప్రధాని పదవి చేపట్టిన ఆయన కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ ద్వైపాక్షిక చర్చల కోసం భారత్‌ను ఎంచుకున్నారు. తనకంటే ముందువారు తొలుత చైనా, టర్కీ, యుకె వంటి దేశాలకు వెళ్లగా తను మాత్రం ఇండియాకు తొలి ప్రాధాన్యమిచ్చారు. ఇరుదేశాల మధ్య దౌత్య పరమైన చర్చల కోసం నవంబరులో ఆయన వస్తున్నారు. బాలెన్‌షా ప్రధాని అయ్యాక దేశ ప్రయోజనాల కోసం చేపడుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే కావడం విశేషం. జెన్‌జి ఆందోళనల తర్వాత నేపాల్ ప్రధాని పీఠంపై కూర్చున్న బాలెన్ షా భారత్‌తో పర్యటించనున్నారు. ఆనవాయితీ ప్రకారం మాజీ ప్రధానులు తమ తొలి విదేశీ పర్యటనకు ఇతర దేశాలను ఎంచుకోగా ఆయన మాత్రం ఇండియాకు ఒటేశారు. మార్చిలో ప్రధాని పదవి చేపట్టిన ఆయన తొలుత భారత దౌత్యాధికారులతో మాట్లాడేందుకు నిరాకరించినా.. చివరకు పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ నవంబరులోనే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చల కోసం బాలెన్‌షా విచ్చేస్తున్నారు. నవంబరు రెండు లేదే మూడో వారంలో ఆయన ఇండియా రానున్నారు. కఠ్మాండు పోస్టు ప్రకారం ఈ పర్యటన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీతో ఆయన ప్రధాన నిర్మాణపరమైన ప్రాజెక్టులు, సరిహద్దు వివాదాలు, వరదల నియంత్రణ చర్యలు వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉంది. సంప్రదాయానికి బ్రేక్ గత రెండు దశాబ్దాల కాలంలో ప్రధానులు తమ తొలి విదేశీ పర్యటనకు భారత్‌ను ఎంచుకోవడం ఇదే మొదటిసారి. 2008లో పుష్పకమల్ ప్రచండ మొదట చైనాలో పర్యటించారు. 2011లో ప్రధానిగా ఝలనాథ్ ఖనల్ ఐక్యరాజ్య సమితి సమావేశం కోసం టర్కీ వెళ్లారు. ఆపై 2021లో షేర్ బహదూర్ డీబా ప్రధానిగా తొలి ద్వైపాక్షిక చర్యలు యుకెతో జరిపారు. 2021 ప్రధాని కెపి ఓలీ తొలుత భారత్‌లో పర్యటించేందుకు అంగీకరించారు. కానీ, మాట మార్చిన ఆయన చైనాలో పర్యటించారు. కానీ, జెన్‌జి నాయకుడిగా ప్రధాని అయిన బాలెన్ షా మాత్రం తొలి విదేశీ పర్యటనకు ఇండియాను ఎంచుకున్నారు. ఆగస్టులో వరదల విధ్వంసానికి అతలాకుతలమైన నేపాల్‌క భారత్ భారగీ సాయమందించింది. టన్నుల కొద్ది నిత్యావసరాలు, మందులను వరద బాధితుల సహాయార్థం సైనిక విమానాల్లో తరలించింది. దాంతో.. ఆ కృతజ్ఞతతో ఆయన ఇండియాతో చర్చలకు ప్రాధాన్యం ఇస్తున్నారని సమాచారం.

జననీతి పార్టీ ఏర్పాటు చేసిన లక్నో మాజీ ఐఎఎస్

లక్నో, అక్టోబరు15: మాజీ ఐఏఎస్ ఆఫీసర్ దివ్యా మిట్టల్ తన రాజకీయ పార్టీ పేరును ప్రకటించారు. జన నీతి భారత్ అని పేరు పెట్టారు. ఐఏఎస్ గా ఆమె స్వచ్ఛంధ పదవీవిరమణ తీసుకున్న విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లో 2027లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయనున్నట్లు దివ్యా మిట్టల్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఆమె తన ఎక్స్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. విధాన రూపకల్పనలో ప్రజలను కేంద్రబిందువుగా మార్చనున్నట్లు ఆమె తెలిపారు. అయిదేళ్ల సమయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చేయనున్నట్లు చెప్పారు. జన నీతి పార్టీలో మీరే పాలిస్తారని ఆమె అన్నారు. ఐఐటీ ఢిల్లీ, ఐఐఎం బెంగుళూరు, వాల్ స్ట్రీట్ ట్రేడర్ అయిన దివ్యా మిట్టల్.. సుమారు 13 ఏళ్ల పాటు ఐఏఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆగస్టు 30వ తేదీన ఆమె తన పదవికి రాజీనామా చేశారు. రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఆమె సెప్టెంబర్ 29వ తేదీన ప్రకటించారు. కొత్త పార్టీ ఏర్పాటు గురించి ఆమె చెబుతూ.. దేశంలో రాజ కీయ పార్టీల కొరత ఏమీ లేదని, కానీ ప్రజా సమ స్యలను ఆలకించే పార్టీలు లేవని, కొన్ని పార్టీలు కొందర్ని మాత్రమే వింటు న్నాయని ఆమె అన్నారు. జననీతి భారత్ ప్రతినిధులు మాత్రం ప్రజలకు జవాబుదారులుగా ఉంటారన్నారు. జన నీతి భారత్ వద్ద ప్రకటనల కోసం పెద్దగా డబ్బులు లేవని,

కానీ ఇంటింటి ప్రచారంతో రంగంలోకి దిగనున్నట్లు ఆమె తెలిపారు.

రాజకీయాలు కాదు, జననీతి అన్న నినాదాన్ని ఆమె వినిపించారు.

రాజీనామా చేస్తున్న సమయంలో ఆమె లక్నో రెవన్యూ శాఖలో స్పెషల్ సెక్రటరీగా ఉన్నారు.

మార్నింగ్ వాక్‌కు వెళితే చేతికి విదేశీ కరెన్సీ బ్యాగ్
నిజాయితీతో పోలీసులకు అప్పగించిన వాకర్

అజ్మేర్, అక్టోబరు15: రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో ఓ అరుదైన నిజాయతీ ఘటన వెలుగులోకి వచ్చింది. మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ఓ వ్యక్తికి దారిలో ఓ బ్యాగు దొరకగా, అందులో ఏకంగా రూ.9.48 లక్షల విలువైన విదేశీ కరెన్సీ, కీలక పత్రాలు ఉన్నాయి. ఏమాత్రం ఆశపడకుండా ఆ వ్యక్తి దానిని పోలీసులకు అప్పగించడంతో వారు అసలు యజమానిని గుర్తించి సురక్షితంగా అందజేశారు. ఈ ఘటనపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అజ్మేర్‌లోని భోపోన్ కా బాడా ప్రాంతానికి చెందిన రాజేశ్ కుమార్ రోజూలాగే మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. సోఫియా కాలేజీ సమీపంలో రోడ్డుపై పడి ఉన్న ఓ బ్యాగును ఆయన గమనించారు. దానిని తెరిచి చూడకుండా నేరుగా సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. పోలీసులు ఆ బ్యాగును పరిశీలించగా, అందులో పాస్‌పోర్ట్, కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లు, భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ నోట్లు లభించాయి. బ్యాగులోని పత్రాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా, అది పశ్చిమ బెంగాల్‌కు చెందిన సద్దాం ఆలం అనే వ్యక్తిదని తేలింది. ఆయన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ప్రఖ్యాత అజ్మేర్ దర్గాను దర్శించుకోవడానికి ఆయన నగరానికి వచ్చారు. దర్గా దర్శనం అనంతరం ఓ టెంపోలో ప్రయాణిస్తుండగా, ప్రమాదవశాత్తు ఆయన బ్యాగు కింద పడిపోయింది. ఈ విషయం తెలియని సద్దాం ఆలం, తన బ్యాగు ఎక్కడ పోయిందోనని ఆందోళన చెందుతుండగా పోలీసులు ఆయనను సంప్రదించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బ్యాగులో 500 దినార్ల నోట్లు, 200 దినార్ల నోటు, 100 దినార్ల నోట్లు, 10 దినార్ల నోట్లు ఉన్నాయి. వీటి మొత్తం విలువ భారత కరెన్సీలో సుమారు రూ.9.48 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ నగదుతో పాటు ఆయన పాస్‌పోర్ట్, ఇతర కీలక పత్రాలను కూడా పోలీసులు సద్దాం ఆలంకు సురక్షితంగా అందజేశారు. పోయాయనుకున్న తన విలువైన వస్తువులు తిరిగి దొరకడంతో సద్దాం ఆలం తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. రాజస్థాన్ పోలీసులకు, అజ్మేర్ ప్రజలకు, ముఖ్యంగా బ్యాగును అప్పగించిన రాజేశ్ కుమార్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లక్షల రూపాయల విలువైన వస్తువులు కళ్లముందు కనపడినా, ఏమాత్రం చలించకుండా నిజాయతీని చాటుకున్న రాజేశ్ కుమార్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన చేసిన పని ఎందరికో ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు కొనియాడుతున్నారు.

సంక్షిప్త వార్తలు

మా దేశ వ్యవహారాల్లో విదేశీ జోక్యం వద్దు: అభిజిత్ దీప్కే

న్యూఢిల్లీ, అక్టోబరు 15: కాక్రోచ్ జనతా పార్టీకి అమెరికా నుంచి నిధులు అందుతున్నట్లు సింగర్ మేరీ మిల్‌బెన్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలకు సిజెపి ఫౌండర్ అభిజీత్ దీప్కే కౌంటర్ ఇచ్చారు. మా దేశ వ్యవహారాల్లో విదేశీయుల జోక్యం అవసరం లేదని దీప్కే అన్నారు. అమెరికాలో ఉన్న దోనార్లు సిజెపికి నిధులు అందజేస్తున్నట్లు మిల్‌బెన్ తన ఎక్స్‌లో పోస్టు చేశారు. విచ్ఛిన్నకర విధానంతో పనిచేస్తున్న సిజెపిని ఢీకొట్టేందుకు భారతీయ యువ దేశభక్తులు శాంతియుత ప్రదర్శన చేపట్టాలని మిల్‌బెన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన దీప్కే.. ప్రధాని ఎందుకు అమెరికన్ల మద్దతు కోరుతున్నారు, భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీయులు జోక్యం చేసుకునే హక్కు ఎవరు ఇచ్చారని దీప్కే ప్రశ్నించారు.

క్రూయిజ్ మిస్సైళ్లను పరీక్షించిన ఉత్తర కొరియా

సియోల్, అక్టోబరు 15: ఉత్తర కొరియా తన ఆయుధ సంపదను పెంచుకుంటోంది. అయితే జలాంతర్గాముల నుంచి ఫైర్ చేసే క్రూయిజ్ క్షిపణులను పరీక్షించినట్లు ఉత్తర కొరియా చెప్పింది. రెండు రకాల క్షిపణులను మిలిటరీ పరీక్షించినట్లు ఉత్తరకొరియా మీడియా పేర్కొన్నది. బుధవారం తూర్పు జలాల్లో ఈ పరీక్ష జరిగినట్లు చెప్పింది. వ్యూహాత్మక ఆయుధాలు.. న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లగలవని ఉత్తర కొరియా చెప్పింది. అయితే తాజా పరీక్ష నిజంగా సబ్‌మెరైన్ నుంచి జరిగిందా లేక అండర్‌వాటర్ టెస్ట్ ప్లాట్‌ఫామ్‌లో పరీక్ష జరిగిందా ఇంకా తెలియదు. ఈ పరీక్షతో తమ అండర్ వాటర్ యుద్ధ వ్యవస్థను పరీక్షించినట్లు స్థానిక మీడియా తెలిపింది. నేవీ సామర్థ్యాన్ని పెంచుకున్నట్లు చెప్పింది. ఈ పరీక్షలపై దక్షిణ కొరియా మిలిటరీ ఇంకా స్పందించలేదు.

సిఇసిపై ఉద్యమానికి బంగ్లాదేశ్ ఉద్యమమే మాకు స్ఫూర్తి : నేహాబోరా

న్యూఢిల్లీ, అక్టోబరు 15: భారత్‌లో కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, వామపక్ష విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహిస్తున్నాయి. తమ ఉద్యమానికి బంగ్లాదేశ్‌లో జరిగిన విద్యార్థి ఉద్యమమే స్ఫూర్తి అని ఎఐఎస్ఎ విద్యార్థి నాయకురాలు నేహా బోరా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ దుమారానికి కారణమయ్యాయి. ఈ వ్యాఖ్యలు భారతదేశంలో పాలనమార్పు లక్ష్యాన్ని సూచిస్తున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. నేహా బోరా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత్‌లో ప్రస్తుతం కనిపిస్తున్న జెన్‌జీ ఉద్యమం ముందుగా బంగ్లాదేశ్‌లో మొదలైందని అన్నారు. ఈ దేశంలో మనం చూస్తున్న జెన్‌జీ ఉద్యమం మొదట బంగ్లాదేశ్‌లో ప్రారంభమైంది. మాకు దారి చూపినందుకు, ఈ దేశ యువతకు సంఘీభావం తెలిపినందుకు మీకు అభినందనలని ఆమె ఆ వీడియోలో చెప్పింది.

28లోగా దేశం విడిచి వెళ్లండి: ఇమ్రాన్‌ఖాన్‌కు నోటీసులు

ముంబయి, అక్టోబరు 15: బాలీవుడ్ నటుడు, అమీర్ ఖాన్ మేనల్లుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసులు షాకిచ్చారు. ఈనెల 28 లోగా భారతదేశాన్ని విడిచి వెళ్లాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 10న ముంబైలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసనలో ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నాడు. ఇమ్రాన్ ఖాన్‌తో పాటు ఆయన భాగస్వామి, నటి లేఖా వాషింగ్టన్, బంధువు జైన్ మేరీ ఖాన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసులు ఇమ్రాన్ ఖాన్, లేఖా వాషింగ్టన్, జైన్ మేరీ ఖాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇమ్రాన్ ఖాన్ భారత పౌరుడు కాదని అమెరికా పౌరసత్వం ఉందని మీడియాలో కథనాలు వచ్చాయి.

బిఎస్ఎఫ్ శిబిరంలో ఆహార కల్తీ :జవాన్లకు అస్వస్థత

ఇంఫాల్, అక్టోబరు 15: మణిపూర్‌రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్) క్యాంపులో ఫుడ్ పాయిజనింగ్ జరిగింది. ఈ ఘటనలో దాదాపు 75 మంది బీఎస్ఎఫ్ జవాన్లు అస్వస్థతకు గురయ్యారు. వీరితోపాటు మరో ముగ్గురు పౌరులు కూడా అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వీరందరినీ ఆస్పత్రికి తరలించగా చికిత్స అందుతోంది. ఈ ఘటన గురువారం ఉదయం జరిగింది. ఉదయం బీఎస్ఎఫ్ జవాన్లు, ఇతర సిబ్బంది బ్రేక్‌ఫాస్ట్ చేశారు. ఆ తర్వాత కొద్ది సేపటికి ఆహారం తిన్న 78 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపునొప్పి వంటి లక్షణాలు మొదలయ్యాయి. దీంతో వెంటనే వారిని అత్యవసర ప్రాతిపదికన స్థానిక రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. 78 మంది చికిత్స పొందుతుండగా.. వారి పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

న్యాయవ్యవస్థను ఎవ్వరూ బెదిరించలేరు!
రాహుల్‌గాంధీ వివరణ ఇవ్వాల్సిందే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 15: సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరుపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఆయన వివరణ ఇవ్వాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను సహించబోమని, ఎవరూ న్యాయవ్యవస్థను బెదిరించలేరని వ్యాఖ్యా నించారు. అక్టోబర్ 12న రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల సంఘం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం రాహుల్ గాంధీ స్వయంగా సుప్రీంకోర్టుకు వెళ్లి, ఈ అంశంపై ఉమ్మడి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా రాహుల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా ఏర్పడిన గందరగోళాన్ని ప్రస్తావిస్తూ, రాహుల్ తన చర్యలపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. సర్ రద్దు చేయాలంటూ కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారించింది. అయితే రాహుల్ గాంధీ పాదయాత్రగా వెళ్లి పిటిషన్ వేయడంపై కూడా చర్చకు వచ్చింది. సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు పాదయాత్రగా రావడంపై సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి సీజేఐ స్పందిస్తూ మేము వాస్తవ ప్రపంచానికి అతీతులం కాదు. మాకు అన్ని విషయాలూ తెలుసు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేర్కు అని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజకీయ ఊరేగింపు నిర్వహించడాన్ని సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది ఆమోదయోగ్యం కాదని అన్నారు. న్యాయ వ్యవస్థను బెదిరించి, ఒత్తిడి తెచ్చే ప్రయత్నంగా అభివర్ణించారు. న్యాయవాది వ్యాఖ్యలకు ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని ఇటువంటి ప్రయత్నాలు చాలా బలహీనమైనవని, వాటిని ఎవరూ పట్టించుకోరని సూర్యకాంత్ అన్నారు. తాము వాస్తవ ప్రపంచానికి దూరంగా కూర్చోలేదని తమకు అన్నీ తెలుసని చెప్పారు. ఇక జంతర్ మంతర్ విషయమై సుప్రీంకోర్టు ఆదేశం మేరకు దానిని నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించలేదని ఎస్జీ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఒక కమిటీ ఆ సూచన చేసింది.

అరోరాలోని హిందూదేవాలయంపై కాల్పులకు కుట్ర
నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అరోరా(ఇల్లినాయిస్), అక్టోబరు 15: అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రం, అరోరా నగరంలోని ఒక హిందూ దేవాలయంపై కాల్పులకు కుట్ర పన్నడాన్ని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై తీవ్ర ఆందోళన

విజయవాడ కనక దుర్గ నేటి అలంకరణ

శ్రీ సరస్వతి దేవిగా దుర్గమ్మ

" ఘంటాశూల హలాని శంఖమునలే చక్రం ధనుస్సాయకం హస్తాబ్జెర్దధతీం ఘనాంత విలసచ్ఛీతాంశు తుల్య ప్రభామ్ గౌరీదేహ సముద్భవాం త్రిజగతామాధారాభూతాం మహా పూర్వ మత్ర సరస్వతీ మనుభజే శుంభాది దైత్యార్దినీమ్ ". ఈ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో మూలా నక్షత్రానికి ప్రత్యేక విశిష్టత ఉంది. చదువుల తల్లి సరస్వతీ రూపంతో దుర్గాదేవి దర్శన మిచ్చే రోజు. మన నాలుకపై సరస్వతి కటాక్షం ఉంటే ఒక్క మాటతో శత్రువు మిత్రుడవుతాడు. కటాక్షం లేకపోతే మిత్రుడు శత్రుడవుతాడు. అలాగే బ్రహ్మ చైతన్య స్వరూపిణిగా సరస్వతిదేవి (వాగ్దేవి)ని పురాణాలు వర్ణిస్తున్నాయి. శ్వేత పద్మాన్ని ఆసనంగా అధిష్టించి వీణ, దండ, కమండలం, అక్షమాల ధరించి, అభయ ముద్రతో భక్తుల అజ్ఞాన తిమిరాలను ఈ దేవి సంహరిస్తుంది. శ్వేత వర్ణంలో వుండే హంస ఈ తల్లికి వాహనం. ఆధ్యాత్మిక పరిభాషలో హంసను ఉచ్ఛ్వాస, నిశ్వాసలకు ప్రతీకగా పేర్కొంటారు. మన ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా ఈ తల్లి మన మనో వికాసం, బుద్ధి, జ్ఞాన చైతన్యం కలిగించి మోక్షమార్గంలో పరమపద సోపానాన్ని కలిగిస్తుంది. వ్యాసుడు, వాల్మీకి, కాళీదాసు మొదలైన లోకోత్తర చరిత్రలకు ఈమె వాగ్వైభవాన్ని వరంగా ఇచ్చింది. శరన్నవరాత్రులంటే శరత్ రుతువు కాలంలో వచ్చే మొదటి 9 రోజులు. అలాగే శారదా మాతను ఆరాధనకు ముఖ్యమైన రోజులు. అలాంటి శారదా మాతకు ప్రియమైన మూలా నక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీ దేవిగా మనకు దర్శన మిస్తుంది. సరస్వతీదేవిని కొలిస్తే విద్యార్థులకు చక్కని బుద్ధి వికాశం కలుగుతుంది. త్రిశక్తి స్వరూపాలలో సరస్వతీదేవి మూడో శక్తి స్వరూపం. సంగీత, సాహిత్యాలకు అధిష్టాన దేవత. సకల జీవుల జిహ్వాగ్రంపై ఈమె నివాసం ఉంటుంది.

అలంకారం: తెలుపు లేదా క్రీమ్ వర్ణంతో కూడిన పట్టుచీర పుష్పములు : తెల్లని పూలు

నివేదన: అమ్మవారికి దద్యోదనం, అటుకుల పాయసం

మంత్రం: "ఓం శ్రీం హ్రీం క్లీం మహాసరస్వత్యై నమః" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి. పిల్లలకు పుస్తకాలు పంచుతూ, సరస్వతీదేవి అష్టోత్తరం పఠించాలి.

- భట్టిప్రోలు నటరాజకుమార్

వేప కాయ బతుకమ్మ

బతుకమ్మ సంబురాల ఏడవ రోజు తంగేడు, గునుగు, బంతి, చెమంతి తదితర పూలను ఏడు వరసల ఎత్తుల్లో పేర్చి గౌరమ్మను వాటిపై పెడతారు. వేపకాయ బతుకమ్మగా ఆడతారు.

నైవేద్యం: సకినాల పిండిని వేపకాయ పరిమాణం చేసి నూనెలో వేయిస్తారు.

మిరియాలు - వాము

గోరువెచ్చని నీటిలో చిటికెడు ఉప్పు వేసి చింతపండు నానబెట్టాలి. కడాయి వేడయ్యాక చెంచా ధనియాలు, రెండు చెంచాల మిరియాలు, రెండు ఎండుమిర్చి, చిటికెడు జీలకర్ర, రెండు వెల్లుల్లిరెబ్బలు, కాసింత కరివేపాకు వేసి సన్నని మంటపై కొద్దిసేపు వేయించాలి. చల్లారాక పక్కన పెట్టాలి. తర్వాత అదే కడాయిలో రెండు స్పూన్ల నూనె పోసి, జీలకర్ర, శనగపప్పు, మినపప్పు, ఎండు మిర్చి, కరివేపాకు, ఇంగువ వేసి చిటపటలాడ నివ్వాలి. టమాట ముక్కలు చేసి వేసుకుని మగ్గనిచ్చి.. దంచిన మిశ్రమం, కొద్దిగా అల్లం తరుగు, పసుపు, వేసి సన్నని మంటపై మరగనిచ్చి దించేసుకోవాలి. ఇదే పద్ధతిలో మిరియాల బదుల వాము వేస్తే వాముర సం సిద్ధమైపోతుంది. వామాకులతోనూ ఈ రసాన్ని కాచుకోవచ్చు.

బతుకమ్మను పేర్చేద్దాం !

పసుపు ముద్దతో గౌరీదేవిని చేసి.. అందమైన పూల అలంకరణ మధ్య ఉంచి.. ఆటపాటలతో అమ్మని పూజించడం దగ్గర్నుంచి తిరిగి సాగనంపడం వరకు ప్రతి ఘట్టాన్నీ ఓ వేడుకలా జరుపుకొనే పండగే బతుకమ్మ. అందమైన ప్రకృతికి అద్దం పట్టే ఈ పండుగలో గౌరీదేవిని చూడచక్కని బతుకమ్మలుగా అలంకరించడం తెలిసిందే. బతుకమ్మలేకాదు.. వాటిని తయారుచేసే పద్ధతి కూడా అందంగానే ఉంటుంది. అందమైన బతుకమ్మని తయారుచేసుకోవడానికి కావాల్సిన తంగేడు, గునుగు, గోరింట, పోకబంతి.. మొదలైన విభిన్న రకాల పూలు, గుమ్మడి లేదా సొరకాయ వంటి పెద్ద ఆకులు తెచ్చుకోవాలి. ఒక పళ్లెంలో ముందుగా గుమ్మడి ఆకుని పరిచి దాని మీద గునుగు పూలను ఒక క్రమపద్ధతిలో గుండ్రంగా అమర్చుకోవాలి. తర్వాత గునుగు పూల మీద తంగేడు పూలు అమర్చుకుని వాటి మీద గులాబీ రంగులో అద్ది ఆరబెట్టుకున్న ముత్యాల పువ్వుల్ని పేర్చాలి. రెండు విభిన్నమైన రంగుల్లో లభ్యమయ్యే బంతిపూలల్లో ఒక రంగు పూలను ముత్యాల పూల వరుస మీద అందంగా అమర్చుకోవాలి. బంతిపూల మీద నీలం రంగులో ముంచిన ముత్యాల పూలను మళ్లీ పేర్చాలి. ఇప్పుడు ఇంతకుముందు పేర్చుకున్న రంగు బంతులు కాకుండా వేరే రంగు బంతిపూలను పెట్టుకోవాలి. వాటి మీద అందమైన గులాబీలను పొందికగా సర్దుకోవాలి. ఇలా తయారుచేసుకున్న బతుకమ్మ మధ్యలో ఉన్న ప్రదేశంలో గౌరీదేవిని పెట్టి పైన పూలు లేదా బంగారు లేస్‌తో అందంగా అలంకరించు కోవచ్చు. తల్లి బతుకమ్మకు తోడు పిల్ల బతుకమ్మని కూడా చూడచక్కగా సిద్ధం చేసుకుని బతుకమ్మ సంబరాలన్ని ఆనందంగా మొదలు పెట్టడమే తరువాయి. ఆటకు తీసుకెళ్లే ముందు బతుకమ్మ మీద పత్తివత్తి వేసి, అంగరబత్తీలు గుచ్చి తీసుకెళ్లాలని చాలా మందికి తెలిసిన విషయమే. పూలతో బతుకమ్మని అలంకరించుకునే క్రమంలో తంగేడు, గునుగు, ముత్యాల పువ్వులతో పాటు మనకు అందుబాటులో ఉన్న పూలను కూడా ఉపయోగించుకోవచ్చు. బతుకమ్మని పేర్చే క్రమంలో కింది భాగంలో వెడల్పుగా ఉంటూ పై భాగానికి వచ్చేసరికి గోపురంలా కనిపించేలా చేసుకోవాలి. వాటి మధ్యభాగంలో మిగతా పూలరెక్కలు, ఆకులు ఉపయోగిస్తూ నింపడం వల్ల చుట్టూ అమర్చిన పూలు అటూఇటూ కదలకుండా ఉంటాయి.

లక్ష్మీ.. రావమ్మా మా ఇంటికి !

భారతీయ సంప్రదాయంలో గాజులకు ఉన్న స్థాన ప్రత్యేకం. కేవలం చేతికి అందాన్నిచ్చే ఆభరణం మాత్రమే కాదు, అది సౌభాగ్యానికి, మంగళకరానికి ప్రతీక. కాలం మారుతున్న కొద్దీ ఫ్యాషన్ ట్రెండ్స్ మారుతున్నా, సంప్రదాయ రూపాలకు ఆధునిక హంగులు అద్ది తీర్చిదిద్దే డిజైన్లకు ఎప్పుడూ క్రేజ్ ఉంటుంది. తాజాగా మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో, ట్రెండింగ్ మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్న అద్భుతమైన లక్ష్మీ దేవి , పద్మ మోటిఫ్ గాజుల సెట్ల విశేషాలు ఇక్కడ చూద్దాం.ప్రత్యేక డిజైన్ల హారు, చిత్రంలో కనిపిస్తున్న ఈ గాజుల సెట్లు చూస్తేనే ఎవరి మనసైనా దోచుకుంటాయి. బంగారు ఆభరణాలను తలపించేలా, నిపుణులైన శిల్పుల చేతిలో రూపుదిద్దు కున్న అచ్చం కళాఖండాల లాగా కనిపిస్తాయి. గాజుల మధ్యలో సర్వసౌభాగ్యప్రదాయిని అష్ట లక్ష్మి రూపాలు, భక్తులను కట్టిపడేసే అందమైన కమలపు పూల డిజైన్లు పొందుపరచబడి ఉన్నాయి. .. రంగుల రమణీయత: ఎరుపు, పచ్చ, గులాబీ ముదురు వైన్ రంగుల గాజుల కలయికతో పాటు మధ్యలో మెరిసే స్టోన్స్, పూసల వర్క్ ఈ గాజుల అందాన్ని రెట్టింపు చేస్తున్నాయి. ఇదో రకం ట్రెండీ సంప్రదాయ చీరలు, లెహంగాలు, పట్టు వస్త్రాలపైకి ధరించడానికి ఈ హెవీ , సైడ్ బ్యాంగిల్స్ సెట్ సరిగ్గా సరిపోతుంది. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగలు, వ్రతాలు లేదా గృహప్రవేశాలు వంటి ఏ శుభకార్యమైనాసరే.. ఈ రకమైన డిజైనర్ గాజులను చేతికి వేసుకుంటే ఆ లక్ష్మీదేవి కళ నేరుగా మీ ఇంటికి వచ్చినట్లే !మీ చేతుల్లోనే అందియల అలరారుతుం టాయి. పూర్తి సాంప్రదాయ లుక్‌ని కోరుకునే మహిళలకు ఇది బెస్ట్ చాయిస్. తక్కువ ఖర్చు రాయల్ లుక్: కేవలం ఒక గ్రాము బంగారం ఫినిషింగ్‌తో లభిస్తున్న ఈ గాజులు తక్కువ ఖర్చుతోనే రిచ్ అండ్ రాయల్ లుక్‌ను అందిస్తాయి. ఇలాంటి గాజులకు రంగుల మ్యాచింగ్ చీర ,ధరించిన ట్లయితే కాంట్రాస్ట్ కలర్ ఉన్న ఈ లక్ష్మీ డిజైన్ గాజులను ఎంచుకోవచ్చు. రెండు చేతులకు మధ్యలో ఈ హెవీ లక్ష్మీ కడాలు వేసుకుని, పక్కన సన్నని పూసల గాజులు లేదా స్టోన్ బ్యాంగిల్స్ జత చేస్తే చేతులు నిండుగా, చాలా అందంగా కనిపిస్తాయి. సంప్రదాయాన్ని ఉట్టిపడిస్తూ, ఆధునిక ఫ్యాషన్‌కు సరితూగే ఈ అందమైన లక్ష్మీ ఎంబోస్డ్ గాజులతో మీ మణికట్టుకు మరింత శోభను చేకూరుస్తుంది ! -ఎస్.వి.జ్యోతి

పండంటి నిద్రకు..

రోజంతా పనిచేసి, అలసటతో పడక మీదకి చేరతాం. తీరా కంటిపై కునుకు వచ్చేసరికి వేకువజాము అవుతుంది. ఈ సమస్యకు నిపుణులు చెబుతున్న పక్కా ఫార్ములా 10-3-2-1 గురించి తెలుసుకుందాం..

పడక మీదకి చేరడానికి 10 గంటల ముందు కాఫీ, టీ వంటి పానీయాలు తీసుకోకూడదు. వీటిలోని కెఫీన్ నాడీ వ్యవస్థను ప్రేరేపించి సహజ నిద్రకు అంతరాయాన్ని కలిగిస్తుంది. మితిమీరిన కెఫీన్ తీవ్ర ఆందోళననూ దరిచేరుస్తుంది. మధ్యాహ్నం తర్వాత వీటికి దూరంగా ఉంటేచాలు. నిద్రలేమి సమస్య ఉండదు. ఇంటి పని లేదా ఆఫీసు పనిని నిద్రకు '2' గంటల ముందే ఆపేయాలి. లేదంటే వాటి తాలూకు ఒత్తిడి మెదడుపై పడి నిద్రను దూరం చేస్తుంది. అలాకాకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తే చాలు. నిద్ర పోవడానికి '3' గంటల ముందు త్వరగా జీర్ణమయ్యే డిన్నర్ తీసుకోవాలి. దీంతో జీర్ణవ్యవస్థ మెరుగ్గా పనిచేసి పొట్ట తేలికగా ఉన్న భావన కలుగుతుంది. పడకపైకి చేరిన వెంటనే హాయిగా అనిపిస్తుంది. నిద్రకు '1' గంట ముందే స్క్రీన్ చూడటం ఆపేయాలి. ఫోన్ ఛాటింగ్, టివి చూడటం వంటివాటిని ఆపేయాలి. వీటి నుంచి విడుదలయ్యే నీలికాంతి కళ్లపై ప్రభావాన్ని చూపుతుంది. మెదడుకూ ఇబ్బంది దీంతో నిద్రలేమికి కారణమవుతుంది.

కప్ తీసుకెళ్తేనే మేలు..

ప్రయాణాల్లోనూ, ఆఫీసుల్లోనూ కాఫీ, టీల్లాంటివి తాగేందుకు చాలామంది పేపర్ కప్ వాడుతుంటారు. మీరూ అలానేనా? అయితే, మీ శరీరంలోకి రోజూకొద్దీ మైక్రోప్లాస్టిక్ పదార్థాలు చేరుతున్నట్లే.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ తాజాగా దీనికి సంబంధించి సామాజిక మాధ్యమంలో చేసిన పోస్ట్ వైరలవుతోంది. 100మి.లీ వేడి వేడి పానీయాలు పేపర్ కప్పులో 15 నిమిషాలు ఉంటే చాలు... 25 వేల మైక్రోప్లాస్టిక్ ఆకృతుల ఉత్పత్తి అవుతుందని ఐఐటీ పరిశోధనలు చెబుతున్నాయి. ఇవి ఆరోగ్యానికి చేసే నష్టం అంతా ఇంతా కాదు.

అందుకే, మీరు ఎక్కడికెళ్లినా సరే.. నీళ్ల బాటిల్‌తోపాటు, ఓ కప్ కూడా వెంట పట్టుకెళ్లండి. పేపర్ కప్పులో టీ, కాఫీలు తాగటం నిషేధించండి అని సూచిస్తున్నారు. దీన్ని బట్టి. ఇక రోజుకి రెండు మూడు సార్లు పేపర్ కప్ తాగే అలవాటు వారి శరీరంలోకి దాదాపు 75 వేల మైక్రోప్లాస్టిక్ పదార్థాలు తెలియకుండానే వెళ్తాయన్నమాట.

ఇవి మహిళల్లో హార్మోన్ల అసమతుల్యతకీ, సంతానోత్పత్తి సమస్యలకీ, పిల్లల్లో ఎదుగుదల లోపాలకీ కారణమవుతాయట. కాబట్టి, ఏదైనామేర మన సొంత కప్ వాడుకోవటం ఉత్తమం.

తెర

'భరతవర్ష' నుంచి 'అమ్మ కదిలి వచ్చె' సాంగ్ రిలీజ్

మాచో స్టార్ టి. గోపీచంద్ ప్రతిష్టాత్మక చారి త్రక యాక్షన్ చిత్రం 'భరతవర్ష. సంకల్ప్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మి స్తున్నారు. పవన్ కుమార్ సమర్పి స్తున్నారు. ఇప్పటికే అద్భుతమైన విజువల్స్‌తో రూపొందించిన గ్లింప్స్, క్రీ.శ. 642 నాటి నేపథ్యంలో వచ్చిన టైటిల్ టీజర్, పవర్‌ఫుల్ తొలి పాట 'వీర జయధీర' ప్రేక్షకులను ఆకట్టు కున్నాయి. ఈ క్రమంలో నవరాత్రుల సందర్భంగా 'భరతవర్ష నుంచి రెండో పాటను ఈరోజు విడుదల చేశారు. అమ్మ కదిలి వచ్చె పేరుతో విడుదలైన ఈ పాటకు అనుదీప్ దేవ్ సంగీతం అందించారు. దుర్గాదేవి ఆరాధనలోని వైభవాన్ని, నవరాత్రి ఉత్సవాల చుట్టూ ఉండే ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని ఈ పాట అద్భుతంగా ఆవిష్కరించింది. పాట పేరుకు తగ్గట్టు గానే, ఆ ప్రాంత ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆరాధించే శూలాంభ అమ్మవారి ఉత్సవ ఊరే గింపును ఇందులో చూపించారు.

'క్రేజీ కల్యాణం'లా.. నా పెళ్లి: అనుపమ

'నవరసరాయ' డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం' ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న "క్రేజీ కల్యాణం" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. క్రేజీ కల్యాణం సినిమాకు ముందు వేరే వర్కింగ్ టైటిల్ అనుకున్నాం. ఈ సినిమా చేస్తున్న ప్రాసెస్‌లో ప్రతీది క్రేజీగా అనిపించాయి. దాంతో మా డైరెక్టర్ క్రేజీ కల్యాణం అని టైటిల్ పెట్టారు. ఇది ఫన్, ఎమోషన్ ఉన్న స్టోరీ. నరేష్, అఖిల్, తరుణ్ భాస్కర్..ఇలా వీళ్లంతా కాస్టింగ్‌లో జాయిన్ అయ్యాక మరింత క్రేజీ ప్రాజెక్ట్ అయ్యింది. ఈ సినిమా లో నాకు పెళ్లి అవుతుందా కాదా అనేది తెరపై చూడాలి. ఈ సినిమాలోలా మా ఇంట్లో నా పెళ్లి గురించి ఏమాత్రం ఒత్తిడి లేదు. నీకు ఇష్టమైనప్పుడు పెళ్లి చేసుకోమనే మా వాళ్లు అంటారు. నాకైతే పెళ్లికి ముందే ఒక బేబిని కనాలనిఉంది. మా కేరళ వివాహ వేడుకల్లో పూర్తిగా శాకాహారమే వడ్డిస్తారు. కానీ తెలంగాణ పెళ్లి వేడుకల్లో కొత్త కల్చర్ తెలుసు కున్నాను. క్రేజీ కల్యాణం సినిమాలో మా క్యారెక్టర్స్ అన్ని స్ట్రగుల్ పడుతుం టాయి. మా కష్టాలు మీకు కామెడీగా అనిపిస్తాయి. మా పాత్రల ద్వారా, ఆసందర్భాల ద్వారా ఆర్గానిక్‌గా కామెడీ జెనరేట్ అవుతుంటుంది.

'జయహో రామానుజ' ట్రైలర్ లాంచ్

ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో హీరో, డైరెక్టర్ లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ సినిమా ఇండస్ట్రీలో పాతికేళ్ల ప్రయాణం నాది. మా మొదటి సినిమా హీరో సుమన్ గారు. ఆయన ఇప్పటికీ అలుపెరుగక సినీ ప్రయాణం చేస్తున్నారు. "జయహో రామానుజ" చిత్రంలో మంచి క్యారెక్టర్ చేశారు. ఆధ్యాత్మిక విప్లవకారుడు రామానుజాచార్యుల జీవిత కథతో ఈ సినిమాను ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి రూపొందించాం. గొప్ప సినిమాలను ప్రజలు తండోపతండాలుగా థియేటర్స్ కు వెళ్లి చూస్తుంటారు. మా సినిమాకు కూడా అలాంటి ఆదరణే దక్కుతుందని నమ్ముతున్నాం. ఈ సినిమాను డబ్బుల కోసం రూపొందించలేదు. రామానుజాచార్యుల వారి గొప్ప కథను ఈ తరం వారికి చూపించాలని ప్రయత్నించాం. టెక్నికల్ గా మంచి క్వాలిటీతో మా సినిమా ప్రేక్షకుల ముందుకు ఈ నెల 24న తీసుకొస్తున్నాం అన్నారు.నటి, ప్రొడ్యూసర్ ప్రవళ్లిక మాట్లాడుతూ జయహో రామానుజ సినిమాను నిర్మించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. అందుకు మా నాన్నకి థ్యాంక్స్ చెబుతున్నా. ఈ సినిమాలో నిర్మాణ బాధ్యతల వహిస్తూనే పాటు కృష్ణుడు, నారదుడు, రఘునాథస్వామి పాత్రల్లో నటించాను.

రెండు భాగాలుగా... 'కరికాల'

సందీప్ కిషన్ హీరోగా షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మాణంలో యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న చిత్రం 'కరికాల్మ. కరికాల మూవీని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. 'కరికాల్మ మొదటి చాప్టర్ 2027 జూలై 2న , రెండో చాప్టర్ 2027 అక్టోబర్ 28న విడుదల కాబోతోన్నట్టుగా మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే గురువారం నాడు ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. దర్శకుడు యుగంధర్ ముని మాట్లాడుతూ.. .. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన నిర్మాతలు రాజశేఖర్, మహిధర్‌కి థాంక్స్. నాపై నమ్మకం పెట్టుకుని సినిమాకి ఓకే చెప్పిన సందీప్ కిషన్ గారికి థాంక్స్. అందమైన చందమామ కథలా ఈ చిత్రం ఉంటుంది. అందమైన ఊహా ప్రపంచం, నాగలోకం, వానర లోకం అని ఇలా ఓ ప్రపంచాన్ని క్రియేట్ చేయబోతోన్నాం. మేం రెండు పార్టులుగా సినిమాని ప్లాన్ చేశాం.

'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' సక్సెస్ మీట్

'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' కు ఆడియన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది: హర్ష చెముడు హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సూపర్ హిట్ 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'. బాబు డెగాల దర్శకత్వంలో చావన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి విక్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహ రించారు. అక్టోబర్ 9 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక నిగిజు జ్ఞాలో స్ట్రీమింగ్ అయిన 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' అద్భుతమైన రెస్పాన్స్ తో అదర గొడుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు. సక్సెస్ మీట్ లో హర్ష చెముడు మాట్లా డుతూ.. వంశీ ఒక ఈవెంట్‌కి వచ్చారంటే అదొక వ్యాలిడేషన్. ఆయన ఉన్నారంటే ఆల్రెడీ సక్సెస్ ఫుల్ అయి నట్లే. సాయికృష్ణ ఈ ప్రాజెక్ట్‌కు చాలా సపోర్ట్ చేశారు మా ప్రొడ్యూ సర్ సపోర్ట్ కూడా చాలా ఉంది. వంశీ నందిపాటి మాట్లాడుతూ.. ఈ సక్సెస్ ఈవెంట్‌కు రావడం చాలా ఆనందంగా ఉంది. చవన్, ఈ టివి విన్ కాంబి నేషన్ లో వచ్చిన 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' మోస్ట్ ఎలిజి బుల్ కంటెంట్‌గా మారడం చాలా హ్యాపీగా ఉంది.

'హైందవ' సినిమా టీజర్ లాంచ్

టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లా డుతూ... ఇది ఒక మిస్టరీ థ్రిల్లర్. ఇది చాలా అద్భుతమైన కథ. డైరెక్టర్ లుదీర్ కథ చెప్పగానే మాకు చాలా నచ్చింది. మహేష్ నా బెస్ట్ ఫ్రెండ్. సెవెన్త్ క్లాస్ నుంచి మేమిద్దరం క్లాస్‌మేట్స్. మహేష్ కి సినిమా చేయాలని ఉందని నాకు నిజంగా తెలియదు. మహేష్ ఎవరో కాదు, కీర్తి శేషులు డైరెక్టర్ కోడి రామకృష్ణ అల్లుడు. కోడి రామకృష్ణ మనకు ఎన్ని అద్భుతమైన సినిమాలు చేశారో మనకు తెలుసు. శ్యాం ప్రసాద్‌రెడ్డిలాంటి ప్రొడ్యూసర్లు మళ్లీ ఇండ స్ట్రీకి రావాలని నేను, మహేష్ మాట్లాడు కుంటూ ఉంటాం. ఇప్పు డున్న సమయంలో థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చే సినిమాలు చాలా ఇంపా ర్టెంట్. శ్యాం ప్రసాద్ రెడ్డిని ఇన్‌స్పిరేషన్‌గా తీసుకొని చాలా అద్భుతమైన సినిమా తీశాం. హీరోయిన్ సంయుక్త మాట్లా డుతూ.. డైరెక్టర్ లుదీర్ చాలా మంచి నరేటర్. ఆయన కథ చెప్పిన ప్పుడు నాకు చాలా నచ్చింది. ప్రతి డీటైల్‌ను చాలా అద్భుతంగా చెబుతారు. కథ వినగానే వెంటనే ఓకే చేశాను. ప్రొడ్యూసర్ మహేష్ చందు మాట్లాడుతూ.. సాయి ఈ కథను చాలా ఎగ్జైట్ అయ్యారు.మాకు చాలా సపోర్ట్ చేశారు. టీజర్ ఎంతగా ఆకట్టుకుందో, సినిమా అంత కంటే ఎక్కువగా ఆకట్టుకుంటుంది. తప్పకుండా మీ అందరికీ సినిమా నచ్చుతుంది. డైరెక్టర్ లుధీర్ బైరెడ్డి మాట్లాడుతూ.. టీజర్ లాగే సినిమా కూడా అంత ఇంపాక్ట్‌ఫుల్‌గా, పవర్ ఫుల్‌గా ఉం టుంది. 'హైందవ' కథ గురించి చెప్పాలంటే, దశావతారాల గుడి నేపథ్యంలో జరిగే కథ ఇది. నడవలేని విగ్రహాలు కథను నడిపిస్తాయి. విగ్రహాలకు, ఒక పోలీస్ ఆఫీసర్‌కు మధ్య ఎలాంటి కథ జరుగుతుందనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఎంతో సపోర్ట్ ఇచ్చిన బెల్లంకొండ సురేష్‌కి, హీరో సాయి శ్రీనివాస్‌కి ధన్య వాదాలు. ప్రొడక్షన్ డిజైనర్ డి. కామేష్ మాట్లాడుతూ.. మా నిర్మాత మహేష్ మాకు చాలా సపోర్ట్ చేశారు.

'డ్యూ డేట్'లో లాయర్ పాత్రలో సునీల్

లోమేష్ పుడిపెద్ది హీరోగా, జయశ్రీ హీరోయిన్‌గా, ప్రణీత పట్నాయక్, విజ్ఞానిలు ముఖ్యపాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'డ్యూ డేట్.' వరిష్ స్టూడియోస్ పతాకంపై పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను నిర్మాతలుగా ఆనంద్.కె. దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఇటీవల ఘనంగా పూజా కార్యక్రమాలు జరుపుకున్న సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఏకధాటిగా జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో పలు కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. కాగా ఇటీవల కమెడియన్ కృష్ణభగవాన్ డ్యూ డేట్ షూటింగ్‌లో జాయిన్ అయిన సంగతి తెలిసిందే. చాలా కాలం విరామం తరువాత కృష్ణ భగవాన్ ఈ చిత్రంలో ఓ మంచి పాత్రను పోషిస్తున్నాడు. ఆయన పాత్ర ప్రేక్షకులకు మంచి వినోదాన్ని పంచుతుంది.

ఆట

వరల్డ్ ఛాంపియన్‌షిప్:
రెజ్లింగ్‌లో విశ్వజిత్‌కు రజతం

లాస్‌వెగాస్: లాస్‌వెగాస్‌లో గురువారం జరిగిన అండర్23 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, భారత రెజ్లర్ విశ్వజిత్ రామచంద్ర మోర్, గ్రీకోరోమన్ రెజ్లింగ్‌లో భారతదేశానికి మొట్టమొదటి రజత పతకాన్ని గెలుచుకుని చరిత్ర సృష్టించాడు. పురుషుల 55 కేజీల ఫైనల్‌లో జార్జియాకు చెందిన కోబా కరుమిడ్జే చేతిలో అతను స్వల్ప తేడాతో ఓడిపోయాడు. నాటకీయమైన ఫైనల్‌లో జార్జియా క్రీడాకారుడు చివరి క్షణాల్లో విజయం సాధించి, భారత రెజ్లర్‌కు చారిత్రాత్మక స్వర్ణ పతకాన్ని దక్కకుండా చేయడంతో, మోర్ 12-13 తేడాతో ఓడిపోయాడు. అండర్23 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో రెండుసార్లు కాంస్య పతక విజేత అయిన మోర్, రెండు రోజుల క్రితం జరిగిన పోటీలో భారతదేశం తరపున మొట్టమొదటి గ్రీకోరోమన్ ఫైనలిస్ట్‌గా నిలిచి ఇప్పటికే చరిత్ర సృష్టించాడు. ఈ ఎడిషన్‌కు ముందు అండర్23 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో రెండు పతకాలు గెలిచిన దేశం యొక్క ఏకైక గ్రీకో రోమన్ రెజ్లర్ కూడా అతనే. మెక్సికోకు చెందిన ఐజాక్ మారిన్ మాతాపై 10-8 తేడాతో హోరాహోరీగా జరిగిన విజయంతో మోర్ తన ప్రచారాన్ని ప్రారంభించి, ఇరాన్‌కు చెందిన టీ20 ప్రపంచ ఛాంపియన్ అర్మిన్ షమ్సిపూర్‌తో క్వార్టర్‌ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు.

క్వార్టర్‌ఫైనల్‌లో భారత ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, 4పాయింట్ల త్రోతో 8-1 తేడాతో విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. సెమీఫైనల్‌లో, మోర్ రష్యాకు చెందిన మాలిక్ గిగీవ్‌తో మరో హోరాహోరీ పోరులో తలపడ్డాడు. ఇద్దరు రెజ్లర్లు హోరాహోరీగా తలపడినప్పటికీ, మోర్ తన సంయమనాన్ని కోల్పోకుండా 6-4 తేడాతో విజయం సాధించి ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు.

డెన్మార్క్ ఓపెన్: వరల్డ్ ఛాంపియన్ చేతిలో శ్రీకాంత్ ఓటమి

ఒడెన్స్, డెన్మార్క్: అరీనాలో గురువారం జరిగిన డెన్మార్క్ ఓపెన్ 2026 పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16లో కిదాంబి శ్రీకాంత్, 2026 ప్రపంచ ఛాంపియన్ అలెక్స్ లానియర్ చేతిలో ఓడిపోయాడు. ప్రపంచ 31వ ర్యాంకర్ శ్రీకాంత్ న్యూఢిల్లీ విజయం తర్వాత తన మొదటి టోర్నమెంట్ ఆడుతున్న ఏడవ సీడ్ ఫ్రెంచ్ ఆటగాడి చేతిలో గంటా ఆరు నిమిషాల పోరులో 21-11, 15-21, 15-21 తేడాతో ఓడిపోయాడు. శ్రీకాంత్ తన గత రెండు టోర్నమెంట్లలో క్వార్టర్ ఫైనల్ దశకు చేరుకోవడంలో విఫలమయ్యాడు. ఫిన్లాండ్‌లో జరిగిన టోర్నమెంట్లో రౌండ్ ఆఫ్ 32లో, ఆసియా క్రీడల్లో చివరి 16 దశలో అతను ఓడిపోయాడు. ఈ సీజన్‌లో అతని అత్యుత్తమ ప్రదర్శన జూన్‌లో జరిగిన యూఎస్ ఓపెన్‌లో కనిపించింది, అక్కడ అతను చైనీస్ తైపీకి చెందిన సు లి యాంగ్ చేతిలో రన్నరప్‌గా నిలిచాడు. కాగా తదుపరి జరిగే మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో అష్మిత చలిహా, తన్వి శర్మలు బరిలోకి దిగనున్నారు.

వుహాన్ ఓపెన్: సబలెంకా, పెగులా నిష్క్రమణ

వుహాన్: వుహాన్ ఓపెన్‌లో టాప్ సీడ్ అరీనా సబలెంకా, సెకండ్ సీడ్ జెస్సికా పెగులా అనూహ్య ఓటములను చవిచూడగా, చైనాకు చెందిన గ్వో హాన్యు డబ్ల్యూటీఏ 1000 టోర్నమెంట్‌లో తొలిసారిగా రౌండ్ ఆఫ్ 16కు చేరుకుంది. ఉత్కంఠభరితమైన పోరులో మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన సబలెంకాను 3-6, 6-4, 7-6 (5) తేడాతో ఓడించి, అమెరికన్ క్రీడాకారిణి ఆన్ లీ ఆమె నాలుగో వుహాన్ ఓపెన్ టైటిల్ ఆశలకు తెరదించింది. సబలెంకా 35 నిమిషాల్లో తొలి సెట్‌ను కైవసం చేసుకోగా, లీ పుంజుకుని మ్యాచ్‌ను సమం చేసింది. ఆ తర్వాత నిర్ణయాత్మక సెట్‌లో 2-5తో వెనుకబడిన ఆ బెలారసియన్, ఐదు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని తన సర్వ్‌ను నిలబెట్టుకుంది. తిరిగి బ్రేక్ చేసి, మరో రెండు మ్యాచ్ పాయింట్లను ఎదుర్కొని టైబ్రేక్‌కు దారితీసింది. నిర్ణయాత్మక దశలో లీ అనూహ్య విజయాన్ని సాధించింది. గత సంవత్సరం వుహాన్‌లో రన్నరప్‌గా నిలిచిన పెగులా కూడా, లాట్వియాకు చెందిన జెలెనా ఒస్టాపెంకో ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని 2-6, 7-6 (7), 6-3 తేడాతో గెలవడంతో టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది. పెగులా తొలి సెట్‌ను 6-2తో గెలుచుకున్నప్పటికీ, ఒస్టాపెంకో పుంజుకోవడంతో మ్యాచ్‌ను ముగించలేకపోయింది.

చైనాకు చెందిన గ్వో మరో పట్టుదలగల ప్రదర్శన కనబరిచి, అమెరికన్ కేటీ వోలినెట్స్‌ను 6-4, 4-6, 7-6 (3) తేడాతో ఓడించి, తొలిసారిగా డబ్ల్యూటీఏ 1000 ఈవెంట్‌లో చివరి 16 మందిలోకి ప్రవేశించింది.

టి20ల్లో తొలి ఆసియా జట్టుగా భారత్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో భారత క్రికెట్ జట్టు మరో అరుదైన ఘనతను సాధించింది. హైదరాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన నాల్గో టీ20 మ్యాచ్ సందర్భంగా టీమిండియా సరికొత్త రికార్డును తన పేరుతో లిఖించుకుంది. అంతర్జాతీయ టీ20 ఫార్మాట్‌లో ఏకంగా 2 వేల సిక్సర్లు బాదిన ప్రపంచంలోని రెండో జట్టుగా భారత్ నిలిచింది. అదే సమయంలో ఆసియా ఖండం నుంచి ఈ అరుదైన మైలురాయిని అందుకున్న మొట్టమొదటి దేశంగా చరిత్ర సృష్టించింది. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ భారత బ్యాటర్లు సృష్టించిన సిక్సర్ల సునామీకి ఈ రికార్డు నిదర్శనంగా నిలిచింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన జాబితాలో వెస్టిండీస్ జట్టు ప్రపంచంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. కరీబియన్ జట్టు ఇటీవల జరిగిన మ్యాచ్‌లలోనే ఈ రికార్డును మొట్టమొదటిసారిగా సాధించింది. ప్రస్తుతం వెస్టిండీస్ ఖాతాలో 2,026 సిక్సర్లు ఉండగా, నాల్గో మ్యాచ్‌లో అద్భుతంగా రాణించిన టీమిండియా ఆ సంఖ్యను అధిగమించే దిశగా అడుగులు వేస్తూ మొత్తం 2,010 సిక్సర్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈజాబితాలో 1,585సిక్సర్లతో న్యూజిలాండ్ మూడోస్థానంలో ఉండగా, పాక్1,507 సిక్సర్లతో నాల్గోస్థానంలో, సౌతాఫ్రికా 1,407 సిక్సర్లతో ఐదో స్థానంలో నిలిచాయి. ఇక వెస్టిండీస్‌తో జరిగిన నాల్గో టీ20 మ్యాచ్‌లో భారత బ్యాటర్లు మరోసారి తమ పవర్ హిట్టింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ఈ మ్యాచ్‌లో భారత జట్టు మొత్తం 13 సిక్సర్లు బాదింది. ఇందులో డాషింగ్ ఓపెనర్ సంజూ శాంసన్ 4 సిక్సర్లు కొట్టగా, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ కూడా అంతే జోరుతో 4 సిక్సర్లు సాధించారు. అలాగే యువ సంచలనం తిలక్ వర్మ 3 సిక్సర్లు బాదగా, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ తలా ఒక సిక్సర్ చొప్పున బాదారు. మరోవైపు వెస్టిండీస్ జట్టు ఈ మ్యాచ్‌లో ఏకంగా 17 సిక్సర్లు బాదడం విశేషం. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత చిన్నదైన టీ20 ఫార్మాట్‌లో పవర్‌ప్లే ఓవర్లలో దూకుడుగా ఆడటం, డెత్ ఓవర్లలో భారీ సిక్సర్లు బాదడం ద్వారా భారత బ్యాటర్లు ఈ అసాధారణ మైలురాయిని చేరుకోగలిగారు. ఆసియా దేశాలన్నింటిలోనూ సిక్సర్ల కొట్లలో మరే ఇతర దేశం కూడా ఈ స్థాయికి చేరుకోలేకపోయింది. ఈ చారిత్రక రికార్డుతో భారత జట్టు అంతర్జాతీయ స్థాయిలో తన సత్తాను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది.

నేటి నుండి టి20 సిరీస్

జింబాబ్వేతో భారత్ ఢీ

న్యూఢిల్లీ: స్మృతి మంధాన స్వదేశంలో జింబాబ్వేతో జరిగే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో భారత మహిళల క్రికెట్ జట్టు పూర్తిస్థాయి కెప్టెన్‌గా తన పదవీకాలాన్ని ప్రారంభించనుంది. భారత్, జింబాబ్వే మధ్య జరిగే మూడు టీ20 మ్యాచ్‌లు రాయ్‌పూర్‌లో జరగనున్నాయి. ఈ సిరీస్ అక్టోబర్ 16న ప్రారంభం కానుంది. రెండో మ్యాచ్ అక్టోబర్ 18న జరగనుండగా, అక్టోబర్ 20న సిరీస్ ముగుస్తుంది.

భారత్ జట్టులో స్మృతి మంధాన కెప్టెన్‌గా షఫాలీ వర్మ వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. గత నెల ఐచినగోయాలో తమ ఆసియా క్రీడల టైటిల్‌ను విజయవంతంగా కాపాడుకున్న తర్వాత భారత్‌కు జింబాబ్వే సిరీస్ తొలి సిరీస్ కానుంది. అన్ని ఫార్మాట్లలోనూ భారత కెప్టెన్సీ నుంచి హర్మన్‌ప్రీత్ కౌర్ వైదొలగిన తర్వాత ఈ నాయకత్వ మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే, మాజీ కెప్టెన్ క్రీడాకారిణిగా కొనసాగుతూనే ఉంటారు. ఇక టీమిండియాకు పలు బలహీనతలు ఉన్నాయి. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలి వర్మ ఇస్తున్న మెరుపు ఆరంభాన్ని మిడిల్ ఓవర్లలో కొనసాగించడంలో బ్యాటర్లు తడబడుతున్నారు. మూడో నంబర్ స్థానం కోసం అనేక ప్రయోగాలు జరుగుతుండగా, మాజీ కెప్టెన్ హర్మన్ప్రీత్ కౌర్ పేలవ ఫామ్ జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం స్పెషలిస్ట్ బ్యాటర్ గానే ఆడుతుండటంపై ఒత్తిడి నెలకొంది. ఇక రిచా ఘోష్కు తోడుగా లోయర్ ఆర్డర్లో భారీ షాట్లు కొట్టే పవర్ హిట్టర్లను తయారు చేయాల్సిన అవసరం ఉంది. మరోపక్క ఫీల్డింగ్, పేస్ బౌలింగ్ లోపాలు ఉన్నాయి. ఫీల్డింగ్‌లో నిలకడలేమి జట్టును తరచూ దెబ్బతీస్తోంది. స్పిన్ విభాగం బలంగా ఉన్నప్పటికీ, పేస్ అటాక్లో పదును పెరగాల్సిన అవసరం ఉంది. యువ సంచలనం నందిని శర్మ రాణిస్తుండటం సానుకూలాంశం. కాగా జింబాబ్వే సిరీస్‌కు కొత్త ఆటగాళ్లకు ఛాన్స్ వచ్చింది శ్రీ చరణి స్పిన్ ప్రదర్శన ఆకట్టుకోగా, లెగ్ బ్రేకర్ బౌలర్ ప్రేమా రావత్కు మరిన్ని అవకాశాలు ఇవ్వాలని భావిస్తున్నారు. ఈ జట్టులో నికి ప్రసాద్, జితిమణి కలిత లాంటి కొత్త ముఖాలకు చోటు దక్కింది. జింబాబ్వే జోరుతో ఉంది. జోసెఫిన్ ఎన్కోమో నాయకత్వంలో బరిలోకి దిగుతున్న జింబాబ్వే జట్టు, గత నెలలో వెస్టిండీస్‌పై వన్డే విజయం సాధించిన జోరు మీద ఉంది. కాబట్టి ఈ టూర్‌ను తక్కువ అంచనా వేయలేం.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.13.38 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబరు 15: భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నట్లు సూచిస్తూ ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో భారీ వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈనెల 14 నాటికి నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.13.38 లక్షల కోట్లకు చేరాయి. గత యేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 13.21 శాతం అధికమని ఆదాయ పన్ను శాఖ నేడు విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కార్పొరేట్ పన్ను, నాన్ కార్పొరేట్ పన్ను అంటే వ్యక్తిగత ఆదాయ పన్ను, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ ఎస్‌టిటి వసూళ్లు పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణంగానిలిచింది. రిఫండ్‌లను సర్దుబాటు చేయక ముందు, స్థూల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 14.89 శాతం పెరిగి రూ.16.03 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఈ వసూళ్లు రూ.13.95 లక్షల కోట్లుగా ఉన్నాయి. మరోవైపు ఈ యేడాది పన్ను చెల్లింపుదారులకు జారీ చేసిన రిఫండ్‌లు కూడా గణనీయంగా పెరిగాయి. గతేడాదితోపోలిస్తే రిఫండ్‌లు 24.22 శాతం పెరిగి రూ.2.65 లక్షల కోట్లకు చేరినట్లు ప్రభుత్వ డేటా వెల్లడించింది. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.4.97 లక్షల కోట్ల నుంచి రూ.5.99 లక్షల కోట్లకు పెరిగాయి. వ్యక్తులు, ఇతర సంస్థలు చెల్లించే నాన్‌కార్పొరేట్ పన్నుల నికర వసూళ్లు రూ.6.54 లక్షల కోట్ల నుంచి రూ.6.92 లక్షల కోట్లకు చేరాయి. ముఖ్యంగా స్టాక్ మార్కెట్ లావాదేవీలపై విధించే ఎస్‌టీటీ నికర వసూళ్లు రూ.30,901 కోట్ల నుంచి రూ.46,840 కోట్లకు పెరిగి బలమైన వృద్ధిని నమోదు చేశాయి. స్థూల వసూళ్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. గ్రాస్ కార్పొరేట్ ట్యాక్స్ కలెక్షన్లు రూ.6.44 లక్షల కోట్ల నుంచి రూ.7.53 లక్షల కోట్లకు, గ్రాస్ నాన్‌కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు రూ.7.20 లక్షల కోట్ల నుంచి రూ.8.03 లక్షల కోట్లకు పెరిగాయి.

జియో ఐపిఒ 21న షురూ

ఒక్కోషేరు ధర రూ.1065-1,119:
జియో చైర్మన్ ఆకాష్ అంబాని

ముంబయి, అక్టోబరు 15: భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన వాటాను సాధించడమే లక్ష్యంగా రిలయన్స్ జియో ముందుకు సాగుతోందని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాష్ అంబానీ తెలిపారు. 2031 నాటికి భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విలువ 1.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆయన అంచనా వేశారు. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపిఒకు ముందు గురువారం నిర్వహించిన మీడియా మీట్‌లో భారత్‌ను ప్రపంచస్థాయి డిజిటల్ సమాజంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో జియో పనిచేస్తోందని ఆయనపేర్కొన్నారు. జియో ప్లాట్ ఫామ్స్ తన ఐపిఒద్వారా గరిష్ఠంగా రూ.30,213 కోట్లను సమీకరిం చాలని లక్ష్యంగాపెట్టుకుంది. ఈ పబ్లిక్ ఇష్యూ ఈనెల 21న ప్రారంభమై 23న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం 19న బిడ్డింగ్ ప్రక్రియ జరుగుతుంది. దేశంలోని ప్రతి ఇంటికి, ప్రతి పౌరుడికి, ప్రతి వ్యాపార సంస్థకు నాణ్యమైన, అందుబాటుధరల్లో డిజిటల్ సేవలను అందించడమే జియో ప్రధాన లక్ష్యమని ఆకాష్ అంబానీ తెలిపారు. కృత్రిమ మేధ (ఎఐ), క్లౌడ్ కంప్యూటింగ్, ఇతర డిజిటల్ సాంకేతిక రంగాల్లోకి విస్తరిస్తూ భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సంస్థ భావిస్తోందని చెప్పారు. భారతదేశ డేటావినియోగంలో 60 శాతానికి పైగా జియో వాటా ఉందని ఆయన పేర్కొన్నారు. ఐపిఒ ద్వారా సమీకరించే మొత్తాన్ని పూర్తిగా రుణాల చెల్లింపునకు వినియోగిస్తామని, తద్వారా నికర రుణరహిత సంస్థగా మారేందుకు కృషి చేస్తామని ఆకాష్ అంబానీ వెల్లడించారు. జియో ప్లాట్‌ఫామ్స్ భారత్‌తో పాటు విదేశాల్లో మొత్తం 7,220 పేటెంట్ దరఖాస్తులను సమర్పించి నట్లు ఆకాష్ అంబానీ తెలిపారు. ప్రపంచ మేధో సంపత్తి సంస్థ 2025 పేటెంట్ కోఆపరేషన్ ట్రీటీ ర్యాంకింగ్స్‌లో ప్రపంచంలోని టాప్20 పేటెంట్ దరఖాస్తుదారుల్లో చోటు దక్కించుకున్న ఏకైక సంస్థగా జియో నిలిచిందన్నారు. జియోప్లాట్‌ఫామ్స్ ఐపిఒలో ఒక్కో షేరుకు రూ.1,065 నుంచి రూ.1,119 ధరల శ్రేణిని నిర్ణయించింది. గరిష్ఠ ధర వద్ద ఐపిఒ ద్వారా రూ.30,213 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. ఈ ధర ప్రకారం సంస్థ విలువ సుమారు రూ.10.3 లక్షల కోట్లు అంటే దాదాపు 108.3 బిలియన్ డాలర్లుగా ఉంటుంది. ఈ ఐపిఒలో రూ.10 ముఖ విలువ కలిగిన గరిష్ఠంగా 27 కోట్ల కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నారు. ఇది ఫ్రెష్ ఇష్యూ కావడంతో, షేర్ల విక్రయం ద్వారా వచ్చే మొత్తం ప్రస్తుత వాటాదారులకు కాకుండా నేరుగా సంస్థకు అందుతుంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.